Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:287 • ఆదివారం 28 జనవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 6.00 •

Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

• ఐపీఎల్-11 వేలం షురూ...



బెన్ స్టోక్స్ 12.5 కోట్లు





రాహుల్, పాండే రూ.11 కోట్లు

భారత యువ ఆటగాళ్లకు భలే గిరాకి

స్టువార్ట్ బిన్నీ రూ.50 లక్షలు

చెన్నై సూపర్ కింగ్స్‌లో అంతా 30ప్లస్సే



ఢిల్లీ జట్టులోకి గంభీర్

రాజస్తాన్ రాయల్స్‌కు అశ్విన్

గేల్‌ను పట్టించుకోని ఫ్రాంఛైజీలు

వివరాలు 11లో...

ఈ ఏడాది ఖరీఫ్ నుంచే క్రాప్ కాలనీలు

తగ్గిపోతున్న కొన్ని పంటల సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాంతాల వారీగా వేర్వేరు విధానాలను రూపొందించుకుంటున్నారు. గ్రామస్థాయిలో రైతుల అవసరాలను గుర్తించి, స్థానికంగా పంటల సాగుకు గల అవకాశాలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారు. రెండు ఎకరాల కన్నా తక్కువ భూమి కలిగి ఉన్న వారే అధికంగా ఉన్నందున వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు క్రాప్ కాలనీలు దోహదపడతాయి.

పంటల ఎంపికలో సమతుల్యత

అధునాతన సాగువిధానంపై శిక్షణ

ఇజ్రాయెల్ దేశ సాగువిధానాలపై

రైతుల్లో అవగాహన కల్పన

అనుసంధానకర్తలుగా

రైతు సమన్వయ సమితి సభ్యులే

చిన్న కమతాలే లక్ష్యంగా

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయోత్పత్తుల హెచ్చుతగ్గులను నియంత్రించి అన్ని సమయాల్లో కనీస మద్దతు ధరలు అమలయ్యేలా ప్రభుత్వం వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. ముందుగా ప్రకటించిన విధంగానే ఈ ఏడాది ఖరీఫ్ నుంచి పంటకాలనీలను అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఊరుఊరంతా రైతులు మూకుమ్మడిగా ఒకే పంట సాగు చేయడం ద్వారా తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ఆదేశాలిచ్చారు. 2018 ఖరీఫ్‌లో రైతులు లాభదాయకమైన పంటలను మాత్రమే సాగు చేసి కష్టాల నుంచి గట్టెక్కేలా చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇకనుంచి పంటల ఎంపికలో ఇష్టారాజ్యపు నిర్ణయాలకు స్వస్తి చెప్పి, సాగు నేలల స్థితిగతులను బట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు అధిక దిగుబడులనిచ్చే కొత్త వంగడాలను పరిచయం చేస్తారు. క్రాప్ కాలనీల ఏర్పాటులో కొత్తగా ఏర్పాటు చేయబడిన గ్రామ రైతు సమన్వయ సమితుల్లోని సభ్యులే అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తారు. అలాగే ఇజ్రాయిల్ దేశంలో అవలంభిస్తున్న అధునాతన సాగు విధానాలపై అధ్యయనం చేసి ఇక్కడి రైతులకు పరిచయం చేసేందుకు చర్యలు ప్రారంభించారు. అందుకోసం 1000 మంది వ్యవసాయాధికారులను దశల వారీగా ఆ దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆ తర్వాత ప్రతి గ్రామం నుంచి ఎంపిక చేసిన కొంతమంది రైతులతో పాటు సమన్వయ సమితి సభ్యులను కూడా ఇజ్రాయిల్‌కు పంపించి కొత్తకొత్త సాగు విధానాలపై అవగాహన కల్పిస్తారు. అందుబాటులో ఉన్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ వ్యవసాయ రంగాన్ని సస్యశ్యామలం చేయాలన్న దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. చిన్న, సన్నకారు రైతులకు భారీ ప్రోత్సాహకాలను అందిస్తూ చేయూతనిచ్చేందుకు చర్యలు ప్రారంభించింది. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా సాధ్యమైనంత

3వ పేజీలో...

చిన్నారి జ్యోత్స్నకు సీఎం కేసీఆర్ చేయూత

3లో



సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షమా.. పరోక్షమా?

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సర్కార్ మల్లగుల్లాలు

వాయిదావేసి ప్రత్యేక అధికారులకు బాధ్యతల అప్పగింత

ఓటరు జాబితాల సవరణపై అధికారుల సూక్ష్మశోధన

సీఎంకు నివేదిక ఇచ్చిన పంచాయతీరాజ్ అధికారులు

వారంలోగా నిర్ణయం వెలువడే అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇప్పుడున్న పరిస్థితుల్లో పంచాయతీరాజ్ ఎన్నికల ప్రక్రియ అత్యంత క్రియాశీలకం కాబోతోంది. ఇప్పటి వరకున్న పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షంగా జరుగుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. గత కొన్ని

8వ పేజీలో...

వివాదాల సుడిలో గవర్నర్?



ప్రభుత్వ విధుల్లో జోక్యమని విమర్శలు

నాడు కేంద్రానికి అపార నమ్మకం

నేడేమో తప్పని తలనొప్పులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: తెలుగురాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ విమర్శల్ని ఎదుర్కొంటున్నారు. గతంలో కూడా పలువురు గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టడం, ప్రభుత్వాల సామర్థ్యంపై కేంద్రానికి తప్పుడు నివేదికలివ్వడం, రాష్ట్ర ప్రభుత్వాల్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించాలంటూ సిఫార్సు చేయడం, సభలో బలాబలాల లెక్కింపులో ఇష్టానుసారంగా వ్యవహరించడం వంటి పలు ఆరోపణల్ని ఎదుర్కొన్నారు. కొందరైతే ప్రజాస్వామ్యాన్ని కూలదోస్తున్నారంటూ విమర్శలపాలయ్యారు. నరసింహన్ మాత్రం ఇందుకు విరుద్ధమైన ఆరోపణలతో విమర్శకుల నోళ్ళలో నానుతున్నారు. నరసింహన్ తన గవర్నర్‌గిరి పరిధికి మించి ప్రభుత్వ విధుల్లో చేయెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. వ్యక్తిగత హోదాలో పాలకుల్ని మెచ్చుకోవడం, పాలనాతీరును బహిరంగంగా ప్రశంసించడం, గవర్నర్‌గా ప్రభుత్వ పథకాల్ని సమీక్షించడం, నేరుగా ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాల్లో పర్యటించి పరిశీలనలు జరపడం.. ఇలా ఆయన చర్యలు గవర్నర్ హోదాకు తగినట్లుగా లేవన్న విమర్శలు ఉన్నాయి. కేసీఆర్ చక్కగా పాలిస్తున్నారని, తెలంగాణలో ప్రభుత్వ పనితీరు అద్భుతంగా ఉందంటూ ఆయన వ్యక్తిగత హోదాలో తరచూ ప్రశంసల జల్లు కురిపిస్తుంటారు. తెలంగాణ ప్రభుత్వ కార్యక్రమాలు

3వ పేజీలో...

ఆల్మట్టిపై మరో లిఫ్ట్

కర్ణాటక జల చౌర్యం

కృష్ణా.. ఇక ఎడారే

తెలుగు రాష్ట్రాలకు పొంచిఉన్న ముప్పు

మరో 3 ప్రాజెక్టులకు కర్ణాటక సన్నాహాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగురాష్ట్రాలకు మరో జలగండం. అసలే.. కృష్ణా జలాల కొరతతో.. నదీపరివాహక ప్రాంతమంతా సాగుకు, తాగునీటికి కటకటలాడుతున్న పరిస్థితుల్లో ఎగువరాష్ట్రం వేస్తున్న ఆనకట్టలతో.. తెలుగురైతుల సాగుకు మరింత కష్టం. ఇప్పటికే కర్ణాటక నిర్మించిన ఆల్మట్టి ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టుల వల్ల కృష్ణాజలాలు.. కుచించుకుపోగా, తాగునీటికోసం కూడా తెలంగాణ ప్రభుత్వం కర్ణాటకను బ్రతిమిలాడుకుంటున్న పరిస్థితి. ఇక ఏపీకి ఎగువన ఉన్న తెలంగాణలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఏపీకి కృష్ణాజలాలు చేరాలంటే మరింత ఇబ్బందే. భారీవర్షాలు, వరదలు వచ్చినా.. ఎగువ రాష్ట్రంలో నిర్మించి ప్రాజెక్టుల కారణంగా.. తెలంగాణ, ఏపీల కృష్ణాఆయకట్టును పరిరక్షించే నాగార్జునసాగర్ నిండని పరిస్థితి నెలకొంది. తాగునీటి కోసం కూడా రెండు రాష్ట్రాలు కలహించుకుని, ఆవేశకావేశాలకు వెళ్ళి.. బాహాబాహీకి సిద్ధపడి కేసులు పెట్టుకున్న పరిస్థితులున్నాయి. అరకొర

2వ పేజీలో...

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ ద్వాదశి రా. 2.45 వరకు, అనంతరం త్రయోదశి; నక్షత్రం: మృగశిర రా. 11.30 వరకు, అనంతరం ఆరుద్ర; అమృతకాలం: మ. 3.20 నుండి 4.50 వరకు; వర్జ్యం: ఉ. 7.40 వరకు; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు;

ఔరా..!





ఆస్పత్రి ఆవరణలోనే క్షతగాత్రులకు చికిత్సలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

కాబూల్‌పై అంబులెన్స్ బాంబ్

మరోసారి రక్తమోడిన ఆఫ్ఘన్ రాజధాని • ఉగ్రదాడిలో 95మంది దుర్మరణం • 158మందికి పైగా గాయాలు • మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులు • దౌత్య కార్యాలయాలే లక్ష్యంగా దాడి • తాలిబన్ల పనే • అనాగరిక, పిరికిపంద చర్య: భారత్ ఖండన

12లో

• గ్యాంగ్ వార్...

నైట్ క్లబ్‌లో కాల్పులు

14మంది మృతి

మృతుల్లో పిల్లలు

15మంది సాయుధుల చొరబాటు

పార్టీలో విషాదం

రియోడిజనిరియో: నైట్ క్లబ్‌లోకి చొరబడిన గన్‌మెన్లు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో కనీసం 14 మంది మరణించారు. గాయపడిన ఆరుగురిలో కొందరు పిల్లలు ఉన్నారు. ఈశాన్య బ్రెజిల్‌లోని ఫోర్టలెజాలో కజజెయిరాస్ ప్రాంతంలోని ఫొర్రో డొ గాగో నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి 01.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. పార్టీ చేసుకుంటున్న వారిపై గన్‌మెన్లు జరిపిన కాల్పుల్లో 14 మంది మరణించామని

3వ పేజీలో...



గణతంత్రంలో... ఆయుధ మంత్రమేది?

సంక్షేమ పథకాల ప్రదర్శనకే పెద్దపీట • సైనిక పాటవం దేశభద్రతకు చిహ్నం • అప్పుడే సగటు మనిషికి ధైర్యం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

69వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణతీరు విమర్శకులకు రుచించడం లేదు. న్యూఢిల్లీలో ఈ వేడుకలు అట్టహాసంగానే జరిగాయి. పదిమంది విదేశీ పాలకులు అతిథులుగా హాజరయ్యారు. సంప్రదాయం మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సైనికదళాల వందనాన్ని స్వీకరించారు. మాజీ పాలకుల నుంచి చట్టసభల ప్రతినిధులు, అత్యున్నత అధికారులు ఈ వేడుకను స్వయంగా తిలకించారు. అయితే ఈసారి గణతంత్ర వేడుకలు నిర్దేశిత లక్ష్యానికి విరుద్ధంగా సాగాయి. గతంలోలా భారత ఆయుధ సంపత్తిని ఈ వేడుకల్లో ప్రదర్శించలేదు. నాలుగైదు రకాల సైనిక శకటాలు, ఆయుధాలకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైంది. మహిళా సైనికులతో సహా పలువురి అత్యద్భుత విన్యాసాలు దేశ ప్రజల్ని ఆకట్టుకున్నాయి. అంతకుమించి ప్రభుత్వం తాము అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రచారానికే ఈ వేడుకల్ని ఎక్కువగా వినియోగించుకుంది. అందుకు సంబంధించిన శకటాలు, కార్యక్రమాలకే వేడుకల్లో అధిక ప్రాధాన్యత లభించింది. ఆసియన్ దేశాల అధిపతులంతా ముఖ్యఅతిథులుగా హాజరైన ఈ వేడుకల ద్వారా కూడా ప్రధాని మోడి దేశవాణిజ్య, పెట్టుబడి అవసరాల్ని నెరవేర్చుకునే ప్రయత్నాలు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. తమ ప్రభుత్వం సాధిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని వారికి ప్రదర్శించడం ద్వారా దేశంలోకి పెట్టుబడులను, వినిమయ వస్తువుల్ని ఆకర్షించే ప్రయత్నం సాగిందన్న విమర్శలొస్తున్నాయి.

ఏ దేశానికైనా జాతీయ దినోత్సవాల్ని తమ సామర్థ్య ప్రదర్శనకు వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇలాంటి సందర్భాల్లోనే తామ కొత్తగా సమకూర్చుకున్న ఆయుధాలు, శకటాలు, సాంకేతిక పరిజ్ఞాన పరికరాల్ని ప్రజలకు ప్రదర్శిస్తారు. భారత్‌లో కూడా దీర్ఘకాలంగా ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ప్రదర్శనల వల్ల సాధారణ ప్రజల్లో తమ భద్రత పట్ల ఓ భరోసా ఏర్పడుతుంది. దేశం సమకూర్చుకున్న సైనిక సామర్థ్యం, ఆయుధ సంపత్తిలను చూసి ప్రతి హృదయం గర్వంతో ఉప్పొంగిపోతుంది. సరిహద్దు దేశాలతోపాటు ఎవరు తమపై దాడికొచ్చినా ఎలాంటి ప్రమాదం లేదన్న ధీమా ఏర్పడుతుంది. అసలే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా యుద్ధమేఘాలు ఆవరించున్నాయి. అమెరికా, ఉత్తరకొరియాల మధ్య ఏ క్షణం ఏ విధంగా యుద్ధం మొదలవుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. పక్కనున్న చైనా, పాక్‌లు తరచూ భారత్‌ను కవ్విస్తున్నాయి. ఇప్పటికే

3వ పేజీలో...

పసికందు శరీరంలో బాంబు



కాబూల్: తాలిబన్ల దుర్మార్గానికి పరాకాష్టగా నిలిచే సంఘటన ఇది. కాబూల్ నుంచి 330 కిలోమీటర్ల దూరంలోని కుందూజ్ ప్రావిన్స్‌కు పేలుడు పదార్థాలు రవాణా చేయడానికి తాలిబన్ ఉగ్రవాదులు నాలుగేళ్ల పసికందును ఎంచుకున్నారు. ఆమె దుస్తులలో శక్తిమంతమైన పేలుడు పదార్థాలను చుట్టి ఉంచారు. కుందూజ్‌లో ఆ పసికందు దుస్తులలోపేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించిన భద్రతా

10వ పేజీలో...

శునకానికి బంగారం మొక్కు..!



కరీంనగర్, ప్రభన్యూస్: సర్వసాధారణంగా సమ్మక్క-సారలమ్మ జాతర అనగానే చిన్నారుల, పెద్దల నిలువెత్తు బంగారం మొక్కు సమర్పించడం కామనే అయినా.. కరీంనగర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 21కేజీల తన పెంపుడు కుక్క బాగు కోసం కుక్క ఎత్తు బంగారం అమ్మవారికి పేరిట సమర్పించడం అక్కడి వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. కరీంనగర్ నగరంలోని వీరాంజనేయ స్టీల్, ఫర్నిచర్ షాపు

10వ పేజీలో...

హైటెక్ రైతు బజార్

- రైతులకు అన్ని వసతులు ఏర్పాటు
- కార్పోరేట్ సంస్థలకు దీటుగా ఆధునిక నిర్మాణం
- మంత్రి హరీశ్ చొరవతో శాశ్వత భవనం ఏర్పాటు



సిద్దిపేట, ప్రభన్యూస్ : సిద్దిపేట రైతు బజారు కొత్త రూపు సంతరించుకుంటుంది. ఆధునిక రీతిలో హైటెక్ వసతులతో నిర్మిస్తున్న రైతుబజార్ సముదాయాన్ని చూస్తుంటే మనం సిద్దిపేటలోనే ఉన్నామా అన్న ఆశ్చర్యం కలుగకమానదు. ఆ స్థాయి పనులు జరుగుతున్నాయి. అన్ని సవ్యంగా జరుగుతున్న నేపథ్యంలో మరికొద్ది రోజుల్లోనే కొత్త రైతుబజార్ రైతుల కళ్ళముందు ఆవిష్కృతం కానుంది. పాత రైతు బజారులోనే ఉన్న కొద్ది స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని రైతులకు అన్ని వసతులతో, పట్టణ వాసులకు చేరువలో రైతు బజారు సముదాయానికి కార్యరూపం ఇస్తున్నారు. రైతుల వసతులను దృష్టిలోపెట్టుకొని మంత్రి హరీష్‌రావు పట్టు దల, కృషితో కూరగాయల మార్కెట్ రూపు సంతరించుకుంది.

1999 సంవత్సరంలో సిద్దిపేటలో రైతు బజారు అందుబాటులోకి వచ్చింది. రైతు బజార్ పుణ్యమాని పరి సర గ్రామాల వ్యవసాయ క్షేత్రాలు కూరగాయల పం టలకు నిలయంగా మారాయి. అప్పటి పరిస్థితుల్లో తాత్కాలిక రేకుల షెడ్లతో ప్రారంభమైన రైతు బ జార్ విజయవంతంగా కొనసాగింది. సిద్దిపేట పరిసర ప్రాంత ప్రజల తాకిడి పెరుగడంతో రైతు బజారు ప్రతి నిత్యం కిక్కిరి సిపోయింది. ఈ సమస్యను గమనించిన మంత్రి హరీష్ రావు రూ. 7కోట్ల నిధులతో ఆధునిక రీతిలో రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు ఏడాది కాలంలోనే నిర్మాణ పనులు పూర్తి చేసుకుని నేడే రేపో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభం కానుంది. మంత్రి నిరంతరం పర్యవేక్షణతో పనులు సకాలంలో పూర్త య్యేలా అధికారులను పరుగులు పెట్టించారు. నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు బజారుకు తుది మెరుగులు దిద్దుకుం టున్నాయి.

హైటెక్ హంగులతో నిర్మించిన రైతు బజార్ సముదాయంలో రైతులకు వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించారు. స్థలాభావం వల్లసెల్లార్‌తో పాటు జీ ప్లాస్ 1 రీతిలో భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్, మొదటి అంతస్తు ఒక్కోదానిలో 10 వేల చద రపు అడుగుల వైశాల్యంతో

రైతులకు ఆధునిక వసతులతో స్టాళ్లు

నిర్మించిన ఈ సముదాయంలో 320 స్టా ళ్లు అందుబాటులో ఉన్నాయి. రైతు బజారులో సుమారు 98 కూర గాయల సాగు రైతులు సభ్యులుగా ఉండగా వీరందరికి బార్‌కోడ్ కార్డులు ఇవ్వనున్నారు. రైతు బజార్‌లోని స్టాళ్లు సరిపోక పోతే కరీం నగర్ రోడ్డులో పాత మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన 108 స్టాళ్ళను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

అన్ని సౌకర్యాలు భవన సముదాయంలోనే...

రైతులకు అన్ని సౌకర్యాలు రైతు బజార్ సముదాయంలోనే కల్పించనున్నారు. సెల్లార్‌లో పార్కింగ్ స్థలం, ప్రతీ ఫ్లోర్‌లో టాయిలెట్ వసతి కల్పించారు. రైతులు అమ్ముకోగా మిగిలిన కూరగాయలను నిల్వ ఉంచుకోవడానికి సెల్లార్‌లో 5 మెట్రిక్ టన్నుల కెపాసిటి కలిగిన కోల్డ్ స్టోరేజ్‌ని నిర్మించారు. తూకంలో వినియోగదారులకు మోసం జరుగకుండా ప్రతీ స్టాల్‌కు ఒక ఎలక్ట్రానిక్ తూకం యంత్రాన్ని మార్కెటింగ్ శాఖ సమకూర్చనుంది. వృద్ధులకు, దివ్యాంగుల కోసం లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. కూరగాయల సంచులను సులువుగా తరలించడానికి మెట్లతో పాటు రాంప్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ స్టాల్‌కు ఒక ఫ్యాన్, ఎల్ఈడీ బల్బులను అమర్చారు. డబ్బులు జమ చేయడా నికి, విత్‌డ్రా చేసుకోవడానికి వీలుగా ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతు బజార్‌లో అందరి దాహార్తిని తీర్చడానికి అర్వోప్లాంట్, కూల్ వాటర్‌ను అందుబాటులోకి తీసుకురాను న్నారు. వ్యాపార, వాణిజ్య ప్రకటనల కోసం బిల్డింగ్ ముందు భారీ స్క్రీన్, లోపల 7 ఎల్ఈడీ డిస్‌ప్లేలను ఏర్పాటు చేస్తున్నా రు. రైతు బజార్ సముదాయంలో 32 సీసీ కెమరాలను అమర్చి వీటిని పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూంకు అనుసం ధానం చేయను న్నారు. దీ నిద్వారా చోరీలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యుత్ సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయంగా 5 కే.వి ఆటో జనరేటర్‌ను బిగిస్తున్నారు. అన్ని హంగులతో వసతులతో పూర్తయిన రైతుబ జార్ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధంగా ముస్తాబైంది.

అవసరమైతే ఏజెన్సీని మార్చండి

- వానాకాలానికి పనులు పూర్తి కావాల్సిందే
- కల్వకుర్తిపై మంత్రి హరీశ్ సమీక్ష



కల్వకుర్తి ప్రాజెక్టు కింద పెండింగ్ లో ఉన్న పనులన్నింటినీ వచ్చే వానాకాలం నాటికి పూర్తిచేయా లని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశించారు. శనివారం జలసౌధలో నాగర్‌క ర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి పనులను మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనా ర్ధన్‌రెడ్డి నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన జలవిజయ యాత్ర సందర్భంగా వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించారు. 60కు పైగా వచ్చిన విజ్ఞప్తు లపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకో వాలని హరీష్‌రావు కోరారు. తెల్కపల్లి మండలం లక్నా రం గ్రామం నుండి ఎమ్మెల్యే పాదయాత్ర జరిపారు. అసెంబ్లీనియోజకవర్గం పరిధిలోని నాగర్ కర్నూల్, బిజినేపల్లి తిమ్మాజీ పేట, తాడూ రు, తెలకపల్లి మండ లాల్లో కల్వకుర్తి ప్యాకేజీ 29,30ల పనుల పురోగతిని మంత్రి సమీక్షిం చారు. 2016-17లో మొత్తం కల్వ కుర్తి కింద 280చెరువులు నింపగా, ఈ ఏడాది 350చెరువులు నింపిన ట్లు వారు చెప్పారు. కల్వకుర్తి కింద మొత్తం ఆయకట్టు 4.25లక్షల ఎకరాలు కాగా, గత ఏడాది 1.25ల క్షల ఎకరాలకు సాగునీరు అందిం చామ న్నారు. ఈ ఏడాది 1.25లక్షల ఎకరాలకు సాగు నీరు అందించామని, ఈ ఏడాది యాసంగిలో 2లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేసినట్లు ఇరిగేషన్ అధికారులు చెప్పారు. 29,30ప్యా కేజీలలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులు వచ్చే వానా కాలం నాటికి పూర్తిచేయాలని మంత్రి హరీష్ ఆదేశించారు. ఒప్పందం ప్రకారం గడువులోగా పనులు చేయకుంటే నిబంధ నల ప్రకా రం సంబంధిత ఏజెన్సీని తొలగించి మరో ఏజెన్సీకి పనులు అప్పగించాలన్నా రు. కల్వకుర్తి మెయిన్‌కెనాల్ సహా డిస్ట్రిబ్యూ టరీల కింద మిగి లిన పనులన్నింటినీ ఖరీఫ్ కల్లా పూర్తిచేయాలని మంత్రి ఆదేశిం చారు. సమావేశంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, మహబూ బ్‌నగర్ సిఈ ఖగేందర్ రావు, ఎస్ఈ భద్రయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీలకు నిధుల మంజూరు

దేవరకొండ	రూ. 5	భైంసా	రూ.5
పాల్వంచ	రూ. 5	బెల్లంపల్లి	రూ.10
ఇల్లందు	రూ. 3	మందమర్రి	రూ.10
సత్తుపల్లి	రూ.15	ఆర్మూరు	రూ25
మధిర	రూ. 15	సిద్దిపేట	రూ10
పరకాల	రూ.15	జహీరాబాద్	రూ10
కోరుట్ల	రూ.25	సంగారెడ్డి	రూ10
జగిత్యాల	రూ.25	సదాశివపేట	రూ.10
పెద్దపల్లి	రూ.25	మెదక్	రూ15
నిర్మల్	రూ.15		

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పట్టణ స్థానిక సంస్థల్లో మౌలిక సదుపా యాల ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభు త్వం నిధులు మంజూరు చేసింది. అలాగే మరో 24 పట్టణ స్థానిక సంస్థలకు రుణాలు మంజూరు చేసేందుకు టియూఎఫ్ఐడిసికి అనుమతి ఇచ్చింది. ప్రజా ప్రతినిధుల అభ్యర్థనల మేరకు మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 2017-18 ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం ఈ నిధులు కేటాయించింది.

ఆల్మట్టిపై మరో లిఫ్ట్

(మొదటిపేజీ తరువాయి)

నీటితోనే.. నెట్టుకొస్తున్న క్రమంలో.. ఇపుడు కర్నాటక ప్రభుత్వం కృష్ణానదీ జలాల ఆధారంగా మరో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తోంది. ఆలమట్టి బ్యాక్ వాటర్‌ను ఉపయోగించుకుని ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్యం ప్రాజెక్టును నిర్మించింది. కర్నాటకలోని భాగల్‌కోట్ జిల్లా రాంతల్ మరోళాలో నిర్మించిన ఈ భారీ ప్రాజెక్టును కర్నాటక రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి ఎంబీ పాటిల్ ఆదివారం ప్రారంభిస్తున్నారు. ఇక దీనితో పాటు కృష్ణానదిపై.. మరో మూడు ప్రాజెక్టులను నిర్మిస్తోంది. పోలవరంలో వాటా వస్తుందని పేర్కొంటూ.. ఎగువరాష్ట్రమైన కర్ణాటక ఆ నీటిని వాడుకునేవిధంగా కొత్త ప్రాజెక్టులకు ప్లాన్ చేసింది. దీనిపై తెలంగాణ, ఎపిలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. కర్ణాటక ప్రాజెక్టులు నిర్మించుకుంటూ పోతోంది. కృష్ణాపై.. కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టులు తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణా ఆయకట్టురైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. కృష్ణాబేసిన్‌లోని ప్రజలు తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక కృష్ణానదిపై వరుస ప్రాజెక్టులు నిర్మిస్తున్న నేపథ్యంలో దీనిపై కేంద్రానికి ఫిర్యాదుచేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ యోచిస్తోంది. గతంలోనూ.. కర్ణాటక కృష్ణానదిపై నిర్మించే ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని మంత్రి హరీష్ అధికారులకు సూచించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో.. మరోసారి ఈ అంశంపై తెలంగాణ దృష్టిసారించనుంది. కర్ణాటక ప్రారంభిస్తున్న ప్రాజెక్టుతో పాటు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపైనా పరిశీలన జరపనుంది.

సామాజిక రుగ్మతలకు చట్టాలు పరిష్కారం కావు

హైదరాబాద్: సామాజిక రుగ్మతలకు చట్టాలు పరిష్కారం చూపబోవని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ముస్లిం పురుషులను జైళ్లలో పెట్టేందుకు చేసిన కుట్రే ట్రిపుల్ తలాక్ బిల్లు అని ఓవైసీ ఆరోపించారు. ఇస్లామిక్ చట్టాలను కాపాడుకుందాం అనే నినాదంతో హైదరాబాద్ లో నిర్వహించిన బహిరంగ సభలో ఓవైసీ ప్రసంగిస్తూ...చట్టం వచ్చిన తర్వాత ట్రిపుల్ తలాక్ ఆగిపోతుందా.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, వరకట్నపు చావులు వంటి వాటిని నిర్మూలించేందుకు తెచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా వాటిని ఆపలేకపోయాయి. 2005-2015 వరకు దేశంలో 80 వేల వరకట్నపు చావులు జరిగాయి. దేశంలో ప్రతీ రోజు 22 మంది మహిళలు వరకట్నం బాధితులుగా చనిపోతున్నారు. కాబట్టి సామాజిక రుగ్మతలకు చట్టాలు పరిష్కారమార్గాలు కావు. ట్రిపుల్ తలాక్ బిల్లు మైనార్టీ వర్గాల పాలిట కుట్ర. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముస్లింలను సంప్రదించకుండా ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టింది అని చెప్పుకొచ్చారు.

సాగునీటి పథకాలకు అంతర్జాతీయ ప్రశంసలు

- జల విజయాలపై విదేశీ ప్రతినిధుల కితాబు
- జలసౌధలో స్పెషల్ సీఎస్ జోషి ప్రజంటేషన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో చేపడు తున్న మిషన్‌కాకతీయ పథకం, కాళేశ్వరం వంటి భారీప్రాజెక్టుల నిర్మాణానికి అంతర్జాతీయ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఇరిగేషన్ రంగంలో తెలం గాణ అమలుచేస్తున్న పథకాలపై ప్రభుత్వ స్పెషల్ సిఎస్ ఎస్‌కె జోషి శనివారం జలసౌధలో పవర్‌పా యింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో 19దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో చేప డుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అధ్యయ నం కోసం హైదరాబాద్ చేరుకున్న బృందం అడ్మిని స్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా సమన్వయంతో పర్యటన కొనసాగిస్తున్నది. సాగునీటిపారుదల పథకాలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రజంటేషన్‌ను విదేశీ ప్రతినిధులు ఆసక్తిగా తెలుసుకున్నారు. కొత్తగా మూడున్నరే ళ్ళ క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇరిగేషన్ రంగంలో సాధించిన ప్రగతిపై ప్రభుత్వ స్పెషల్ సిఎస్ జోషి సోదాహరం గా వివరించారు. తెలంగాణ ఏర్పడకముందు.. దాదాపు 80వేల చెరువులుండ గా, పట్టణీకరణ.. ఇతరత్రా కారణాల వల్ల చెరువుల సంఖ్య సగానికి పైగా తగ్గిందన్నారు. గొలుసుకట్టు చెరువులతో పాటు మొత్తం చిన్ననీటి వనరులను పరిరక్షించేందుకు , వాటి పునరుద్దరణకు , పునర్నిర్మాణానికి మిషన్ కాకతీయ పథకాన్ని సిఎం రూపకల్పన చేశారన్నారు. తెలంగాణ, గ్రామీ ణఆర్థిక, సామాజిక స్థితిగతులలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయని జోషి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి చెరువును నిండుకుండగా మార్చేందుకు చేపట్టిన ఓబృహత్తరయజ్ఞం ఈ పథకమన్నారు. ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ఈ పథకం విజయవం తానికి ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తు న్నారన్నా రు. నిరంతరం పర్యవేక్షిస్తున్న కారణంగా సానుకూ ల ఫలితాలు వస్తున్నాయన్నా రు. చెరువుమీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతుతో పాటు ఆ చెరువును నమ్ముకున్న రజక, బెస్త, ముదిరాజ్‌ల జీవనభృతి దొరుకుతున్నదన్నారు. దేశంలోనే అత్యధికంగా చెరువులున్న రాష్ట్రంగా తెలంగాణకు చరిత్ర ఉందన్నారు. రాష్ట్రంలోని చెరువులన్నింటినీ ఏటా 25శాతం చొప్పున చేపట్టి పూర్వవై భవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ సమాజం కూడా మిషన్ కాకతీయ గ్రేట్ అంటూ అధ్యయనాలు చేస్తున్నదన్నారు.

కాళేశ్వరం ఓ అద్భుతం..

కాళేశ్వరం ప్రాజెక్టును రూ.80వేల కోట్లతో రాష్ట్రప్రభుత్వం చేపట్టిందని సిఎస్ జోషి వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ దగ్గర మూడుచోట్ల నిర్మిస్తున్న బ్యారేజీలు, మూడు పంపుహౌజ్‌లు, , పొడవైన సొరంగాల గురించి జోషి వివరించగా, విదేశీ ప్రతినిధులు ఆసక్తిగా విన్నారు. 90రోజుల పాటు రోజుకు 2టిఎంసిల నీటిని లిఫ్ట్ చేసేవిధంగా పథకాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. 18.26లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురావడం, మరో 18లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వాడుతున్న ఆధునిక సాంకేతిక విధానాలను, ప్రయోగాలను వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రయోజనాలనూ వివరించారు. తమ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న కారణంగా వార్షికబడ్జెట్‌లో 25శాతం ఈ రంగానికే కేటాయిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ స్పెషల్ సిఎస్‌తో పాటు కాడా కమిషనర్ మల్సూర్, మైనర్ ఇరిగేషన్ సిఈలు సురేష్, శ్యాం సుందర్, అస్కి ప్రోగ్రాం డైరెక్టర్లు, డాక్టర్ పి.సుభాషిణి, రాజ్ కిరణ్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధంకండి

- అధికార యంత్రాంగానికి మంత్రి పోచారం ఆదేశాలు
- జిల్లా అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌కు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకో వాలని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివా సరెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇందుకు సంబం ధించి శనివారం ఆశాఖ రాష్ట్ర కార్యాలయంలో అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా వ్యవసాయాధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందు లు తలెత్తకుండా వ్యవసాయ ఉత్పాదకాల విషయంలో తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. 2017-18 యాసంగి కూడా ఆశాజనకంగా ఉందని ప్రాజెక్టుల కింద నీళ్ళ సదుపాయం ఉన్నచోట సెంటి భూమి వృధా పోకుండా రైతులు సాగు చేపట్టాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సాధారణ విస్తీర్ణాన్ని ఈసారి దాటిపోయిందని నిజామాబాద్, కామారెడ్డి ఉదాహరణతో వివరించారు. క్షేత్రస్థాయిలో సాగు విస్తీర్ణాన్ని వాస్తవానికి దగ్గరగా సేకరించాలని మంత్రి ఆదేశించారు. గత సారి వానాకాలంకన్నా యాసంగిలోనే సాగు ఎక్కువైందని మంత్రి అన్నారు. వాస్తవ విస్తీర్ణాన్ని సేకరించాలని వ్యవసాయ కార్యదర్శిని, కమిషనర్‌ను కోరారు. పత్తి, కంది, మిరప, పసుపు పంటలు కొనసాగుతున్న చోటకాక మిగతా చోట్లలో యాసంగిలో పంటలు వేశారని అన్నారు. మార్చి 11న రైతులకు పట్టా పాస్‌బుక్కులు ఇస్తామని అన్నారు. అప్పటి వరకు రైతుకున్న మొత్తం విస్తీర్ణంలో సాగుకు యోగ్యంకాని భూమి వివరాలు పక్కాగా సేకరించాలని అన్నారు. సాగుకు యోగ్యమైన భూమికే పంటకు పెట్టుబడి అందిస్తామని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి మొదటి వారంలో నింపనున్న 851 ఏఈవో పోస్టులతో కలుపుకుని మొత్తం 2,638 ఏఈవోలతో జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి వారికి తగిన దిశానిర్దేశం చేస్తామని అన్నారు. రైతు సమన్వయ సమితులతో కూడా సమావేశాలు నిర్వహించి తగిన దిశానిర్దేశం చేయడానికి స్వయంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పాల్గొంటారని అన్నారు.పచ్చిరొట్ట వేసుకునేలా రైతును ప్రోత్సహించాలని, దీనివల్ల పురుగు మందుల వాడకం తగ్గుతుందని, తద్వారా రైతాంగ ఆరోగ్యంతో పాటు అందరి ఆరోగ్యాలు బాగు పడతాయని అన్నారు. యాసంగి పంట అయిన వెంటనే పచ్చిరొట్ట పైరుకు కావలసిన విత్తనాల అంచనా చెప్పాలని కోరారు. పిఎంకెఎస్‌వై నిధుల సహకారంతో ఎక్కడికక్కడ గ్రామాలలో భూగర్భ జలాలు పెంపొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరంపరాగత్ కృషి వికాస యోజన ఉద్దేశం రైతులను సేంద్రీయ వ్యవసాయంవైపు మళ్ళించడమే. గాలి, నీరు, ఆహారం బాగుంటేనే ఆరోగ్యం సాధ్యమవుతుంది. ఫసల్ బీమా యోజన గడువు తేదీల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తున్నట్లు చెప్పారు.

వ్యవసాయ యాంత్రీకరణపై మాట్లాడుతూ, కేజ్ వీల్స్ వల్ల రోడ్లు పాడవుతున్నాయని, వాటికి బదులు రోటవేటర్స్ ప్రోత్సహించమని సూచించారు. యాసంగి పంటలు మార్చిలో కోతకొస్తాయని ఆలోపు పంటకోత యంత్రాలను అందజేయాలని ఆదేశించారు.ఫిబ్రవరి 17న ఒకేరోజు ఖమ్మం, కొత్తగూడెంలలో 1000 ట్రాక్టర్లు పంపిణీ చేయబోతున్నట్లు చెప్పారు. అదే తరహాలో మిగతా జిల్లాల్లోనూ ట్రాక్టర్ మేళాలు నిర్వహించాలని ఆదేశిం చారు. వ్యవసాయం, సాగునీరు ఈ రెండు అంశాలపైననే సీఎం దృష్టి సారించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వ్యవసాయశాఖ మరింత కృషి చేయాలని, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎ.జగన్మోహన్ జిల్లా వ్యవసాయ అధికా రులతో సమావేశాన్ని కొనసాగించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి సి.పార్థసారధి కూడా పాల్గొన్నారు.

సాంకేతిక సాగుపై రైతులకు అవగాహన

వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతులను లాభాల బాటలో నడిపించేసాంకేతిక వ్యవసాయంపై రైతులకు అర్థమయ్యే భాషలోనే అవగాహన కల్పించాలని ఈ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి పరిశోధనల ఫలాలను వ్యవసాయ క్షేత్రాలకు అందిచాల్సిన అవసరం బాధ్యత ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో రైతులు తాము ఏళ్ళ తరబడి సాగుచేస్తున్న పంట రకాలను అభివృద్ధి చేయాలన్నారు. మేథోసంపత్తి హక్కుల కోసం వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 'రైతుల హక్కులు, వ్యవసాయ జీవ వైవిధ్యం' అనే అంశంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పంట రకాల సంరక్షణ, రైతు హక్కుల సాధికారత సంస్థ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి సంయుక్తంగా నిర్వహించిన ప్రాంతీయ సదస్సును శనివారం పార్థిసారధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎన్నో ఏళ్ళుగా రైతులు తమ పొలాల్లో సాగుచేస్తున్న పంటలపై హక్కులు పొందడానికి పీపీవీ అండ్ ఎఫ్ఆర్‌లో నమోదు చేసుకోవడానికి ఉన్న నిబంధనలు, దరఖాస్తులు నింపడంవంటి పలు అంశాలలో రైతులలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసే ప్రదర్శనలో ఉన్న రకాలను రిజిస్ట్రేషన్ చేయించడంపై వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు తగిన చొరవ చూపాలని ఆయన ఆదేశించారు. రైతుల హక్కులను కాపాడటంపై రూపొందించిన ఈ చట్టం అంశాలపై స్థానిక భాషల్లో ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రచురణలు తీసుకురావాల్సి ఉందని సూచించారు. పీవీవీ అండ్ ఎఫ్ఆర్ అథారిటీ ద్వారా ఈ చట్టంపై పెద్దఎత్తున రైతులలో అవగాహన పెంచడానికి ప్రచారం నిర్వహించాలని సూచించారు. పంటల రకాల సంరక్షణతో పాటు జీవవైవిధ్యం కాపాడాల్సిన ఆవశ్యకతపై కూడా రైతులను చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సీడ్స్, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.రాజేందర్ మాట్లాడుతూ, పంటల రకాల నమోదులో దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు వెనకబడి ఉన్నాయని తెలిపారు.

స్మార్ట్‌సిటీ పనులపై కేంద్ర అధికారి సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరంగల్ స్మార్టు సిటీ మిషన్ కింద జరుగుతున్న అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి సమీర్ శర్మ సమీక్షించారు. శనివారం హైదరాబాద్ నగరంలోని సిఎండిఏ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమవేశమయ్యారు. ఈ సందర్భంగా సమీర్‌శర్మ మాట్లాడుతూ, స్మార్టు సిటీ కింద జరుగుతున్న పనులను నిర్ణిత గడువులోగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా రోడ్లు, భద్రకాళి చెరువు అభివృద్ధి, హెరిటేజ్ వాక్, స్మార్టు లైబ్రరీ నిర్మాణం, వెయ్యి పిల్లర్ల అభివృద్ధి, పద్మాక్షి దేవాలయం, ఇంకుడు గుంతల నిర్మాణం, వరద నీటి కాలువల నిర్మాణం తదితర పనులను ఆయన సమీక్షించారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ఫేజ్ -1,2 కింద చేపడుతున్న ప్రధాన పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. అలాదే ఇ-గవర్నెన్స్ కూడా దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ టికె. శ్రీదేవి, వరంగల్ మేయర్ నరేందర్, కమిషనర్ శృతిఓజా తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రెండో దశ డీపీఆర్ రెడీ

- డీఎంఆర్‌సీకి బాధ్యతల అప్పగింత
- పలు అంశాలపై హెచ్ఎంఆర్ అధికారులతో చర్చించిన డీఎంఆర్‌సీ నిపుణులు
- మూడు కారిడార్లలో నిర్మాణ ప్రతిపాదనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మెట్రోరైల్ రెండవ దశ పను లపై కసరత్తు శరవేగంగా సాగుతోంది. ఇందుకు సంబంధించిన డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు) ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. దీనిని రూపొందించేబాధ్యతలను డిఎంఆర్‌సి (ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్)కు అప్పగించారు.మెట్రోరైల్ మొదటి విడతలో మూడు కారిడార్ల పరిధిలో మొత్తంలో 66 కిలోమీటర్ల మేరకు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే మెట్రోమొదటి విడతలో చేపట్టిన కారిడార్లకు అనుసంధానం చేస్తూ మలిదశలో విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిఎంఆర్‌సీకి చెందిన నిపుణుల బృందం శనివారం హైదరాబాద్ నగరానికి వచ్చి హైదరాబాద్ మెట్రో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానశ్రయానికి అనుసంధా నం చేయడంతో పాటు పలు ముఖ్యమైన ప్రాంతాలను కలుపుతు ఉండేవిధంగా ప్రతిపాదనలను రూపొందించాల్సిం దిగా హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్. రెడ్డి ఈ సందర్భంగా డిఎంఆర్‌సీ నిపుణులకు సూచించారు. అలాగే రెండవ విడత పనలకు అవసరమైన నిధుల సేకరణపై కూడా చర్చించినట్లుగా తెలుస్తోంది.

రెండు మెట్రో డిపోల కోసం 130 ఎకరాల స్థల సేకరణ

రెండవ విడత మెట్రోరైల్ పనుల్లో భాగంగా బీహెచ్ ఇఎల్- లక్డీకాపూల్ కారిడార్ నిర్మాణం కోసం అవసరమైన మెట్రో డిపోను నిర్మించేందుకు సుమారు 70 ఎకరాల స్థలం అవసరముంటుందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ హెచ్ఎంఆర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు గా తెలిసింది. ఈ డిపోను మియాపూర్ లేదా బీహెచ్ఇఎల్ (రామచంద్రాపూరం) పరిసర ప్రాంతాల్లో నిర్మించాలని నిర్ణయించారు. స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ కోసం ఒకటి నుంచి నాలుగు ఎకరాలను కేటాయించాలని భావిస్తున్నారు. బీహెచ్ఇఎల్-లక్డీకాపూర్ కారిడార్లలో స్టేషన్లు బీహెచ్ఇఎల్, చందానగర్, మదినగూడ, మైత్రీనగర్, హఫీజ్‌పేట్, ఆదిత్యన గర్, శిల్పాపార్కు కాలనీ, కొండాపూర్, బొటానికల్ గార్డెన్, గచ్చిబౌలి జంక్షన్, సైబరాబాద్ సీపీ ఆఫీసు, బయోడైవర్సిటీ పార్కు, ఖాజాగూడ జంక్షన్, షేక్‌పేట్, బృందావన్ కాలనీ, సాలార్‌జంగ్ కాలనీ, రేతిబౌలి జంక్షన్, మెహదీపట్నం, ఎన్ఎండీసీ, మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్ ప్రాంతాల్లో స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఎయిర్‌పోర్టు కారిడార్ కోసం మరో 60 ఎకరాల స్థలాన్ని సేకరించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కారిడార్ కోసం డిపోను బుద్వేల్ లేదా శంషాబాద్‌లో నిర్మించాలని నిర్ణయించారు. ఈ కారిడార్ పరిధిలో పార్కింగ్,సర్క్యులేషన్ కోసం ఆరు ఎకారల చొప్పున అవసరముంటుందని భావిస్తున్నారు. కాగా ఈ కారిడార్ కింద వచ్చే స్టేషన్లను రాయదుర్గ, గచ్చిబౌలి, టిఎస్ పోలీసు అకాడమీ, రాజేంద్రనగర్, శంషాబాద్, ఆర్‌జిఐఏ ప్రాంతాల్లో రానున్నాయని తెలుస్తోందగి. ఇక మూడవ కారిడార్ కింద మొదటి దశ పనుల్లోని మూడవ కారిడార్ ఎక్స్‌టెన్షన్ పనులను చేపట్టనున్నారు. ఇందులో నాగోల్ నుంచి ఎల్బీనగర్ (5 కిలోమీటర్లు) నిర్మాణ పనులతోపాటు ఒకటి నుంచి రెండు ఎకరాలను పరిసర ప్రాంతాల్లో రానున్న స్టేషన్లకు కేటాయించనుంది. ఇవి నాగోల్, బండ్లగూడ జంక్షన్, కామినేటి హాస్పిటల్, ఎల్‌బినగర్ ప్రాంతాల్లో రానున్నాయని తెలుస్తోంది.



చిన్నారి జ్యోత్స్నకు సీఎం చేయూత

- రూ. 15 లక్షల ఆర్థిక సాయం
- డిప్యూటీ సీఎం కడియం చొరవతో చికిత్స



హన్మకొండ, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరోసారి స్పం దించారు. వరంగల్ జిల్లాకు చెందిన చిన్నారి జ్యోత్స్న క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారన్న విషయం తెలుసు కొని వెంటనే స్పందించారు. చిన్నారి వివరాలను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ద్వారా తెలుసుకొని చిన్నారి కుటుంబ సభ్యులను సచివాలయంనకు పిలిపించుకొని పాప వైద్య సౌకర్యానికి అవసరమైన నిధులను అందించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యాక్రమాలను అమలు చేస్తూ దేశంలోనే ఉన్నత భావాలు కలిగిన ముఖ్యమంత్రిగా ఖ్యాతిగడించగా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు స్పందించడం కేవలం కేసీఆర్‌కు మాత్రమే చెల్లుతుందని వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు నేరుగా సీఎం స్పందించడం అభినందించదగిన విషయమని సీఎం కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా సేవా సంస్థలు వెంటనేస్పందించి అవసరమైన సహకారాలను జ్యోత్స్న కుటుంబానికి అందించాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.



జ్యోత్స్న కుటుంబ సభ్యులకు చెక్కును అందచేస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

ఈ ఏడాది ఖరీఫ్ నుంచే
క్రాప్ కాలనీలు



(మొదటిపేజీ తరువాయి)

మేరకు ఎక్కువగా చిన్న కమతాలను నెలకొల్పాలని, వాటికి ప్రత్యేక సబ్సిడీలు, రాయితీలు అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఆ దిశగా కార్యా చరణ ప్రణాళికను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ యంత్రాంగానికి ఆదేశాలి చ్చారు.

రైతు కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన

ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో అన్ని జిల్లాల్లోనూ పంట కాలనీలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్నే నమ్ముకున్న పేద రైతులకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా క్షేత్రస్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయి. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతుల భూములను మాత్రమే చిన్న కమతాలుగా మార్చి పంటల ఎంపికలో మెళకువలు పాటించనున్నారు. ముందుగా రైతుల ఆసక్తి మేరకే ఈ విధానాన్ని అమలుచేసి, తర్వాత ఆధునిక సాగు వ్యవస్థపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, ఇతర రాయితీల్లో చిన్న కమతాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న రైతు సమగ్ర సర్వేలో చిన్న కమతాలపై ఆసక్తి గల వారి సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. గత కొంత కాలంగా ఇజ్రాయిల్ దేశంలో అవలంభిస్తున్న సాంకేతిక పద్ధతులు, సాగు విధానాలపై అధ్యయనం చేసిన వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు ఒక నివేదికను రూపొందించారు.

మెరుగైన ఫలితాలకు ఇజ్రాయిల్ విధానం

తెలంగాణాలోనూ ఇజ్రాయిల్ దేశ విధానాలు అవలంభిస్తే సాధ్యమయ్యే సత్ఫలితాలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. విపత్తులు, కరువు కారణంగా తగ్గుతున్న పంటల విస్తీర్ణాన్ని పెంచాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఒకే ప్రాంతంలో ఒకే రకమైన పంటను ఎక్కువ మంది రైతులు సాగుచేస్తే మద్ధతు ధరల సంక్షోభం తలెత్తుతున్నందున వేర్వేరు పంటల సాగుద్వారా చేకూరే లబ్ధిపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయనున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సంయుక్త భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నారు. ఆయా విభాగాల్లో నిష్ణాతులైన, అనుభవమున్న శాస్త్రవేత్తలను పంట క్షేత్రాల వద్దకే తీసుకువెళ్ళి అధునాతన సాగు విధానాలపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నారు.

ప్రాంతాల వారీగా వేర్వేరు ప్రణాళికలు

తగ్గిపోతున్న కొన్ని పంటల సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాంతాల వారీగా వేర్వేరు విధానాలను రూపొందించుకుంటున్నారు. గ్రామస్థాయిలో రైతుల అవసరాలను గుర్తించి, స్థానికంగా పంటల సాగుకు గల అవకాశాలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటారు. రెండు ఎకరాల కన్నా తక్కువ భూమి కలిగి ఉన్న వారే అధికంగా ఉన్నందున వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు క్రాప్ కాలనీలు దోహదపడతాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయ రంగం ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేయబడుతున్నందున అధికార యంత్రాంగం మరింత నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరముందని ప్రభుత్వం గుర్తించింది.

శాస్త్ర వేత్తల సమన్వయంతో సాంకేతిక చేయూత

ఖరీఫ్ నుంచి క్షేత్రస్థాయి అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సమన్వ యంతో, సమిష్టిగా కృషి చేస్తారు. తెలంగాణ వ్యాప్తంగా సాగు విస్తీర్ణంలో 75 శాతం మేర వరి, పత్తి, మొక్కజొన్న పంటలే ఆక్రమించిన అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాల పంటల విస్తీర్ణం భారీగా తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో రైతులను ప్రోత్సహించేందుకు, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో నాణ్యతను పెంచి రైతులకు పంటలు గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. భూగర్భ జలాలు అడుగంటి, సాగునీరందక పంటలు ఎండిపోయి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు కనీస మద్ధతు ధరలు దొరకని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలకు వెతుక్కుంటున్న పరిస్థితులను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.

గణతంత్రంలో...
ఆయుధ మంత్రమేది?



(మొదటిపేజీ తరువాయి)

సరిహద్దుల్లో పాక్ దుందుడుకుగా వ్యవహరిస్తుంటే డోక్లామ్ నేపథ్యంలో చైనా భారత్‌లోకి చొచ్చుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. సహజంగానే భారతీయుల్లో ఇప్పుడు దేశభద్రతపై ఆందోళన, భయం నెలకొంటాయి. ఇలాంటి దశలో ప్రపంచంలోనే మరెవరికీ తీసిపోని ఆయుధ, సైనిక సామర్థ్యాన్ని సమకూర్చుకున్న భారత్‌కు వాటి ప్రదర్శన ద్వారా ఈ భయాందోళనలను పోగొట్టి భద్రతపై భరోసా కల్పించాల్సిన బాధ్యత ఉంది.

సాధారణంగా స్వాతంత్ర దినోత్సవాన ప్రధాని పతాకావిష్కరణ చేస్తారు. మొత్తం కార్యక్రమం ఆయన చేతుల మీదుగానే సాగుతుంది. అలాంటి సమయంలో ప్రభుత్వవిధానాలకు పథకాలకు, ప్రాధాన్యత ఇచ్చినా పెద్దగా విమర్శలకు గురికావు. కానీ గణతంత్ర దినోత్సవం పూర్తిగా రాష్ట్రపతి అధీనంలోనే జరుగుతుంది. ఆయనే పతాకాన్ని ఎగుర వేస్తారు. భారత్‌లో రాష్ట్రపతే త్రివిధ సైనిక దళాలకు అధిపతిగా కూడా వ్యవహరిస్తారు. దేశంలోని మొత్తం సైన్యం, ఆయుధ సంపత్తి అంతా ఆయన కనుసన్నల్లోనే ఉంటుంది. అలాంటి రాష్ట్రపతి అధీనంలో జరిగే ఉత్సవాల్లో సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించకపోవడం కొట్టొచ్చిన లోటుగా కనిపిస్తోంది. గతంతో పోలిస్తే భారత రక్షణశాఖ పలు విధాలుగా మెరుగైంది. ప్రపంచంలోనే భారత సైన్యం చైనా తర్వాత రెండో అతి పెద్దగా రూపుదిద్దుకుంది. ప్రపంచంలోనే చైనా, అమెరికాల తర్వాత భారత సైన్యం అత్యుత్తమమైన శిక్షణా సామర్థ్యం కలదిగా గుర్తింపు పొందింది. భారత వాయుసేన అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ తర్వాత నాలుగో అతిపెద్దదిగా విస్తరించింది. ఆయుధ వ్యాపారం చేసే రష్యా, అమెరికా, ఫ్రాన్స్‌ల తర్వాత చైనా, బ్రిటన్‌ల వెన్నంటి భారత్ అత్యంత శక్తివంతమైన ఆయుధాల్ని సమకూర్చుకున్న దేశంగా ఆవిర్భవించింది. ప్రపంచ వ్యాప్తంగా 29దేశాల సైన్యాన్ని మాత్రమే శక్తివంతమైనవిగా పరిగణిస్తుంటే అందులో చైనా తొలిస్థానంలో ఉంటే భారత్ ద్వితీయ స్థానంలో అమెరికా మూడో స్థానానికే పరిమితమైంది. అంతగా విస్తరించిన భారత సైన్యం పాటవాల్ని, ఆయుధ సామగ్రిని ప్రదర్శించక పోవడం, అదికూడా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో పరేడ్‌కు వాటిని దూరంగా ఉంచడం విమర్శకుల్ని విస్మయానికి గురిచేసింది.

1947లో భారత్‌కు స్వతంత్రమొస్తే 1950లో తొలి గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంది. అప్పటికి భారత్ వద్ద ఆధునిక విమానాల్లేవు. కానీ డకోటా, స్పిట్‌ఫైర్ రకం విమానాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాటితోనే అప్పటి సైనికులు అత్యద్భుత విన్యాసాలు చేసి వాటి సామర్థ్యాన్ని ప్రజలకు ప్రదర్శించారు. అప్పటి సైనికాధిపతి కరియప్ప సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించి భారతీయుల్లో రక్షణారంగం పట్ల విశ్వాసాన్ని పెంచేందుకు ఇదే సరైన వేదికంటూ తన ప్రసంగంలో పేర్కొన్న విషయాన్ని పరిశీలకులు గుర్తు చేసుకుంటున్నారు.

అంతర్జాతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలన్న ఆకాంక్ష ముందు దేశ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించాలన్న లక్ష్యం వెనకబడిపోతోంది. వ్యాపార సామ్రాజ్యాల విస్తరణ కంటే ప్రజల్లో దేశ సార్వభౌమాధికార పరిరక్షణ సామర్థ్యం పట్ల విశ్వాసం పెంచడం మరింత ముఖ్యమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

త్వరలో జీఎస్టీ స్థిరీకరణ



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలులో ఎదురవు తున్న ఇబ్బం దులు త్వర లోనే తొలగి పోయి స్థిర త్వం ఏర్పడు తుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. శనివారం అంత ర్జాతీయ కస్టమ్స్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన ఒక సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. స్వల్పకాలం లోనే జీఎస్టీని స్థిరీకరిస్తామని అన్నారు. మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో జీఎస్టీ స్థిరీకరణకు తక్కువ కాలమే పడుతున్నదన్నారు. పరోక్ష పన్నుల వ్యవస్థలో జీఎస్టీ దేశంలోనే మార్పు తీసుకు వచ్చిందని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ స్థిరీకరణతో భవిష్యత్తులో జీఎస్టీ పరిధిని విస్తరించడానికి వీలుకలుగడమేకాక, రేట్లను హేతుబద్ధం చేయడానికి వీలవుతుందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం జీఎస్టీలో నాలుగు స్లాబ్ రేట్లు (5శాతం, 12 శాతం,18శాతం, 28 శాతం) ఉన్నాయని చెప్పారు. నవంబర్‌లో జీఎస్టీ మం డలి భేటీలో సిన్ గూడ్స్ (పొగాకు, పాన్ మసాలా, బేవరేజెస్..), వైట్ గూడ్స్ (విలాస ఉత్పత్తులు)లను 28శాతం పరిధిలో కొనసాగిస్తూ.. ఈ స్లాబ్‌లోని 178 వస్తువులను 18శాతం పరిధిలోకి తీసుకు రావాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. అదే విధంగా 18 శాతం పన్ను పరిధిలోని 13 ఉత్పత్తులు 12 శాతం పరిధిలోకి, 12 శాతం పరిధిలోని 8 వస్తువు లను 5శాతం పన్ను పరిధిలోకి, 18 శాతం పరిధిలోని ఆరింటిని 5 శాతం పరిధిలోకి, ఐదు శాతం పరిధిలోని 6 ఉత్పత్తులను జీరో టాక్స్ పరిధిలోకి మార్చాలని సిఫారసు చేసింది. ఈ సడలింపుతో గత నవంబర్‌లో జీఎస్టీ వసూళ్లు అతి తక్కువగా రూ.80,808 కోట్లకు చేరాయని మంత్రి వెల్లడించారు. అక్టోబర్‌లో ఈ వసూళ్లు 83వేల కోట్లుగా ఉన్నాయన్నారు. అయితే డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు పుంజుకొని రూ.86,703కోట్లకు పెరిగాయన్నారు.

వ్యాపార అనుకూలదేశాల జాబితాలో టాప్ 50లో ఉండటం సాధ్యమే

వాణిజ్యానికి అనుకూల దేశాల జాబితాలో భారత్‌ను టాప్ 50 ర్యాంకుల్లో నిలపడం సాధ్యమేనని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఇందుకు పన్నుశాఖ సంస్కరణలు తదితర పలు ఆర్థిక సాధనాలు ఉపకరిస్తాయన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థతో జరిపిన చర్చలు భారత్ వ్యాపార అనుకూలతను మినహాయించి మిగతా వాటిపై అంతగా తన వైఖరిని స్పష్టం చేయలేదన్నారు. అయినప్పటికి భారత్ దేశీయ ప్రయోజనాలు, దృష్టిలో పెట్టుకొని వ్యాపార సౌకర్యాలను మెరుగుపర్చేందుకు భారత ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామన్నారు. గత మూడేళ్లలో భారత్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో 142 ర్యాంకు నుంచి 100కు చేరిందని... ఒక్క ఏడాదిలో 30 ర్యాంకులను దాటిందని పేర్కొన్నారు. ప్రధాని మోడీ నిర్దేశించిన లక్ష్యం టాప్ 50లో ఉండటమని.. దానికోసం మనం తప్పకుండా కృషిచేయాలన్నారు.

వివాదాల సుడిలో గవర్నర్?

(మొదటిపేజీ తరువాయి)

బేషుగ్గా ఉన్నాయంటూ అభినందిస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం చేపట్టిన కార్య క్రమాలకు కితాబులి స్తుంటారు.

వాస్తవానికి ఏ రాష్ట్ర పాలనైనా గవర్నర్ పేరిటే జరుగు తుంది. గవర్నరే రాజ్యాంగాధి నేత. ముఖ్య మంత్రి, మంత్రుల్ని గవర్నరే నియమిస్తారు. చట్టసభల్లో ఆమోదించబడ్డ బిల్లులు గవర్నర్ ముద్రతోనే చట్టాలుగా మార తాయి. అయినప్పటికీ రాజ్యాంగం మేరకు గవర్నర్ రాజ్యాంగబద్ధ విధులకు మాత్రమే పరిమితం. పాలనా విషయాల్లో ఆయన సొంత ఆలోచనలకు తావులేదు. ప్రభుత్వాలు ఆయన పేరిటే నడిచినప్పటికీ పథకాల రూపకల్పన, అమలు విషయంలో ఆయన పాత్ర ఏమాత్రం ఉండదు. బడ్జెట్ సమావేశాలు, గణతంత్ర దినోత్సవం వంటి కొన్ని సందర్భాల్లో మాత్రమే ఆయన అధికారిక ప్రసంగాలకు అవకాశము ఉంటుంది. అవి కూడా సదరు ప్రభుత్వం రాయించి ఆమోదించి ఇచ్చిన ప్రతుల్ని యదావిధిగా చదవాలి. అంతకుమించి సొంత ఆలోచనలను చొప్పించే వీలుండదు.గతంలో కూడా కొందరు గవర్నర్లు పాలనలో తమ ముద్ర వేసేందుకు ప్రయత్నించిన సందర్భాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై పెత్తనం చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అనేక విమర్శల్ని ఎదుర్కొన్నారు. బ్రిటీష్ రాజ్యాంగ వ్యవస్థ నుంచే భారత గవర్నర్ల పాలనా విధానం రూపుదిద్దుకుంది. 1931లో బ్రిటీష్‌రాజ్ భారత్‌లో ఈ వ్యవస్థకు రూపకల్పన చేసింది. అందులో కాలానుగుణంగా అనేక మార్పులు, చేర్పులు జరిగాయి. అయినప్పటికీ గవర్నర్లకు పరిమిత విధుల్నే రాజ్యాంగం కేటాయించింది. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో తొలి అసెంబ్లీని సమావేశపర్చే బాధ్యత గవర్నర్‌కు ఇచ్చింది. అసెంబ్లీ పక్షనాయకుడిని ముఖ్యమంత్రిగా, ఆయన సిఫార్సు చేసిన వారిని మంత్రులుగా నియమించే అధికారం కట్టబెట్టింది. సబార్డినేట్ కోర్టు జడ్జిలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్స మేరకు నియమించే అధికారం కూడా గవర్నర్‌కు ఇచ్చింది. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించాలని మాత్రమే రాజ్యాంగం నిర్దేశించింది. అంతకుమించి వ్యవహారాలు నడిపిన గవర్నర్లు వివాదాలకు గురికాకతప్పలేదు.యూపీఏ హయాంలోనే నరసింహన్ గవర్నర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర విభజనోద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించారు. ఈ కారణంగానే విభజనానంతరం కూడా నరసింహన్‌ను ఎన్‌డీఏ ప్రభుత్వం గవర్నర్‌గా కొనసాగిస్తోంది. రెండు ప్రాంతాల్లోని సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి కావడంతో పరస్పర సంబంధాల మెరుగుకు నరసింహన్ అయితేనే వీలేర్పడుతుందని ఈ నిర్ణయం తీసుకుంది. రెండో విడత గవర్నర్‌గిరి పదవీకాలం తర్వాత కూడా ఆయన్ను మార్చే ప్రయత్నం చేయలేదు. కేంద్రం నరసింహన్ పట్ల ఇంత నమ్మకం ఉంచింది. అయితే ఇప్పుడు ఇరు రాష్ట్రాల్లోనూ ఆయన వ్యవహారశైలి కేంద్రానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టేలా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

నైట్ క్లబ్‌లో కాల్పులు



(మొదటిపేజీ తరువాయి)

మేం నిర్ధారిస్తున్నామని సియెరా రాష్ట్ర భద్రతా కార్యదర్శి ఆండ్రే కోస్టా విలేకరుల సమావేశంలో చెప్పారు. విషమ పరిస్థితులో ఉన్న ఇతర బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. అయితే ఎంత మంది గాయపడిందీ కోస్టా వెల్లడించలేదు. రెండు మాదక ద్రవ్యాల ముఠాలకు మధ్య శతృత్వానికి కాల్పులకు సంబంధం ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. అయితే మరణించినవారిలో అత్యధికులు వ్యవస్థీకృత నేరంతో ఏ మాత్రం సంబంధం లేని అమాయకులు అని వారు తెలిపారు.

పెద్ద ఎత్తున ఆయుధాలతో నిండిన కార్లలో నైట్ క్లబ్ వద్దకు చేరుకున్న 15 మంది గన్‌మెన్లు క్లబ్‌లోకి చొరబడి ఇష్టంవచ్చినట్టుగా కాల్పులు జరిపారని స్థానిక దినపత్రిక ఒ గ్లోబో పేర్కొంది. ప్రాణభయంతో క్లబ్ నుంచి పారిపోయిన ప్రజలు సమీపంలోని ఇండ్లలో తల దాచుకున్నారు. కాల్పులు అరగంట సేపు జరిగాయని ప్రత్యక్ష సాక్షులను ఒ గ్లోబో ఉటంకించింది. తాజా కాల్పులు నగర చరిత్రలో అత్యంత ప్రాణాంతకమైనవిగా తెలిపింది. గన్‌మెన్లను పట్టుకోవడం కోసం పోలీసులు ఒక హెలికాప్టర్‌ను రంగంలోకి దించారు.

త్వరలో రాష్ట్రానికి
భారీ పెట్టుబడులు

- స్థానిక సమస్యల పరిష్కారానికి ఐఏ దోహదం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్లోబల్ టెక్నాలజీ సహకారంతో స్థానికసమస్యల పరిష్కారానికి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఐఏ) ఎంతగానో ఉపయోగ పడుతుందని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. మెషిన్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లో టెస్టింగ్ డేటా, హై క్వాలిటీ ట్రైనింగ్ కీలకపాత్ర పోషిస్తాయని ఆయన చెప్పారు. డేటా కలెక్షన్‌లో నాణ్యమైన విధానాలను అవలంబించేందుకు ప్రభుత్వాలు తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకోవలసిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్లోబల్ టెక్ అండ్ లోకల్ సొల్యూషన్స్ - ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అన్న అంశంపై ప్రపంచ ఆర్థిక సదస్సులో శుక్రవారం ఆయన ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం 2016లో ఓపెన్ డేటా పాలసీ ఆవిష్క రించిందని, ఇది ప్రస్తుతం 50 డేటాబేస్‌లకు విస్తరించిందని కేటీఆర్ చెప్పారు. ఏఐ ఆధారిత సొల్యూషన్స్ రూపకల్పన, ఉన్నత ప్రమా ణాలతో డేటా కలెక్షన్‌లో ఉత్తమ ఫలితాలు ఇస్తుందన్నారు. తమ ప్రభు త్వం ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్‌ను గుర్తించి హ్యాకథాన్ ఆధారిత డేటా కలె క్షన్ చేపట్టాలని యోచిస్తోందని ఆయన చెప్పారు. స్థానిక సమస్యలు ప్రస్తావించేందుకు సాంస్కృతిక, ప్రాంతీయ, భాషాపరమైన వ్యత్యా సం పరిగణలోకి తీసుకోవలసి ఉంటుందని కేటీఆర్ చెప్పారు. ఏఐ సొల్యూషన్స్ స్థానిక సమస్యల పరిష్కారంలో దోహద పడుతుం దన్నారు. స్థానిక యువతకు టెక్నాలజీలో నైపుణ్యం పెంచుతామని, ప్రపంచ సంస్థలు స్థానికంగా పనిచేయాలని ఆశిస్తున్నామని మంత్రి అన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రతినిధి బృందానికి కేటీఆర్ ప్రాతినిధ్యం వహించారు. ఈ బృందంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ కూడా పాల్గొన్నారు. దావోస్‌తో పాటు జపాన్, కొరియాల్లో పర్యటించి అక్కడి పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు అనేక సమావేశాలు, చర్చలు జరిపారు. ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా తెలంగాణ పవిలియన్‌లో అనేక మంది ప్రపంచ స్థాయి కంపెనీల సీఈవోలు, సదస్సు గ్లోబల్ లీడర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ పారిశ్రామిక విధానం, టిఎస్-ఐపాస్, సింగిల్ విండో ద్వారా పరిశ్రమలకు అనుమతులు, పారిశ్రామిక రాయితీలు, ప్రోత్సాహకాలపై కేటీఆర్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. తమ పర్యటన ఎంతో ఫలవంతంగా సాగిందని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ స్థాయి కంపెనీలు సానుకూలత వ్యక్తంచేశాయని కేటీఆర్ సంతృప్తి వ్యక్తంచేశారు. వరంగల్‌లో టెక్ మహీంద్రా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు రావడం గొప్ప విజయమని ఆయన అన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటి రంగం అభివృద్ధి చెందేందుకు టెక్ మహీంద్రా నిర్ణయం ఎంతగానో దోహద పడుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు.

'ధరణి'కి పోటాపోటీ టెండర్లు

- ప్రతిష్టాత్మక ఐటీ కంపెనీల క్యూ
- 30తో ముగియనున్న గడువు
- ధరణి పేరుతో ల్యాండ్ వెబ్‌సైట్
- కోర్ బ్యాంకింగ్ తరహా విధానం అమలు
- అవినీతి, నకిలీల విచారణే లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: చౌకగా సర్కారీ భూములను పొందేందుకు పోటీపడిన ఐటీ కంపెనీలు ఇప్పుడు రైతుకు అండగా ఉంటామంటున్నాయి. తమ సాంకేతికతతో వారికి సేవ చేయాలని ఉబలాటపడుతున్నాయి. చౌకగా భూములు కొట్టేసేందుకు పైరవీలు చేసిన కంపెనీలు ఇప్పుడు ఎక్కడాలేని రీతిలో రైతన్నకు సేవ చేసేందుకు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర భూభాగాన్ని పరిరక్షించి, అధునాతన రికార్డుల నిర్వహణకు ప్రభుత్వం చేపట్టిన ధరణి ప్రాజెక్టుకు టెండర్లు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. ఈనెల 30తో టెండర్ల దాఖలుకు గడువు తీరుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో టెండర్లు దాఖలైనట్లుగా సమాచారం కాగా మైక్రోసాఫ్ట్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు ఈ ప్రాజెక్టును దక్కించుకునేందుకు పోటీ పడుతుండటం విశేషంగా చెప్పుకోవచ్చు.

మార్చి 11 తర్వాత తెలంగాణలో సరికొత్త రెవెన్యూ విధానం సాక్షాత్కారంలోకి రానుంది. ఏదీ చేసినా విప్లవాత్మకంగా నిల్చే తెలంగాణ విధానంలో మరో సరికొత్త విధానం అంకురార్పరణ అవుతోంది. ప్రపంచమంతటా సాంకేతిక విప్లవానికి, ఐటీకి పట్టణాలే కేంద్రబిందువులుగా నిలిస్తే ఇప్పుడు తెలంగాణలో పల్లెలే కేంద్రంగా సాంకేతిక కంపెనీలు పరిభ్రమించనున్నాయి. రాష్ట్రంలో భూములను పొందేందుకే క్యూ కట్టి ప్రాధాన్యతనిచ్చిన ప్రముఖ ఐటీ కంపెనీలు ప్రపంచంలోనే తొలిసారిగా వ్యవసాయరంగానికి ఊతంగా నిలుస్తామంటూ పోటీ పడుతున్నాయి. ఎక్కడెక్కడి ప్రముఖ కంపెనీలన్నీ ఇప్పుడు రాష్ట్రంలో భూ నిర్వహణకు తామున్నామంటూ సేవాభావంతో ముందుకొస్తున్నాయి. విభిన్న తరహాలో 55లక్షల కమతాలు, 71లక్షల వ్యవసాయ ఖాతాలకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించడం, 1.24 కోట్ల ఎకరాల వ్యవసాయ భూములకు చెందిన వివరాలను ధరణి ప్రాజెక్టుతో పకడ్బంధీగా తేల్చేందుకు సిద్ధం అవుతున్నాయి. రాష్ట్రంలో 1,12,077 చదరపు కిలోమీటర్ల రాష్ట్ర భూభాగం ఉండగా ఇందులో 2.80 కోట్ల ఎకరాల భూభాగపు లెక్కలు డిజిటలైజ్ చేయనున్నారు. కాగా ఇటీవలి సర్వేలో 1.42కోట్ల ఎకరాల వివాదరహిత వ్యవసాయ భూమి ఉందని తేలింది. మరో 17.89లక్షల ఎకరాల భూమి వివిధ న్యాయపరమైనచిక్కుల్లోని ఉన్నట్లుగా గుర్తించిన సంగతి తెలిసిందే. ఇక రాష్ట్రంలోని 11.95లక్షల ఎకరాల వ్యవసాయేతర భూమి ఉండగా, 84.00లక్షల ఎకరాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వేలైన్, సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆస్ప త్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింది భూములు, కోర్టు కేసుల్లోని అటవీ భూములు ఉన్నట్లుగా నిర్ధారించారు. 24 లక్షల ఎకరాల భూములు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని నివాస ప్రాంతాలు, వివాదాలు లేని అటవీ భూములుగా నివేదిం చిన విషయం వెల్లడైంది. ఇక ఇప్పుడు వీటికి కట్టుదిట్టమైన రికార్డుల తయారీ కావాల్సి ఉంది. దీనికి ప్రత్యేకంగా ధరణి పేరుతో వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీనికోసం పిలిచిన టెండర్లకు అద్భుతమైన స్పందన వ్యక్తమవుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా ఏక కాలంలో అన్ని గ్రామాల్లో కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకం కం టైటిల్ డీడ్‌లను పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధమవుతోంది. కోర్ బ్యాంకింగ్ తరహాలో ప్రత్యేక ల్యాండ్ వెబ్‌సైట్‌ను ధరణి వెబ్‌సైట్‌కు విధివిధానాలను ఖరారు చేశారు. దీని ప్రారంభంతోపాటు అదే రోజునుంచి రెవెన్యూ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. అవినీతికి ఆస్కారం లేని పారదర్శకమైన నూతన రిజిస్ట్రేషన్ విధానం తద్వారా అమలవుతుందని ప్రభుత్వ యోచన. దీంతో రెవెన్యూ శాఖ పరిధిలోనే ఇకపై భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఏకకాలంలో ఒకే కార్యాలయంలో జరగనున్నాయి.

అన్ని వివరాలతో ధరణి నిర్వహణ....

ప్రతీ ఎకరం భూభాగం వివరాలు ధరణి వెబ్‌సైట్‌లో అప్‌డేట్ అవుతాయి. మొత్తం తెలంగాణ భూభాగం ప్రతీ అంగుళం ఇందులో నిక్షిప్తం అవుతుంది. క్రయవిక్రయాలు, యాజమాన్య మార్పులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారు. ఇందుకు ఐటీ నిపుణుడు ప్రతీ కార్యాలంలో ఉంటారు. ఇందుకు ప్రత్యేకంగా ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. రిజిస్ట్రేషన్ వివరాలు, పేరు మార్పిడి వివరాలు ఏరోజు కారోజే ధరణిలో నమోదు అవుతాయి. తద్వారా మండల కార్యాలయంనుంచి మొదలుకొని రాష్ట్రస్థాయిలో అన్ని చోట్లా ఈ వెబ్‌సైట్ నుంచే ఎవరైనా కావాల్సిన వివరాలు పొందొచ్చు. విదేశాల్లో ఉన్న ఎన్నారైలు కూడా ధరణి ద్వారా అందే సమా చారంతో క్రయ, విక్రయాలు జరుపుకునే వీలు కల్గుతుంది.

ఎమ్మార్వోలే సబ్ రిజిస్ట్రార్‌లు...

రైతులు, ఇతరులకు అందుబాటులో ఉండేలా ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసు కునే వెసులుబాటు కల్గనుంది. మొత్తం 584 రెవెన్యూ మం డలాల్లో 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలుండగా వాటిని 141 మండలాల పరిధికి కొనసాగిస్తూనే మిగతా 443 చోట్ల ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తారు. ఎమ్మార్వోలు తామిచ్చిన అపాయింట్‌మెంట్ తేదీలకను గుణంగా శని, ఆదివారాలు, ఇతర సెలవులు మినహా వారానికి ఐదు రోజులు ఉదయంసమయంలో రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మార్వోలు హాజరుకాకపోతే ఆ బాధ్యతలను డిప్యూటీ తహాశీల్దార్‌లకు అప్పగిస్తారు.

అవినీతి, నకిలీల నివారణే లక్ష్యం...

భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో నూటికి నూరు శాతం పారదర్శకత సాధించడం, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్‌పుస్తకాలను అరికట్టడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రైతులు, ఇతరులు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పాస్ పుస్తకం కొనుగోలుదారుడి ఇంటికే కొరియర్ ద్వారా అందనుంది. ఒక్క రోజులోమొత్తం పని పూర్తిచేసి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం ధరణిని రూపొందించింది. పని పూర్తవ్వాలి. నకిలీ పాస్‌పుస్తకాలు, ఇతర డాక్యుమెంట్లు లేకుండా ఈ వెబ్‌సైట్‌తో కట్టడి చేయనున్నారు.



తనతో తానే మోడీ క్రీడ



ఇద్దరు వ్యక్తుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. వారిని భిన్నధ్రువాలు అనొచ్చు. అవి పరస్పరం సంఘర్షించుకోవచ్చు. ఒకే వ్యక్తిలో రెండు ధ్రువాలు ఉంటాయా? సాధ్యమేనా? మనిషిలో పెద్ద మెదడు, చిన్న మెదడు అని రెండు మెదళ్లు ఉన్నట్టే..ఒకే వ్యక్తిలో రెండు రకాల వ్యక్తిత్వాలు ఉంటాయా? అవి ఆరోగ్య కరమేనా? అందులోనూ భారతదేశమంతటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ఏలే పాలకులకు ఇలాంటి ప్రవృత్తి ఉండటం జాతికి ఆరోగ్య కరమా? అంతర్ముఖుడికి, బాహ్యోన్ముఖుడికి మధ్య జరిగే సంఘర్షణ జీవన గమనాన్ని ప్రభావితం చేస్తుంది. అది ఒక మనిషి వ్యక్తిగత జీవితమైతే అది అంతవరకే పరిమితమవుతుంది. కాని పాలకుల విషయంలో అయితే అది జాతి భవిష్యత్తు మీద ప్రభావం చూపుతుంది. ప్రముఖ అమెరికన్ సింగర్, పాటల రచయిత్రి టోరి అమోస్ తన మానసిక ప్రవృత్తిని తానే విశ్లేషించుకుంటూ..నాలో చాలామంది లోపలి మనుషులున్నారు. అయినా నేనెప్పుడూ ఒంటరినే..అని సూత్రీకరించటాన్ని బట్టి..మనిషిలోని భిన్నధృవాలు చూపే ప్రభావం అంతాఇంతా కాదని స్పష్టమవుతున్నది. ఇదే సమస్యను అన్యాపదేశంగా ప్రస్తావిస్తూ..మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం తనదైన శైలిలో పరిష్కారం చెప్పారు. సృష్టికర్త మన మెదళ్లలో బోలెడంత శక్తి సామర్థ్యాన్ని నిక్షిప్తం చేశాడని..ధ్యానంతో దాన్ని వెలికితీసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన హితవు చెప్పారు. మొత్తం మీద మెదడులోని శక్తిని ఈ భిన్నధ్రువ వ్యక్తిత్వాలు పెడదోవ పట్టిస్తున్నట్టు ఆయన మాటలను బట్టి అర్థమవుతున్నది. చాలామందిలోని సృజనాత్మకత ఈ సమస్య వల్లే నిస్తేజమైపోతున్నదని మరికొందరు అమెరికన్ మానసిక శాస్త్ర వేత్తలు సూత్రీకరించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిస్సందేహంగా ఆలోచనాపరుడు. అదీ కొత్తదనంతో కూడిన ఆలోచనలకు ప్రాణం పోయడంలో ఆయనకు ఆయనే సాటి. ఏది చేసినా కొత్తగా చేయాలనుకుంటారు. ఆ చేసేది తప్పకుండా కొత్తగానే ఉండాలనుకుంటారు. అనుకోవడమే కాదు. అలానే చేస్తున్నారు. ఇందుకు అనేక దృష్టాంతాలు. వినూత్న ఆలోచనలతో సంప్రదాయాలను బద్దలుకొట్టి ఆధునిక భారతానికి అడుగులు నేర్పాలన్న తపన ఒకవైపు..అదే తపన కాస్తంత వికటించి వికృత చర్యలకు ఆజ్యం పోయడం మరోవైపు..ఈ రెండు భిన్నధ్రువాలు సమాంతరంగా ప్రయాణిస్తూ ప్రధాని మోడీని నిరంతర వివాదాస్పద వ్యక్తిగా చరిత్రలో నిలబెడుతున్నాయి. దీనికి నిన్నగాక మొన్నటి రిపబ్లిక్ డే వేడుకనే ప్రామాణికంగా తీసుకోవచ్చు. రెండు భిన్నధ్రువాల సమ్మిళిత సన్నివేశమది. ఏకకాలంలో అలా వ్యవహరించడం ఒక్క మోడీకే చెల్లిందని చెప్పుకుంటే అది అతిశయోక్తి కాబోదు. ముందుగా మొదటి ధ్రువాన్ని విశ్లేషిస్తే..

ఈ గణతంత్ర దినోత్సవాలకు ఏకంగా పది ఆసియన్ దేశాల అధినేతల్ని పిలిచి ప్రధాని మోడీ అందర్నీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తారు. ఇలాంటి సంభ్రమాల చర్యలు మోడీ సొంతం. మనం ఇప్పటికి 69 రిపబ్లిక్ దినోత్సవాలను చూశాం. ప్రతి ఏడాది విదేశీ అతిథిని పిలవడం రివాజుగా వస్తున్నది. ఏటికేడాది ఒక అతిథి వస్తారు. రెండు రోజులుంటారు. రిపబ్లిక్ పరేడ్ చూస్తారు. తాజ్‌మహల్ వంటి చారిత్రక కట్టడాలు చూసి వెళ్లిపోతారు. ఒబామా దగ్గర్నుంచి ప్రపంచవ్యాప్తంగా హేమాహేమీలంతా ఇలా ఆతిథ్యం స్వీకరించినవారే. అలాగని మన రిపబ్లిక్ పరేడ్ వేడుక మొక్కుబడి తంతు అని కాదు. దాన్ని నిష్టగా చేపడుతున్నారు. చక్కని సంప్రదాయంగా సాగుతున్నది. ఎంతకాలం గడిచినా భక్తిశ్రద్ధలు తగ్గిపోని ఒక సార్వభౌమాధికార రాజ్యాంగ శోభగా దేశ చరిత్రలో నిలిచిపోయింది. 1950-54 మధ్యకాలంలో ఢిల్లీలోనే నాలుగు చోట్ల రిపబ్లిక్ వేడుకలు నిర్వహించేవారు. ఇర్విన్ స్టేడియం, కింగ్స్‌వే, ఎర్రకోట, రామ్‌లీలా మైదానాలలో కన్నులపండువగా జరిగేవి. 1955 నుంచి ఇప్పుడు జరుగుతున్నట్టుగా ఒక్కచోటే.. రాజ్‌పథ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ రాజ్‌పథ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో 1955లో మొదటిసారి వేడుకలకు విదేశీ అతిథిగా పాకిస్తాన్ గవర్నర్ జనరల్ మాలిక్ గులాం ముహమ్మద్ రావడం విశేషం. 1950 నుంచి..తొలి వేడుకల నుంచే.. ఈ అతిథుల సంప్రదాయం నడుస్తోంది. మొట్టమొదటి పెరేడ్‌కు ఇండొనేషియా అధ్యక్షుడు సుకర్ణో హాజరయ్యారు. అతిథిగా ఏ దేశాధినేతను పిలవాలన్నది ఆ ఏడాది ప్రాపంచిక పరిణామాలు, అవసరాల ఆధారంగా నిర్ణయిస్తారు. వ్యూహాత్మకంగానూ, ఆర్థికంగానూ, రాజకీయంగానూ మనదేశంతో ఉన్న సంబంధాలనూ, భవిష్యత్ దేశ ప్రయోజనాలనూ పరిగణనలోకి తీసుకుంటారు. ఇప్పటిదాకా రెండు సందర్భాల్లో తప్ప మిగతా అన్ని పరేడ్లకు ఒక్కో ఏడాది ఒక్కొక్కరే వచ్చారు. రెండు సందర్భాల్లో మాత్రమే ఒకేసారి ఇద్దరు అతిథులు పాల్గొన్నారు. 1968లో సోవియట్ యూనియన్ చైర్మన్ అలెక్సి కోసిగిన్, యుగోస్లేవియా ప్రెసిడెంట్ జోసిప్ బ్రోజ్ టిటో హాజరయ్యారు. 1974లో మళ్లీ యుగోస్లేవియా ప్రెసిడెంట్ టిటోతో పాటు శ్రీలంక ప్రధానమంత్రి సిరిమావో బండారునాయకే వచ్చారు. ఇప్పటిదాకా ఫ్రాన్స్, బ్రిటన్ దేశాధినేతలు గరిష్టంగా అయిదుసార్లు హాజరయ్యారు. భూటాన్, రష్యా(యుఎస్ఎస్ఆర్) నాలుగుసార్లు, ఇండొనేషియా, మారిషస్ మూడుసార్లు, బ్రెజిల్, జపాన్, నేపాల్, నైజీరియా, పాకిస్తాన్, సింగపూర్, ఫిలిప్పీన్స్ , శ్రీలంక, థాయ్‌లాండ్, వియత్నాం రెండుసార్లు పాల్గొన్నాయి. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2014లో అధికారంలోకి వచ్చాక కూడా ఏడాదికి ఒక్కర్నే పిలిచారు. తొలి ఏడాది జపాన్ ప్రధాని షింజో ఎబె, రెండో ఏడాది అమెరికా అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా, 2016లో ఫ్రాన్స్ అప్పటి అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హొల్లాండే, 2017లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ యువరాజు ముహమ్మద్ బిన్ జయేద్ అల్ హ్యాన్ వచ్చారు. ఇలా దశాబ్దాలుగా ఒకే మూసలో ఈ ఒరవడి సాగుతోంది. మనం పిలవడం..ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా వారూ రావడం..ఒక అనివార్యమైన ఆనవాయితీకి మనమంతా అలవాటు పడిపోయాం. ప్రధాని మోడీ ఈసారి ఏం చేశారు? ఏకంగా పది ఆసియాన్ దేశాల అధినేతల్ని ఒక్కుమ్మడిగా ఢిల్లీలో దింపారు. ఇదేదో సాదాసీదాగా కాకతాళీయంగా చేసిన నిర్ణయంగా భావించలేము. ఏదో ఒక దేశాధిపతి వస్తే అది ద్వైపాక్షిక ప్రయోజనాలకే పరిమితమవుతుంది. అలా కాకుండా ప్రపంచ చిత్రపటంలో ఒక ప్రాబల్య ప్రాంతాన్ని ఎంచుకుని ఆయా దేశాల అధిపతులందర్నీ ఒకేచోట చేరిస్తే అది అంతర్జాతీయ సంబంధాల్లో బహుముఖ ప్రయోజనకర ఘనకార్యమవుతుంది. ప్రధాని మోడీకి వచ్చిన ఈ ఆలోచన నిజంగా మెచ్చుకోదగింది. ఏకధ్రువ ప్రపంచమల్లా ద్విముఖ ప్రపంచంలా మారే ప్రమాదఘంటికలు వినిపిస్తున్న తరుణంలో..ఇంకా చెప్పాలంటే ఎవరికి వారు స్వీయరక్షణోపాయాల సాలెగూళ్లల్లో దాక్కుంటున్న క్రమంలో రానురాను బహుధ్రువ ప్రపంచంగా మారే అవకాశాలున్న నేపథ్యంలో..ప్రధాని మోడీ అంతర్జాతీయ సమాజానికి ఒక చక్కని సందేశం ఇచ్చినట్టయింది. చైనాలాంటి అర్ధశత్రు-అర్ధమిత్ర దేశాలకు కొత్త సంకేతాన్ని పంపినట్టయింది. ఆగ్నేయాసియా దేశాల కూటమి 1967లో అయిదే అయిదు దేశాలతో ఆవిర్భవించి..అంచెలంచెలుగా ఎదుగుతున్న ఒక అసోసియేషన్. సగటు దేశాల స్థాయి నుంచి ప్రపంచంలో వ్యూహాత్మక గుర్తింపు పొందుతూ..స్వీయ వ్యక్తిత్వం, స్వీయరక్షణ, సార్వభౌమాధి కారాన్ని నిలుపుకోవడం, ప్రాదేశిక సమగ్రత..తదితర అంశాల ప్రాతిపదికన ప్రాంతీయ సమతుల్యత కోసం కృషి చేసే దేశాల సమాహారంగా ప్రపంచంలో రాణిస్తున్నది. అలాంటి ఆసియన్ దేశాల అధిపతుల్ని రిపబ్లిక్ డే వేడుకల్లో ఒకేచోట చేర్చడం ద్వారా విదేశీ వ్యూహకర్తగా తన స్థాయి ఏమిటన్నది మోడీ ప్రపంచానికి చాటినట్టయింది. భారతదేశాన్ని ఎవరెలా అన్వయించుకున్నా..వర్ధమానదేశంగా భావించినా..మేడిపండు ఆర్థిక వ్యవస్థగా అవమానించినా..ఆకాశానికి నిచ్చెనలేసే సగటు పేద దేశంగా తేలిగ్గా తీసుకున్నా..భారతదేశం ఒంటరి కాదని..దాని వెనక తనలాంటి అనేక ఆశావహ దేశాలు కంచుకోటల్లా నిలబడి ఉన్నాయని చెప్పినట్టయింది. చీమలబారులో మొదట నిలిచే సిపాయి చీమ మాదిరి భారత్ బలం పెరుగుతుంటుందే తప్ప తరిగే అవకాశమే లేదన్న నర్మగర్భపు హెచ్చరిక కూడా ఉంది. ఇదే ఈసారి రిపబ్లిక్ డే వేడుకల ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ఇలాంటి వినూత్న ఆలోచనలకు మోడీ పెట్టింది పేరుగా మారుతున్నవైనం స్పష్టమవుతోంది. 2014 మే 26న ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవానికి సార్క్ దేశాధినేతల్ని అధికారికంగా పిలిచి అప్పట్లోనే అందర్నీ ఆశ్చర్యపరిచారు. వారందరికీ వ్యక్తిగత హోదాలో తాను ఫోన్లు చేసి పిలవడం కాకుండా..విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్ దేశాలకు అధికారిక ఆహ్వానాలు పంపి దానికొక సాధికారత కల్పించారు. భారతదేశ ప్రధానమంత్రి ప్రమాణ స్వీకారానికి విదేశీ అతిథుల్ని పిలవడం అప్పటిదాకా లేదు. మోడీ దాన్ని బద్దలుకొట్టి సరికొత్త సంప్రదాయానికి తెరతీశారు. భారత ప్రధానమంత్రి విదేశీ పర్యటనలకు ఒక గ్లామర్ తెచ్చారు. విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ అక్కడి భారతీయులతో అట్టహాసంగా ఎన్నికల తరహా సభలు నిర్వహించడాన్ని సరికొత్తగా ఆయన తెరమీదికి తెచ్చారు. అంతదాకా భారత ప్రధానులు ఎవరు విదేశాలకు వెళ్లినా అక్కడి అధికారిక కార్యక్రమాలు ముగించుకుని తిరిగి రావడం మినహా స్థానిక ఎన్నారైలతో అంత భారీ స్థాయిలో బహిరంగ సభలు పెట్టే సాహసం చేయలేదు. నిజానికి ద్వైపాక్షిక సంబంధాల్లో అలాంటి పద్ధతులు సరికాదన్న వాదన ఉండటం వల్లే ఎవ్వరూ మోడీ తరహాలో సాహసం చేయలేదు. ఇన్ని రకాలుగా ప్రధాని మోడీ తన విచక్షణనూ, వివేచననూ విలక్షణంగా ప్రయోగించి దేశీయంగానూ, విదేశాల్లోనూ ఇమేజీని పెంచుకున్నారు. భారత ప్రధాని ఇమేజీ పెరగడం అంటే భారతదేశపు ఇమేజీ పెరగడమేనని సర్వ సాధారణ నమ్మకం. మోడీ విషయంలో అదే జరుగుతున్నదా అన్నది చర్చల్లో నలుగుతోంది. విదేశాల్లో ఆయన ఉపన్యాసాలన్నీ దేశ హితం కోణంలో కాకుండా రాజకీయ కోణంలో సాగినందున దేశానికి కాక కేవలం మోడీకీ, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీకీ మాత్రమే ఇమేజీ ప్రయోజనాలు కలుగుతున్నాయన్న వాదన ప్రబలంగా ఉంది.

> **భారతదేశాన్ని ఎవరెలా అన్వయించుకున్నా..వర్ధమానదేశంగా భావించినా..మేడిపండు ఆర్థిక వ్యవస్థగా అవమానించినా..ఆకాశానికి నిచ్చెనలేసే సగటు పేద దేశంగా తేలిగ్గా తీసుకున్నా..భారతదేశం ఒంటరి కాదని..దాని వెనక తనలాంటి అనేక ఆశావహ దేశాలు కంచుకోటల్లా నిలబడి ఉన్నాయని చెప్పినట్టయింది. చీమలబారులో మొదట నిలిచే సిపాయి చీమ మాదిరి భారత్ బలం పెరుగుతుంటుందే తప్ప తరిగే అవకాశమే లేదన్న నర్మగర్భపు హెచ్చరిక కూడా ఉంది. ఇదే ఈసారి రిపబ్లిక్ డే వేడుకల ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ఇలాంటి వినూత్న ఆలోచనలకు మోడీ పెట్టింది పేరుగా మారుతున్న వైనం స్పష్టమవుతోంది. 2014 మే 26న ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవానికి సార్క్ దేశాధినేతల్ని అధికారికంగా పిలిచి అప్పట్లోనే అందర్నీ ఆశ్చర్యపరిచారు. వారందరికీ వ్యక్తిగత హోదాలో తాను ఫోన్లు చేసి పిలవడం కాకుండా..విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్ దేశాలకు అధికారిక ఆహ్వానాలు పంపి దానికొక సాధికారత కల్పించారు.**


ఇక మోడీలోని రెండో ధ్రువం..అత్యంత వివాదాస్పదమైనది అది. ఇదే రిపబ్లిక్ వేడుక సందర్భంగా పెరేడ్ గ్రౌండ్స్‌లో...అట్టహాసంగా పది ఆసియాన్ దేశాధిపతులను బారులు తీర్చి బంగారు గద్దెల మీద కూర్చుండబెట్టి యావత్ ప్రపంచానికి తన వ్యూహాత్మక చాణక్యాన్ని సగర్వంగా చాటుకున్న ఇదే మైదానంలో..కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జాతీయ ప్రతిపక్ష పార్టీ అధినేత రాహుల్‌గాంధీని అనామకంగా ఆరోవరసలో కూర్చోబెట్టి తనలోని విపరీత మోడీని ఆయనకు ఆయనే ఆవిష్కరించుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఆయనకు నాలుగో వరసలో సీటు కేటాయించామని ప్రభుత్వ వర్గాలు సంజాయిషీ ఇచ్చుకుని తమ వైఖరిని సమర్థించుకోవచ్చు గాని విదేశీ అతిథులకు ఇచ్చినంత మర్యాద స్వదేశీ తోటి నాయకుడికి ఇవ్వలేనంతటి బలహీనత మోడీని నిలువెల్లా ఆక్రమించిందన్న చేదు నిజాన్ని భారతీయం జీర్ణించుకోలేకపోతున్నట్టు సామాజిక మాధ్యమాల స్పందనలను బట్టి అర్థమవుతోంది. ప్రభుత్వం నాలుగో వరసలో సీటిస్తే..కాంగ్రెస్ పార్టీ అలిగి..అవమానభారంతో రాహుల్‌గాంధీని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్ పక్కన కూచునే ఏర్పాటు చేసి తమ పరువుతో పాటు ప్రభుత్వ పరువూ కాపాడే ప్రయత్నం చేసినట్టు కనిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ బీజేపీకి ప్రధాన ప్రతిపక్ష పార్టీ కావచ్చు. దేశ సార్వభౌమత్వం, జాతీయ సమగ్రత వంటి అంశాల విషయానికొచ్చేసరికి జాతి జీవన స్రవంతిలో దాన్నీ కలుపుకొని వెళ్లడం పాలకుల విధి అన్న సంగతి ప్రధాని మోడీకి తెలియదని అనుకుంటే పొరపాటే.

ఇటువంటి సందర్భాలు వచ్చినప్పుడు ఒక వాజ్‌పేయి, ఒక పీవీ నరసింహారావు, ఒక గుజ్రాల్, ఒక మన్మోహన్‌సింగ్ ఇలాగే వ్యవహరిస్తారని ఊహామాత్రంగానైనా అనుకోలేము. అలాంటి సాధికార సంప్రదాయం నెలకొన్న వాతావరణంలో శుక్రవారం రాజ్‌పథ్ పరేడ్‌లోని సంఘటన మాత్రం యావజ్జాతి దృష్టిని ఆకర్షించింది. మోడీ పాలన మూడడుగులు మహదానందంగా ముందుకు సాగుతుంటే..నాలుగడుగులు నిర్వేదంతో వెనక్కి పడుతున్న భావనలు నానాటికీ ప్రబలమవుతున్నాయి. దీనికి నిస్సందేహంగా మోడీ వ్యవహార శైలినే ప్రామాణికంగా తీసుకోక తప్పదు. అంతర్జాతీయ యవనిక మీద ప్రధాని మోడీ తనకు తాను ఒక రాజనీతిజ్ఞుడిగా చిత్రించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఏకధ్రువ ప్రపంచంలో ఏక్‌తారగానూ, భిన్నధ్రువ సమాజానికి తానొక వారధిగానూ తనను తాను పరిగణించుకుంటున్నారు. దాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదు. అదే దేశీయంగా వచ్చేసరికి దౌత్యనీతి, పాలనారీతి అట్టడుక్కిపోతున్నాయి. రాజకీయమే ప్రధానాస్త్రమవుతోంది. ఇది వివాదాస్పదమవుతోంది. దౌత్యనీతితో వచ్చిన ఇమేజీని ఇది డ్యామేజీ చేస్తోంది. దేశీయంగా ప్రతిపక్ష పార్టీలతో చుట్టరికం చేయాలనడం..చేయాలని ఆశించడం సరికాదు. ఆచరణ సాధ్యం కూడా కాదు. అది ఉభయపక్షాలకు ఆమోదయోగ్యం కానే కాబోదు. ప్రత్యర్థుల మధ్య కూడా దౌత్యనీతిని పాటించొచ్చు. దేశ పాలనా వ్యవస్థలో ఇది అనివార్యం. దానికే గండి పడుతోంది. ప్రధాని మోడీకి ఇక్కడే తనమీద తనకు అదుపు లేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

ఆయన వ్యవహారశైలిలోని మెరుపుల మిలమిలలను విరుపుల ఫెళఫెళలు మింగేస్తున్నాయి. పెదవి విరుపులున్నా కాలం ఆయన వైపే ఉన్నట్టు అనిపిస్తోంది. పదేళ్లపాటు నిష్క్రియాపరత్వపు ప్రభుత్వాన్నీ, ప్రధానమంత్రినీ చూసిన భారత ప్రజానీకం మోడీలో చలనాత్మక నాయకుణ్ణి చూశారు. అదే ఆయనకు వరంలా వెంట నడుస్తోంది. దౌత్యనీతికీ, రాజకీయ కపటత్వానికీ మధ్య గీతను గుర్తించకపోతే.. ఆ వరం అదృశ్యమయ్యే ప్రమాదం ముంచుకు రాదన్న గ్యారంటీ లేదు!!

● వయ్యెస్సారెస్

జంగిల్ రాజ్ కోసమా?



బీహార్ మాజీ ముఖ్యమంత్రి,రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్ జెడి) అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ దాణా కుంభకోణం కేసులో జైలుకు వెళ్ళడంతో ఆయన అనుచరులంతా క్రమంగా దూరమయ్యారు.ఒకటికాదు, మూడు కేసుల్లో ఆయనకు శిక్ష పడింది. రోజూ దర్బార్ నిర్వహించడం ఆయనకు అలవాటు.ఇప్పుడు జైల్లో కూడాఅలాంటి దర్బార్‌లు నిర్వహిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. ఆయన కుమారుడు తేజస్వియాదవ్ నితీశ్ కుమార్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించి నితీశ్ కుమార్‌ని అనేక సార్లు ఇరుకున పెట్టాడు.అతడిది మొదటి నుంచి దూకుడు స్వభా వం. ఇప్పుడు తండ్రికి మద్దతు కూడగట్టేందుకు, ముఖ్యంగా సానుభూతిని సంపాదించేందుకు న్యాయ యాత్ర పేరిట ఫిబ్రవరి తొమ్మిదవ తేదీ నుంచి రాష్ట్ర మంతటా పర్యటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విశ్రాంత జీవ నం గడిపే వారుతీర్థ యాత్రలు జరుపుతారు. యువకులు యాత్రలు జరపడానికి ఏదో ఒక కారణం కావాలి కనుక, తేజస్వియాదవ్ న్యాయ యాత్ర ప్రారంభించాలని నిర్ణయించారు. లాలూ హయాం లోనూ,ఆయన సతీమణి రబ్డీ దేవి హయాంలోనూ బీహార్‌ని జంగిల్ రాజ్ అని అభివర్ణించేవారు. న్యాయం కోసం అని యాత్ర జరుపుతానని తేజస్వి ప్రకటించినా, మళ్ళీ జంగిల్ రాజ్ కోసం ఆయన యాత్ర ప్రారంభిస్తున్నారేమోనని జనం అనుకోవడం తప్పు లేదేమో!

రసగుల్లా.. తపాలా బిళ్ళ!




కలకత్తా పేరు చెబితే కాళీ మాత మాత్రమే కాదు, రసగుల్లా గుర్తుకు వస్తుంది. దేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క స్వీట్ ప్రాచుర్యాన్ని పొందింది. బందరు లడ్డు, కాకినాడ కాజ మాదిరిగానే రసగుల్లాకు దశాబ్దాలుగా ప్రాచుర్యం ఉంది. నోరూరించే రసగుల్లాలను మొట్టమొదట కోల్‌కతాకి చెందిన నోబిన్ చంద్రదాస్ తయారు చేశాడు.అప్పటి నుంచి అదే రుచిని కాపాడుకుంటూ రసగుల్లాలను ఆయన నెలకొల్పిన సంస్థ, దానిని ఆదర్శంగా తీసుకుని వెలసిన సంస్థలూ తయారు చేస్తున్నాయి. పేటెంట్ హక్కు దాస్‌దే.ఆయన బొమ్మగల పోస్టల్ స్టాంప్ విడుదల చేసేందుకు తపాలా శాఖ సన్నాహాలు చేస్తోంది. నోబిన్ చంద్ర దాస్ 1868లో ఈ రసగుల్లాని కనుగొన్నాడు. ఆయన నెలకొల్పిన సంస్థను ప్రస్తుతం ఆయన మునిమనవడు కెసి దాస్ నిర్వహిస్తున్నాడు . తమ ముత్తాత బొమ్మతో తపాలా బిళ్ళను విడుదల చేయనుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఆయన,ఈ నిర్ణయం దేశంలో స్వీట్లు తయారు చేసే వారందరినీ గౌరవించడమేనని అన్నారు. అంతేకాక, నోబిన్ చంద్ర దాస్‌పై బయోపిక్ ని కూడా రూపొందిస్తున్నారు ఈ ఏడాది డిసెంబర్‌లోఅది అన్ని థియేటర్లలో విడుదల కానుంది. 2018కి రసగుల్లాను రూపొందించి సరిగ్గా 150 సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా ఈ తపాలా బిళ్ళను విడుదల చేయడం సముచితంగాఉంటుందని దాస్ అన్నారు.

106 ఏళ్లకు సర్జరీ!




ముంబాయిలోని ములంద్‌లో గంగా దేవి అనే నూట ఆరేళ్ళ వృద్ధురాలు ఈనెలారంభం వరకూ తన పనులను తాను చేసుకునేదట.బట్టలుఉతికి ఆరవేసుకునేదట.ఆమె మంచంమీదనుంచి కింద పడటంతో తుంటె ఎముక విరిగింది. దాంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా,తుంటె మార్పిడి శస్త్ర చికిత్స చేయాలనివైద్యులుఅన్నారట.ఆమె ఏమాత్రం భయపడలేదు.శస్త్ర చికిత్సకు పూర్తిగాసహకరించింది. ఆమెఇప్పుడు పూర్తిగా కోలుకుని గతంలో మాదిరి తన పనులు తానుచేసుకుంటోందని 60 ఏళ్ళ ఆమె మనవడు తెలిపాడు.ఆమె మంచంమీదనుంచి కింద పడటం ఇది ఏడవ సారి .అయినా ఆమెప్రతిసారి వైద్యానికి సహకరిస్తోంది. కోలుకుంటోంది.ఆమె 1915లో జన్మించింది. ఆమె మనవలు కూడా తాతయ్యలు అయ్యారు. మొత్తం 80 మంది సభ్యులు గల కుటుంబానికిఆమె పెద్ద దిక్కు.ఇప్పటికీ ఆమె ఎవరి సాయంలేకుండా నడవగలుగుతోందనీ, వచ్చిన వాళ్ళకు సలహాలు ఇస్తోందని ఆమె మనవడు చెప్పాడు.ఆమె జ్ఞాపక శక్తికి అద్భుత మనీ,ఇంటికి వచ్చిన వారిని వెంటనే గుర్తుపడుతుందని ఆయన చెప్పాడు. శతాధిక వృద్ధురాలి ఆశీస్సుల కోసం వారింటికి జనం క్యూ కడుతున్నారు.



సాయినాథ్ తోటపల్లి
9394449777

ఐటమ్ సాంగ్స్‌కు ఆద్యుడు దాస్

కెఎస్ఆర్ దాస్ పేరు చెప్పగానే మోసగాళ్ళకు మోసగాడు అనే కృష్ణ నటించిన కౌబాయ్ సూపర్‌హిట్ చిత్రం గుర్తుకొస్తుంది. ఆయన డైరెక్టర్‌గా రౌడీ రాణి, ఒకనారి వంద తుపాకులు - లాంటి చిత్రాలు విజయ లలితతో హీరోయిన్ ఏక్షన్ ఒరియంటెడ్ సినిమాలకు శ్రీకారం చుట్టారు. కృష్ణ, శ్రీదేవి, సత్యనారాయణ నటించిన మామా అల్లుళ్ళ సవాల్ అనే సూపర్‌హిట్ ఫ్యామిలీ డ్రామా సెంటిమెంట్ చిత్రం చేసిన మహాదర్శకుడు. కెఎస్ఆర్ దాస్, కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన కాలాంతకులు చిత్రానికి రెండో యూనిట్ డైరెక్టర్‌గా దాస్ పనిచేయడం ఆశ్చర్యకరమైన నిజం. యాక్షన్ సీక్వెన్స్ తీయడంలో దాస్ గొప్ప దిట్ట. సినిమా స్కోప్‌నూ, 70 ఎమ్ఎమ్‌ని తెలుగు తెరకు పరిచయం చేసిన దర్శకుడాయన. ఐటమ్ డ్యాన్స్‌లకు శ్రీకారం చుట్టింది కెఎస్ఆర్ దాస్. జ్యోతిలక్ష్మిని ఏ క్లాస్ హీరోయిన్‌గా మార్చి పిల్లా -పిడుగా చిత్రం తీశారు. విజయలలిత, జ్యోతిలక్ష్మి, జయమాలిని, డిస్కో శాంతి, సిల్క్ స్మిత, అనూరాధలతో మొదటిసారిగా ఐటమ్ సాంగ్స్‌ను చేయించారు. 1960ల్లో ప్రవేశపెట్టిన ఈ ఒరవడి 2018కి విశృంఖలంగా పెరిగిపోయిందీ మనకు తెలుసు. ఇళయరాజా సంగీతంలో ఎన్‌టిఆర్, జయసుధ హీరో హీరోయిన్‌లుగా యుగంధర్ అనే సూపర్ హిట్ చిత్రానికి దాస్‌గారు దర్శకత్వం వహించారు. భలేదొంగలు అనే చిత్రంలో మోహన్‌బాబు, కృష్ణ - బిల్లా రంగా అనే చిత్రంలో చిరంజీవి, మోహన్ బాబు ఇలా మల్టీస్టారర్ చిత్రాలను ఆ కాలంలోనే చేశారు. కె.ఎస్.ఆర్ దాస్ - జేమ్స్ బాండ్ చిత్రాలను చేయడంలో దాస్ అందెవేసిన చేయి. కృష్ణ జయప్రద హీరో హీరోయిన్లుగా ఏజెంట్ గోపీ, జేమ్స్‌బాండ్ 777 అనే హిట్ చిత్రాలనూ, ముద్దాయి అనే ఫ్యామిలి డ్రామా ఏ క్లాస్ సినిమాను కృష్ణ, శారద, విజయశాంతిలతో సూపర్ హిట్ చిత్రాన్ని అందించారు. కెఎస్ఆర్ దాస్ తొలిచిత్రం లోగుట్టు పెరుమాళ్ళకెరుక. ఇందులో శోభన్‌బాబు, గీతాంజలి హీరోహీరోయిన్లు. రజనీ కాంత్, కృష్ణలతో అన్నదమ్ముల సవాల్ చిత్రానికి దాస్ దర్శకులు. నేను కె.ఎస్.ఆర్.దాస్‌తో పింజల నాగేశ్వరరావు నిర్మించిన కుట్ర సినిమాకి డైలాగ్స్ రాశాను. ఈ కుట్ర చిత్రంలో అర్జున్ హీరో పూర్ణిమ హీరోయిన్. ఆ చిత్రాన్ని హిట్ చేసిన ఘనత కెఎస్ఆర్ దాస్‌ది. 10 బైకులు - 20 కార్లు ఛేజ్‌లు రకరకాల ఫైట్స్‌కి తెరదీసింది ఆయనే. ఆ చిత్రానికి అర్జున్ చేసిన ఫైట్స్ హైలైట్.



దాసు గురించి చెప్పాలి అంటే ఆయన ఆ రోజుల్లో హాలీవుడ్ సినిమాలను బాగా స్టడీచేసి ఆ కథల స్ఫూర్తితో కృష్ణతో ఎన్నో పేరున్న చిత్రాలు చేశారు. విజయలలిత - జ్యోతి లక్ష్మి, జయమాలిని, కవితలతో లేడీ ఓరియంటెడ్ ఏ క్లాస్ సినిమాలు తీశారు. సక్సెస్ చేశారు. మామా అల్లుళ్ళ సవాల్ లాంటి ఫ్యామిలీ డ్రామాలని రూపొందించారు. సెంటిమెంట్స్‌ని పండించారు. దాస్ డైరెక్ట్ చేసిన కుట్ర చిత్రానికి నేను సంభాషణలు రాశాను. 1985 లో మొట్టమొదటిసారి నేను ఆ కుట్ర సిడిని ఎప్పటిలా చెన్నైలో కాక -మహాబలిపురం విజిపి రిసార్ట్స్‌లో రాసాను. అలా ఊరికి దూరంగా 10 రోజులు స్క్రిప్టు రాయడానికి మహాబలిపురం విజిపి రిసార్ట్స్‌లోనే రాయండి - మీకు ప్రశాంతత ఉంటుందని తీసుకెళ్ళి దగ్గరుండి రిసార్ట్స్‌లో చేర్పించి తిరిగి చెన్నై వెళ్ళారు. 5వ రోజు ఆయనకు ఫుల్ స్క్రిప్ట్ వినిపించాను. ఆ రోజుల్లో ఎస్ అనే అక్షరం గల గోల్డెన్ రింగ్ ఆయన నాకు ప్రెజెంట్ చేశారు. నాకు మోస్ట్ థ్రిల్లింగ్‌గా అనిపించిన తీపి జ్ఞాపకమది. కెఎస్ఆర్ దాస్ గారు తన సినీ జీవితాన్ని ఎడిటర్‌గా ప్రారంభించారు. చాలా చిత్రాలకు ఆయన ఎడిటింగ్ చేసే విధానం గమనించిన నిర్మాత ఎస్ భావన్నారాయణ, వైవి రావ్ ఆయనకు తొలిసారి డైరెక్షన్ అవకాశం ఇచ్చారు. కెఎస్ఆర్ దాస్‌కి దర్శకునిగా బ్రేక్ ఇచ్చిన తొలిచిత్రం లోగుట్టు పెరుమాళ్ళ కెరుక. ఆ చిత్రానికి ఆయన ఎడిటర్ అండ్ డైరెక్టర్ కావడం విశేషం. ఇప్పటిదాకా రెండు పాత్రలు పోషించిన వారెవరూ లేరు. ఆ చిత్రం సూపర్ హిట్ అయ్యింది. అప్పటినుంచి ఇప్పటి దాకా ఇండస్ట్రీలో నేను చాలామంది ఎడిటర్‌లను కలిసాను. ఇంతవరకూ డైరెక్టర్ కావాలన్న ఆకాంక్ష ఉన్నవారెవరూ నాకు కనిపించలేదు.ఉన్నా సక్సెస్ అయిన వాళ్ళెవరూ లేరు. మరి ముఖ్యంగా స్టార్ డైరెక్టర్ కావడం, ఆ చిత్రాలు ట్రెండ్ సెట్టర్లవడం దాస్‌కే చెల్లింది.

ఆర్టీసీకి సీఎన్‌జీ దన్ను

- ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి
- కాలుష్య నియంత్రణ దిశగా అడుగులు
- 158కి పెరిగిన సీఎన్‌జీ బస్సులు
- దశల వారీగా పాత బస్సులకు స్వస్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సిటీలో సీఎన్‌జీ బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ భావిస్తోంది. ఆర్టీసీ సంకల్పానికి కాలుష్య నియంత్రణ మండలి తోడ్పాటు అందించేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ నగరంలో వాహన కాలుష్యం తగ్గించాలనే ఆలోచన మేరకు ఆర్టీసీ 2012లో సీఎన్‌జీ బస్సులు ప్రవేశపెట్టింది. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ద్వారా సీఎన్‌జీ సరఫరాకు ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టీసీ కోరిన మేరకు సీఎన్‌జీని బీజీఎల్ సరఫరా చేయలేకపోతున్నది. గ్యాస్ సరఫరాలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చింది. గ్యాస్ లభ్యత లేని కారణంగా సీఎన్‌జీ బస్సులను డీజిల్‌తో నడిపించేందుకు భారీ వ్యయంతో సాంకేతిక పరమైన మార్పులు చేయవలసి వచ్చింది. హైదరాబాద్‌లో వాహన కాలుష్యం పెరిగిపోవడం పట్ల కాలుష్య నియంత్రణ మండలి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజా రవాణాలో మూడు వేలకు పైగా బస్సులు నడుపుతున్న ఆర్టీసీని సంప్రదించి వాహన కాలుష్యం నివారించేమార్గాలను సూచించింది. పాత బస్సులను ప్రజారవాణ నుండి తొలగించడం, కాలుష్యానికి తావులేని ఇంధనంతో బస్సులు నడిపించడం, డీజిల్ బస్సులను సాంకేతికంగా మెరుగు పరిచి తక్కువ కాలుష్యం వెదజల్లే విధంగా మార్పులు చేయడం లాంటి అంశాలను సూచించింది. సీఎన్‌జీ బస్సుల కొనుగోలుకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ముందుకు వచ్చింది. అవసరమైన మేరకు సీఎన్‌జీని సరఫరా చేసిన పక్షంలో దశల వారిగా డీజిల్‌తో నడిచేబస్సులను సీఎన్‌జీగా మార్చుకోవడానికి అభ్యంతరం ఉండబోదని ఆర్టీసీ పేర్కొంది. ఒక్కొక్క డీజెల్ బస్సును సీఎన్‌జీగా మార్చడానికి సుమారు రూ. 70 వేల వరకు వ్యయం అవుతుంది. బీఎస్ ఫోర్ స్పేర్ పార్టులను ఢిల్లీ నుండి తెప్పించవలసి వస్తుంది. అయినప్పటికీ ఆర్టీసీ వెనుకడుగు వేయకుండా సాంకేతిక మార్పిడికి సిద్ధమైంది. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మాత్రం ఆర్టీసీకి అవసరమైన మేరకు సీఎన్‌జీని ఇప్పట్లో సరఫరా చేయలేమని, దశల వారిగా సరఫరా పెంచడం జరుగుతుందని స్పష్టం చేయడంతో భారీ స్థాయిలో సీఎన్‌జీ బస్సులను నడిపించలేని పరిస్థితి నెలకొందని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతానికి 133 బస్సులను ఆర్టీసీ సిటీలో సీఎన్‌జీతో నడిపిస్తుంది. మరో 25 సీఎన్‌జీ బస్సులను త్వరలోనే ప్రవేశపెట్టబోతుంది. దీంతో సీఎన్‌జీ బస్సుల సంఖ్య 158కి పెరగనుంది. కనీసం రెండింట మూడవ వంతు సిటీ బస్సులను కాలుష్య రహిత ప్రత్యామ్నాయ ఇంధనంతో నడిపించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త బస్సులకు కాలుష్య నియంత్రణ మండలి ఆర్థిక తోడ్పాటు అందించనుంది.

త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలూ...

నగరాల్లో కాలుష్య రహిత ప్రజారవాణాను ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మేరకు త్వరలోనే ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగానికి ఇచ్చే ప్రోత్సాహకాలతో సరికొత్త విధానం ప్రకటించబోతున్నది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, వినియోగదారులకు కొన్ని రకాల పన్నులు మినహాయించడానికి కూడా ప్రభుత్వం ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో నగరాల్లో వాహన కాలుష్యం తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రజారవాణా రంగంలో ప్రత్యామ్నాయ ఇంధనాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోబోతున్నారు. ఇప్పటికే ఆటోలను ఎల్‌పీజీతో నడిపించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా తిప్పి పరిశీలించారు. మెట్రో రైలు రావడంతో కొంత వరకు కాలుష్యం తగ్గుతుందని భావిస్తున్నారు. అదే విధంగా నగరంలో వాహన కాలుష్యం తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పేర్కొన్నారు.

30న అమరుల దినోత్సవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత స్వాతంత్ర్య సమరంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరుల గుర్తుగా ఈనెల 30న అమరుల దినాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈనెల 30మంగళవారం రోజున కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు 2 నిమిషాలు మౌనం పాటించి అమరుల ఆత్మశాంతికి అంకితమవుదామని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ మహత్తర కార్యక్రమంలో పౌరులను కూడా భాగస్వామ్యం చేయాలని కోరింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈనెల 30న ఉదయం 10.58 గంటలనుండి 2 నిమిషాలు మౌనం పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. సచివాలయం సమతా బ్లాక్ ఎదురుగా ఉద్యోగులు సమావేశమై 2 నిమిషాలు మౌనం పాటించాలని జీఏడి కార్యదర్శి అధర్ సిన్హా పేర్కొన్నారు.

జీవకణ పరిశోధనలతో వ్యాధులకు కళ్ళెం

అంతర్జాతీయ సదస్సులో డా. ఛాల్ఫీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీవకణ పరిశోధనలతో దేహ నిర్మాణం ఏవిధంగా జరుగుతుందో తెలుసుకోవటంతోపాటు పలు రకాల వ్యాధులకు కళ్ళెం వేయవచ్చని నోబుల్ పురస్కార గ్రహీత డా.మార్టిన్ ఛాల్ఫీ అన్నారు. శనివారం ఇండియన్ సొసైటీ ఆఫ్ సెల్ బయాలజీ సౌజన్యంతో సెల్ బయాలజీపై ఏర్పాటు చేసిన ఐదు రోజుల అంతర్జాతీయ సదస్సును హైదరాబాద్ సమీపంలోని షామీర్ పేటలో ప్రారంబించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.ఛాల్ఫీ జీవకణ పరిశోధనల్లో జీఎ ఫ్‌పీ(గ్రీన్‌ఫ్లోరోసెంట్ ప్రొటీన్)మాలిక్యుల్‌ను కనిపట్టడం ద్వారా పరిశోధనల ప్రగతి మరింత వేగం పుంజుకుందన్నారు.తాను జవకణ పరిశోధనల శాస్త్రవేత్తగా ఎదిగిన క్రమాన్ని ఈ సందర్భంగా వివరించారు.జీఎఫ్‌పీకి తనంతట తాను బ్లూలైట్‌లో ప్రకాశించే గుణం ఉందన్నారు. జీవకణ పరిశోధనలకు పారదర్శకంగా ఉండే జెల్లీఫిష్ కణాలను ఎంచుకున్నట్టు వెల్లడించారు.

ఫొటోగ్రఫీలో దార్శనికుడు భరత్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను నిశితంగా పరిశీలించి తనదైన శైలిలో ఫోటోల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన దార్శనిక ఫోటోగ్రాఫర్ భరత్ భూషణ్ అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ కొనియాడారు. ఆయన సేవలకు గానూ యూనివర్సిటీ జీవన సాఫల్య విశిష్టపురస్కారాన్ని అందించామని తెలిపారు. యూనివర్సిటీ 32వ వ్యవస్థాపన దినోత్సవాన్ని శనివారం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2016 విశిష్ట జీవన సాఫల్య పురస్కారాన్ని భరత్ భూషణ్‌కు ప్రధానం చేసినట్టు ఆయన తెలిపారు.బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు మాట్లాడుతూ ఫోటోగ్రఫీని గొప్ప కళగా ముద్రవేసి నిరంతరం తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు సంబంధించిన సజీవ చిత్రాలను జాతికి అంకితం చేసిన కళాపిపాసి భరత్ భూషణ్ అని కొనియాడారు. వీరి వద్ద కొన్ని లక్షల ఫోటోలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదన్నారు. ఒకే రంగంలో ఎక్కువ కాలం పనిచేస్తే వారు తప్పకుండా రాణిస్తారని అన్నారు. పురస్కార గ్రహీత భరత్ భూషణ్ మాట్లాడుతూ ఖిలావరంగల్‌లోని సామాన్య కుటుంబంలో పుట్టి తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారాన్ని అందుకోవడం గర్వంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.


ఆసియాలోనే అతిపెద్ద డ్రిప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కర్నాటక ప్రభుత్వం కృష్ణానదీ జలాల ఆధారంగా మరో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభానికి సిద్దం చేసింది. ఆలమట్టి బ్యాక్ వాటర్‌ను ఉపయోగించుకుని ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్యం ప్రాజెక్టును నిర్మించింది. కర్నాటకలోని భాగల్‌కోట్ జిల్లా రాంతల్ మరోళాలో నిర్మించిన భారీ ప్రాజెక్టును కర్నాకట రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి ఎంబీ పాటిల్ ఆదివారం రైతులకు అంకితం చేయనున్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన సెటాఫిమ్ సంస్థ సాంకేతిక సహకారంతో కర్నాటక ప్రభుత్వం రూ.381కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఈ అధునాతన ప్రాజెక్టును నిర్మించింది. 2150 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్ నిర్మాణాలతో కూడిన ఈ ప్రాజెక్టు పనులు మెఘా ఇంజనీరింగ్ సంస్థకు అప్పగించి సకాలంలో పూర్తి చేయించింది. ఆలమట్టి బ్యాక్ వాటర్‌ను ఉపయోగించుకుని ఇజ్రాయిల్ టెక్నాలజీతో నిర్మించిన డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రైతుల పొలాలకు నీరందించనున్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణంలో అనుభవం గడించిన మెగా సంస్థ తొలిసారి ఆసియాలోనే అతిపెద్ద డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టి సకాలంలో పూర్తిచేసినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొన్నాయి. డ్రిప్‌ఇరిగేషన్ కోసం భూమిలోపల వేసే పైపులు 15ఏళ్లకు మించి మనుగడ ఉండవు. అయితే బాగల్‌కోట్ ప్రాజెక్టులో వినియోగించిన పైపులు భూమిలోపలే నిర్మిచంట ద్వారా వీటి జీవితకాలం 50ఏళ్లకుపైగానే ఉంటుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకోసం ఆప్టిక్ ఫైబర్ పైపులను వినియోగించారు. ఇజ్రాయేల్ సాంకేతి పరిజ్ఞాణంతో నిర్మించిన ఈ డ్రిప్‌ఇరిగేషన్ పథకం కింద రైతు పొలంలోనే సిలెండర్లు ఏర్పాటు చేసి వీటి ద్వారానే నేరుగా రసయానిక ఎరువులు. క్రిమిసంహారక మందులు వంటి వాటినిని పైర్లకు అందించనున్నారు. కృష్ణానది బ్యాక్ వాటర్‌లో ఏవైనా వ్యర్థాలు వస్తే వాటిని శుబ్రపరిచి పంటలకు అందించే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రాజెక్టులో తొలిసారి ఉపయోగించారు.



గుప్తనిధి కోసం తవ్వకాలు ఆపండి

ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన హైకోర్టు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం లోని చెన్నంపల్లి కోట సమీపంలో గుప్త నిధుల కోసం జరుగుతున్న తవ్వకాలను నిలువరించేలా, చారి త్రాత్మక కట్టడమైన కోటను కాపా డేలా ఏపీ ప్రభుత్వాన్ని ఆదే శించాలని అభ్యర్థిస్తూ రాసిన లేఖను హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. కర్నూలు జిల్లా, తుగ్గలి మండల పరిధిలోని కోట వద్ద గుప్త నిధుల కోసం జరుగుతున్న తవ్వకాలను నిలువరించి, కోటను కాపాడాలని కోరుతూ కర్నూలు (దూపాడు) కు చెందిన డాక్టర్ బ్రహ్మారెడ్డి ఉమ్మడి హైకోర్టుకు లేఖ రాశారు. ఓ ప్రముఖ దినపత్రికలో ప్రచురించిన వార్తా కథనం ఆధారంగా రాసిన ఆ లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఆ పత్రిక కథనం ప్రకారం ఏపీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే తవ్వకాలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారని డాక్టర్ బ్రహ్మారెడ్డి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాలని హైకోర్టు పిల్ కమిటీ సిఫారసు చేసింది. దీంతో హైకోర్టు రిజిస్ట్రీ ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపే అవకాశముంది.

ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మేడారం సమ్మక్క - సారక్క జాతర ట్రస్టు బోర్డు ఏర్పాటు వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో మూడు వారాల్లో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావు లతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. సమ్మక్క- సారక్క జాతర నిర్వాహణ కోసం తెలంగాణ ప్రభుత్వం గిరిజనేతరులతో కమిటీ వేయడాన్ని సవాలు చేస్తూ మంకిడి.బుచ్చయ్య హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. షెడ్యూల్డ్ తెగలు ఏ మతానికి చెందనందువల్ల వారిని హిందువులుగా పరిగణించరాదన్నారు. గత కొన్ని దశాబ్దాల నుంచి జాతరను గిరిజనులు మాత్రమే పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అందువల్ల జాతర ట్రస్టు బోర్డు సభ్యులు కూడా గిరిజనులే ఉండాలన్నారు. ప్రభుత్వం నియమించిన ట్రస్టు బోర్డును రద్దు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ..తెలంగాణ సర్కారుతోపాటు, దేవాదాయ శాఖ కమిషనర్ కు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.



ఏజెన్సీలో మావోల అలజడి

ఒకరు హతం.. మరొకరికి తీవ్ర గాయాలు

పినపాక, ప్రభ న్యూస్ : మావోయిస్టులు మరోసారి తమ ఉనికిని చాటుకునేందుకు పినపాక మండలంలో శుక్రవారం అర్ధరాత్రి అలజడి సృష్టించారు. పోలీసులకు సవాల్‌గా తమ మనుగడను కోల్పోలేదని తెలపడానికి భీభత్సం సృష్టించారు. ఒకరిని చంపి... మరొకరిని గాయపర్చి... లారీలు, ప్రొక్లెన్లు, ట్రాక్టర్లకు నిప్పు పెట్టారు. పినపాక మండలంలో మావోయిస్టుల అలజడి తగ్గిందనుకున్న సమయంలో శుక్రవారం అర్ధరాత్రి మావోయిస్టులు చేసిన పనులకు మరలా మావోయిస్టులు తమ ఉనికిని చాటుకోబోతున్నారన్న అంశం వెలుగులోకి వచ్చింది. మావోయిస్టులు ఇన్‌ఫార్మర్లనే నెపంతో ఒకరిని చంపి... ఆ చావుకు పోలీసులకు ఇన్‌ఫార్మర్ అయినందుకే అతన్ని చంపామని సంఘటన స్థలంలో కరపత్రం వదలడం నిదర్శనమైంది. మావోయిస్టులు సృష్టించిన బీభత్స ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జానంపేట పంచాయతీ భూపతిరావుపేట, సుందరయ్యనగర్ గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి మావోయిస్టులు 45 మంది దాడికి పాల్పడ్డారు. దుగినేపల్లి పంచాయతీలోని వీరాపురం గ్రామ సరిహద్దులో ఉమేష్‌చంద్రనగర్‌కు చెందిన పొడెం జోగయ్య అలియాస్ రాము అనే వ్యక్తిని అర్ధరాత్రి నలుగురు మావోయిస్టులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. అనంతరం జానంపేట పంచాయతీలో సుందరయ్యనగర్ గ్రామానికి చెందిన మడివి రమేష్‌పై కాల్పులు జరిపారు. ఈ కాల్పులో రమేష్ చేయికి తీవ్ర గాయం కావడంతో లేచి పారిపోయాడు. భూపతిరావుపేట ర్యాంప్‌లో మూడు ప్రొక్లైన్లను, నాలుగు లారీలను, ఒక ట్రాక్టర్‌ను దగ్ధం చేశారు.

పవన్ కల్యాణ్ కారు, డ్రైవర్‌పై కేసు నమోదు

ఖమ్మం, ప్రభ న్యూస్ సిటీ బ్యూరో : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కారు డ్రైవర్‌పై కేసు నయోదయింది . ర్యాష్ డ్రైవింగ్ అండ్ నెగ్లిజెన్సీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.జిల్లా పర్యటన సందర్భంగా ఇటీవల ఖమ్మం నగరంలోని అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోపాలపురం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న ఖమ్మం రూరల్ ఎస్ఐ చిరంజీవి ప్రమాదవశాత్తు పవన్ కళ్యాణ్ కారు నుంచి కిందపడ్డారు. అయితే అదే సమయంలో ఎస్ఐ కాలుపై నుంచి పవన్ కళ్యాణ్ కారు వెళ్లడంతో కాలు విరిగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. ఎస్ఐ చిరంజీవికి ఖమ్మంలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని కిమ్స్‌లో ఆపరేషన్ చేసి వైద్యం చేస్తున్నారు. కాగా ఈ ప్రమాద ఘటనపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్బన్ సిఐ నాగేంద్రచారి పవన్ కళ్యాణ్ కారు, ఈ కేసుకు సంబంధించి త్వరలో చార్జి షీట్ దాఖలు చేయనున్నారు.



పోలీసు శాఖలో స్పేస్ టెక్నాలజీ

ఇస్రో మాజీ చైర్మన్ కిరణ్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్పేస్ టెక్నాలజీని పోలీస్ శాఖలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఇస్రో మాజీ చైర్మన్ ఎఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. ఆర్‌బివీఆర్‌ఆర్ తెలంగాణ స్టేట్ పోలీసు అకాడమీ ఆధ్వర్యంలో బేగంపేట సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో కె.ఎస్ వ్యాస్ 22వ సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని స్పేస్ టెక్నాలజీ అండ్ మెయింట్‌నెన్స్ ఆఫ్ లా అండ్ ఆర్డర్ అనే అంశంపై ప్రసంగించారు. పోలీసు అకాడమీలో స్పేస్ టెక్నాలజీకి చెందిన వివిధ మాడ్యూల్స్‌ను ఇంట్రడ్యూస్ చేసి.. ట్రైనింగ్ షెడ్యూల్‌లో పొందుపర్చే విధంగా ఆనక పోలీసుశాఖ వాటి వినియోగం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించే విధంగా ప్రయత్నించాలన్నదే తన అభిప్రాయంగా ఆయన వెల్లడించారు. డీజీపీ మహేం దర్‌రెడ్డి మాట్లాడుతూ.. కె.ఎస్‌వ్యాస్ ఇన్నోవేటివ్, డేరింగ్, క్రియేటివ్ ఆఫీసర్ అని ప్రస్తుతించారు. పోలీసు అకాడమి డైరెక్టర్ జితేందర్ మాట్లాడుతూ ఎటువంటి సదు పాయాలు లేని సమయంలో వ్యాస్ ట్రాఫిక్ డీసీపీగా చేపట్టిన సంస్కరణలను ఆయన గుర్తు చేశారు. చెమటోడ్చనిదే ఎవరూ పైకి రాలేరని వ్యాస్ సతీమణి అరుణావ్యాస్ స్పష్టం చేశారు. ప్రతి నిమిషం డిపార్టుమెంట్ గురించే వ్యాస్ ఆలోచించేవారన్నారు. మాజీ డీజీపీ ఎంవీ కృష్ణారావు మాట్లాడుతూ తాను వ్యాస్ కుటుంబసభ్యుల్లో ఒకరినని, ఒకే బ్యాచ్ ఐపీఎస్‌లమని ఆయన గుర్తు చేసుకున్నారు.


టీటీసీ అనంతపురంలో ఆరు వారాలు తాను, వ్యాస్ ఒకే రూమ్‌లో ఉన్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ అంజనీకుమార్, కె.ఎస్.వ్యాస్ తనయుడు శ్రీవత్స, అకాడమీ జాయింట్ డైరెక్టర్ మురళీధర్ ప్రభృతులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ పోలీసు బాస్‌లు, సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి, ఐజీ స్టీఫెన్ రవీంద్ర, లా అండ్ ఆర్డర్ ఎస్పీ రమేష్‌రెడ్డి ప్రభృతులు హాజరయ్యారు.

'విలువలతో కూడిన రాజకీయాలు చేయాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిబద్ధత, నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, అప్పుడే ప్రజల్లో ఆ నేతలు చిరస్మరణీయుడిగా ఉంటారని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర అన్నారు. గోపాల్‌రావు ఠాకూర్ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సోమాజిగూడలోని ఒక హోటల్‌లో సిక్కిం మాజీ గవర్నర్ స్వర్గీయ వి. రామారావు స్మారకోపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంబిత్ పాత్ర మాట్లాడుతూ, ఎవరైతే భయం లేకుండా, నిజాయితీగా, విలువలు కలిగిన రాజకీయాలు చేస్తారో వారే భారం లేకుండా ఉంటారన్నారు. సమాజంలో రాజకీయ నాయకులను విలువ లేని వ్యక్తులుగా, అవినీతికి ఆనవాళ్ళుగా చూస్తున్న తరుణంలో ఇప్పుడున్న రాజకీయాలను ప్రధాని నరేంద్ర మోడీ పూర్తి విశ్వాస రాజకీయాలుగా మార్చారన్నారు. ప్రతిరోజూ మనిషి జీవితం కోరికలతో ప్రారంభమై కోరికలతోనే ముగుస్తుంది కానీ మనిషి సంతృప్తి చెందడం లేదని, అసంతృప్తితోనే జీవితం ముగుస్తుందన్నారు. సొంత కోరికలు లేని రాజకీయాలు చేయాలని, స్వార్థ రాజకీయాలను వీడాలని హితవు పలికారు. ప్రజలందరికీ సేవ చేసేది రామ రాజ్యమని, రామరాజ్యమంటే హిందూ పాలన కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒక దినపత్రిక ప్రధాన సంపాదకులు కె. రామచంద్రమూర్తి కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, బిజెఎల్‌పి నేత జి. కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎంఎల్‌సి ఎన్. రాంచందర్‌రావు, మాజీ జస్టిస్ సివి రాములు, వి. రామారావు కుమారుడు వి. శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, రామారావు నిబద్ధత, నిజాయితీ, ప్రజలతో మమేకమైన తీరు, రాజకీయాలలో ఆయన చూపిన విలువలు తదితర వాటిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ ఎస్ భావనారాయణ అధ్యక్షత వహించారు.

ఎమ్ఎస్‌సీలకు స్టార్టప్‌ల సవాల్

- బడా కంపెనీలకు పోటీగా సన్‌రియో టెక్నాలజీస్
- ఎల్ఈడీ టీవీని రూపొందించిన చిన్న సంస్థ
- మొలకెత్తిన విత్తనాలతో మరో సంస్థ ఏడాదికి రూ. కోటి ఆదాయం
- ఎమ్ఎస్ఎమ్ఈ వరల్డ్ ఎక్స్‌పో -2018లో స్టార్టప్‌ల హవా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు కేవలం తక్కువ సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తులు సాధిస్తున్న నేపథ్యంలో ఈ రంగానికి చెందిన ఓ చిన్న కంపెనీ బహుళజాతి సంస్థలకు పోటీగా ఎల్ఈడీ టీవీని ఉత్పత్తి చేసింది. స్ఫూర్తి ఫుడ్స్ అనే సూక్ష్మ సంస్థ స్ప్రౌట్స్‌వాలా పేరుతో మొలకెత్తిన గింజలు సరఫరా చేస్తూ ఓ పెద్ద కంపెనీలా విస్తరిస్తోంది. కేంద్ర ప్రభుత్వ రంగానికి చెందిన జాతీయ చిన్న పరిశ్రమల సంస్థ (ఎన్ఎస్ఐసి) నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ వరల్డ్ ఎక్స్‌పో - 2018 శనివారం ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోలో దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్నతరహా రంగానికి చెందిన 100 సంస్థలు తమ ఉత్పత్తులు, టెక్నాలజీని ప్రదర్శనలో ఉంచాయి.

తెలంగాణకు చెందిన సన్‌రియో టెక్నాలజీస్ ఎల్ఈడీ టీవీ ఉత్పత్తి చేసింది. చిన్నతరహా రంగంలో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఎల్ఈడీ టీవీ ఉత్పత్తి చేయడం గమనార్హం. ఈ టీవీలలో 4కే యు హెచ్‌డి టీవీ, ఎల్ఈడీ స్మార్ట్ టీవీలను కూడా తాము ఉత్పత్తి చేస్తున్నామని ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వేణు చెప్పారు. మరో చిన్న సంస్థ స్ఫూర్తి ఫుడ్స్ మొలకెత్తిన గింజలను ఇంటింటికి సరఫరా చేస్తూ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఒక సూక్ష్మ సంస్థగా ఈ వ్యాపారంలో అడుగుపెట్టి దశల వారీగా విస్తరిస్తూ స్ప్రౌట్స్‌వాలాగా గుర్తింపు పొందింది. ఈ సంస్థ న్యూట్రిషియన్ బాక్సులు, ఆరోగ్యకరమైన మొలకెత్తిన గింజలను రోజుకి 750 ఇళ్ళకు సరఫరా చేస్తున్నామని ఈ సంస్థ సీఈవో రాజేష్ గజవాడ తెలిపారు. గృహాలు, కార్యాలయాలు, ఔట్‌లెట్స్, ఈవెంట్స్‌తో సహా ఏటా దాదాపు 15వేల కిలోల మొలకెత్తిన గింజల సరఫరాతో కోటి రూపాయల వ్యాపారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మరో ఎంఎస్ఎంఈ సంస్థలా మింటేజ్ హెల్త్ ఇన్సూరెన్స్ సర్వీసులు అందిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెడికల్ బీమా ఉన్న వారికి సహాయం చేయడంలోత తమ సంస్థ సేవలు అందిస్తోందని చెప్పారు. ఇంతవరకు 100 మంది రోగులకు కోటి రూపాయల విలువైన బీమా చెల్లింపులకు సర్వీసులు అందించామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో స్టార్టప్ విస్తరణతో పెరుగుతున్న సేవలకు అనుగుణంగా ఎంఎస్ఎంఈ కూడా తన పరిధిని పెంచుకుంటోంది. సూక్ష్మ, చిన్న కంపెనీలు కూడా చిన్న వ్యాపారాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తూ పెద్ద సంస్థలకు పోటీగా నిలుస్తున్నాయి. గతంలో మాదిరిగా కాకుండా ఉత్పత్తులు చిన్నవే అయినప్పటికీ వాటి వ్యాపారం విస్తరించడంతో టర్నోవర్ గణనీయంగా పెరుగుతోంది. కొన్ని సంస్థలు ఆరోగ్య బీమా పరిహారం చెల్లింపుల సేవలు చేస్తుండగా, మరికొన్ని కార్పొరేట్ సంస్థలకు ఏజెంట్లుగా, క్షేత్రస్థాయిలో సహాయకులుగా పని చేస్తున్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న 100 సూక్ష్మ, స్టార్టప్స్‌లలో సగానికిపైగా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం గమనార్హం.సూక్ష్మ, చిన్న తరహా, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ వరల్డ్ ఎక్స్‌పో దేశవ్యాప్తంగా ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తుందని ఈ ఎక్స్‌పో వ్యవస్థాపకుడు గంప శ్రీకాంత్ తెలిపారు. అనేక మంది యువకులు తమ ఆలోచనలకు పదునుపెట్టి అన్వేషనలతో అనేక కొత్త ఉత్పత్తులు, టెక్నాలజీని ఆవిష్కరిస్తున్నారని ఆయన అన్నారు.

Andhraprabha business 2018
బిజినెస్

BUSINESS

గోవా రెవెన్యూ వసూళ్లలో 5-7 శాతం వృద్ధి

పానాజీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గోవా రాష్ట్ర రెవెన్యూ వసూళ్లలో వృద్ధి 5 నుంచి 7 శాతంవరకు ఉంటుందని గోవా సీఎం మనోహర్ పారికర్ అన్నారు. దీనిలో అధిక వాటా జీఎస్‌టీదేనన్నారు. శుక్రవారం రాత్రి పారికర్ విలేకరులతో మాట్లాడుతూ..గోవాలో జీఎస్‌టీ వసూళ్లు వ్యాట్ వసూళ్ల కంటే ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తియ్యేసరికి మొత్తం రెవెన్యూ వసూళ్లు రూ.3,200 కోట్లను దాటుతాయన్నారు. జీఎస్‌టీ అమలుకు నష్టపరిహారంగా కేంద్రం రూ.400 కోట్లు అందిస్తున్నదని పారికర్ చెప్పారు. 2016-17లో రెవెన్యూ వసూళ్లు రూ.2,950కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ఒక్క జనవరిలో ఇప్పటివరకు జీఎస్‌టీ వసూళ్లు రూ.112 కోట్లు నమోదయ్యాయన్నారు. వీటిలో రూ.65-70 కోట్లు కేంద్రం జీఎస్‌టీలో భాగంగా అందిస్తున్నదని తెలిపారు. జనవరి మాసాంతానికి ఇవి రూ.230కోట్లకు చేరుతాయన్నారు. కేంద్రం జీఎస్‌టీ నష్టపరిహారంను కలిపితే ఇవి రూ.290 కోట్లకు చేరుతాయన్నారు. జీఎస్‌టీ అమలు చేస్తున్నందుకు గోవా ఇప్పటివరకు రూ.103కోట్లు నష్టపరిహారంగా పొందినదని ఆయన తెలపారు.



పల్లెకు చేయూత ప్రగతికి బాటలు

జైట్లీ బడ్జెట్‌పై గ్రామీణుల ఆశలు



పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు పరస్పర పూరకాలు • ద్రవ్యలోటు భర్తీకి మార్కెట్ రుణాలే శరణ్యమా? • 2018-19 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ఎటువైపు మొగ్గుతారో?

2018-19 బడ్జెట్‌పై సామాన్యుడు నుంచి వ్యాపారుల వరకు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఒక పక్క జీఎస్టీపై వ్యాపారులు సందేహాలు లేవనెత్తుతూ ఉంటే.. మరోపక్క పెరుగుతున్న ఇంధన ధరలు, నిరుద్యోగం, ఉపాధి కల్పన అంశాలపై సామాన్యులు భీతి చెందుతున్నారు. ప్రభుత్వం ఒకపక్క ద్రవ్యలోటును తగ్గిస్తానని చెపుతూ గ్రామీణ ఉపాధి, వ్యవసాయం రంగాలకు ఊతం ఇస్తామని సంకేతాలిస్తున్నప్పటికి.. ప్రజలు ప్రభుత్వంవైపు అనుమానంగానే చూస్తున్నారు. దేశంలో ప్రయాణించడానికి సామాన్యుడు రైల్వేలనే నమ్ముకున్నాడు. ఈ సారీ బడ్జెట్ రైల్వేకు కేటాయింపులు పెంచి సామాన్యుడికి సౌకర్యాలు పెంచుతారని ఆశిస్తున్నారు. దేశీయ, విదేశీయ కంపెనీలకు భారత్ నిస్సందేహంగా పెద్ద మార్కెట్ అని ప్రధాని మోడీ చెపుతున్న నేపథ్యంలో... ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టే బడ్జెట్ మార్కెట్‌కు ఊతం ఇస్తూ.. సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను పెంపొందించే విధంగా ఉంటుందని విశ్లేషకుల భావిస్తున్నారు

న్యూఢిల్లీ: ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టిని కేంద్రీకరిస్తోందనీ, గ్రామాల్లో దుర్భర పరిస్థితులను తొలగించే అంశంపై వెంటనే దృష్టిని కేంద్రీకరించాలని వీరమణి సూచించారు. వ్యవసాయ రంగంలో సంస్కరణ అనే మాట వినిపించడంలేదని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పాదకత పెరిగితేనే, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు. ఉత్పత్తి, ఉపాధి రెండు పరస్పరాన్వితాలని ఆయన అన్నారు. వెంటనే ఫలితాలు ఇచ్చే కార్యక్రమాలపై కేంద్రం దృష్టిసారించాలని ఆయన సూచించారు.

సుదీప్తో ముండ్లే కూడా ఇదే సూచన చేశారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలను పెంచడం వంటి కార్యక్రమాలను చేపడితే ఉపాధి సమస్యలు వాటంతట అవే పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన విజయవంతమైన కార్యక్రమమని ఆయన అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తృత పర్చకపోయినా, యథాతథంగా కొనసాగించడం అవసరమని ముండ్లే సూచించారు. ఏ ప్రభుత్వానికైనా ఎన్నికలు సమీపిస్తున్నాయంటే జనాకర్షణ పథకాలు ప్రకటించక తప్పదు. అవి పదిశాతం మార్జిన్ మించి ఉండకూడదని ముండ్లే అన్నారు.

సామాన్యుడు కోరుతున్నదేమిటి

పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి భారాలతో సతమతమవుతున్న సామాన్య ప్రజలు వచ్చే బడ్జెట్‌లో ఆర్థికమంత్రి రాయితీలు ప్రకటిస్తారేమోనని ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగులు ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలని కోరుతున్నారు. కార్పోరేట్ సంస్థలు కార్పోరేట్ పన్నును తగ్గించాలని కోరుతున్నాయి. రైతులు రుణభారాన్ని తగ్గించమని కోరుతున్నారు. ఇంకా....

- ఏటా 25లక్షల పైన ఆదాయం వచ్చే రైతుల వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించాలి.
- మరిన్ని ఉద్యోగాలను కల్పించాలని, ముఖ్యంగా, ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు పెరిగేట్టు చూడాలి.
- ఆదాయ పన్ను చెల్లించే వారికి సామాజిక భద్రత కల్పించాలని కోరుతున్నారు. మార్కెట్లలో ఎగుడుదిగుడుల వల్ల ఉపాధి కోల్పోతే అలవెన్స్ రూపంలో చెల్లించాలి.
- జాతీయ, రహదారులపై టోల్‌గేట్ పన్ను వసూళ్ళు పూర్తిగా నిలిపివేయాలి.
- ఎంపీలు, ఎమ్మెల్యేలకు జీవితకాల పెన్షన్లు, ఇతర సదుపాయాలు నిలిపివేయాలి.
- అన్ని రాష్ట్రాల్లో ఓడరేవులకు అనుబంధంగా స్వేచ్ఛా మండల కంపెనీలను తెరవాలి.
- జిఎస్‌టి గరిష్ఠ రేటు 12 శాతం మించకూడదు.
- వృద్ధులు చెల్లించే హెల్త్ ఇన్స్యూరెన్స్ ప్రీమియంను పన్ను పరిధి నుంచి పూర్తిగా మినహాయించాలి.
- సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లపై పన్ను విధించరాదు.
- బ్యాంకుల్లో ఫిక్సెడ్ డిపాజిట్లపై టిడిఎస్ రేట్లను పది నుంచి ఐదు శాతానికి తగ్గించాలి.
- నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించేవరకూ నెలకూ రూ. 5,000 భృతి చెల్లించాలి.
- దివ్యాంగులకు ఆదాయం పన్నులో ఇస్తున్న రిబేటును పెంచాలి.
- మధ్యతరగతి వర్గాలకు గృహ పథకాలు అందుబాటులో ఉండేట్టు చూడాలి.
- రిటర్న్ ఫారాలు ఒకపేజీ మించకుండా ఉండేట్టు చూడాలి. అనవసర వివరాల కోసం ఒత్తిడి చేయవద్దు.

లోటు భర్తీకి వాటాల విక్రయమే మార్గం

కొత్త బడ్జెట్‌లో లోటు ఎంత ఉంటుందనే దానిపై ఆర్థికశాస్త్రవేత్తల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ బిమల్ జలాన్ కఠినమైన ఆర్థిక లక్ష్యాలు బెడిసి కొడతాయని వ్యాఖ్యానించారు. భారత్ వంటి సువిశాల దేశంలో ఆర్థిక వ్యవస్థ పటిష్టం కావడానికి వృద్ధి రేటు పెరగడానికి ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో ద్రవ్యలోటు పెరిగితే ప్రభుత్వం కానీ, ఆర్థిక విశ్లేషకులు కానీ కోపగించరాదు. అందరూ దీంతో ఏకీభవించరు. తన లక్ష్యాలకు కట్టుబడి ఉండకపోతే, ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతింటుందని ఆర్థిక రంగంలో ప్రమాణాలు పాటించాలనే వారు వాదిస్తున్నారు. బాండ్ల జారీ వల్ల కూడా పెద్దగా ప్రయోజనం లేదు. పదేళ్ళ కాలపరిమితి బాండ్లకు వడ్డీ రేట్లు మార్కెట్ ప్రకారం వడ్డీ రేట్లు చెల్లించడం సామాన్యమైన విషయం కాదు. మార్కెట్‌లో వడ్డీరేట్ల పెరుగుదల ఆందోళన కలిగిస్తున్నది. సూక్ష్మ ఆర్థిక స్థిరత్వానికి ద్రవ్యలోటు తగ్గించాలన్న లక్ష్యాలకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆర్థిక వేత్తలు పేర్కొంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ వీరమణి ప్రస్తుత పరిస్థితిపై వ్యాఖ్యానిస్తూ, జిఎస్‌టి అమలు వల్ల రాబడి తగ్గినప్పటికీ, పన్ను పరిధిలోకి రాని రాబడి మార్గాల ద్వారా లోటును భర్తీ చేసుకోవచ్చునని అన్నారు. ఇందుకు ఆయన ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయాన్ని ప్రత్యామ్నాయంగా పేర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ. 72,500 కోట్ల రాబడి రావచ్చని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ప్రభుత్వ ప్రతిష్ఠ అనేది చాలా కష్టపడి సాధించుకున్నది. దానిని నిలబెట్టుకోవాలంటే, ఆర్థిక లోటు తగ్గింపుపై హామీలను నిలబెట్టుకోవల్సిందేనని నిపుణుల అభిప్రాయం. లోటును భర్తీ చేసుకోవడానికి ఇప్పటికీ వ్యవధి ఉందనీ, ప్రభుత్వసంస్థల్లోని ఈక్విటీలను విక్రయించి రాబడి లోటును పూరించుకోవచ్చునని అరవింద్ వీరమణి అన్నారు.

క్రెడిట్ సూస్సే అనే బ్రోకరేజి హౌస్ ఈనెల 19వ తేదీన విడుదల చేసిన ప్రకటనలో ఈసారి రాబడి రూ. 90,000 కోట్లు తగ్గవచ్చని అంచనా వేసింది. అదే సమయంలో ప్రభుత్వ వ్యయం బడ్జెట్ అంచనాల కన్నా మూడు శాతం తగ్గవచ్చని కూడా పేర్కొంది. మొత్తం మీద ద్రవ్య లోటు 1917-18 ఆర్థిక సంవత్సరంలో 3.4 శాతం, 2018-19లో 3.2 శాతం స్థిరపడవచ్చని ఆ సంస్థ పేర్కొంది.

జిఎస్‌టి వల్ల తగ్గే ఆదాయాన్ని భర్తీ చేసుకోవడానికి ప్రభుత్వ సంస్థల్లో వాటాలను విక్రయించడం తప్పుకాదని పబ్లిక్ ఫైనాన్స్, అండ్ పాలసీ జాతీయ సంస్థ ప్రొఫెసర్ సుదీప్తో ముండ్లే స్పష్టం చేశారు. ప్రత్యక్ష పన్నుల ద్వారా ఆదాయాన్ని మెరుగు పర్చుకోవచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానూ, రిజర్వు బ్యాంకు ద్వారానూ మిగులు నిధులను సృష్టించవచ్చునని ఆయన అన్నారు. మార్కెట్‌ల నుంచి సేకరించే మొత్తాన్ని రూ. 50 వేల కోట్ల నుంచి 20 వేల కోట్లకు తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడాన్ని బట్టి ప్రభుత్వానికి ఇతర మార్గాలు ఉన్నాయనిపిస్తోందని ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. స్థూలంగా వృద్ధి కనిపించకపోయినా, ఆర్థిక విధానం ఎప్పుడూ నిరంతర ప్రక్రియగా కొనసాగుతూ ఉండాలన్నది నిపుణుల అభిప్రాయం. వృద్ధి పుంజుకుంటున్నప్పుడు ఆర్థిక స్థిరీకరణ విషయంలో ఎందుకు రాజీపడాలని ముండ్లే ప్రశ్నించారు. స్వదేశీ అంతర్జాతీయ రంగాల్లో మన ఆర్థికవ్యవస్థపై సరైన సంకేతాలను అందించడం అత్యవసరమని ఆయన అన్నారు.

జిడిపి వృద్ధి పూర్తి ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం కన్నా ఎక్కువ ఉండవచ్చనీ, 6.7 శాతం వద్ద అది స్థిర పడవచ్చని వీరమణి అన్నారు. రెండవ పక్షంలో జిడిపి 7-7.5 శాతం వద్ద స్థిర పడవచ్చని ఆయన అన్నారు. వచ్చే ఆరు నుంచి 12 మాసాల్లో ఎగుమతులు పుంజుకోవచ్చని ఆయన అన్నారు.



రైల్వేకు బడ్జెట్‌లో కోత!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం గత ఏడాది సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ని విలీనం చేసింది. రైల్వేలకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టడమనే సంప్రదాయం బ్రిటిష్ వారి హయాం నుంచి అంటే, 83 సంవత్సరాల నుంచి వస్తోంది. దానికి మోడీ ప్రభుత్వం గత ఏడాది స్వస్తి చెప్పింది. కొత్త బడ్జెట్‌లో రైల్వేలకు కేటాయింపుల్లో 27 శాతం కోత పెట్టింది. దీంతో రైల్వేల ఆదాయం కోసం ఆ శాఖ స్వంత ప్రయత్నాలు చేసుకోవల్సి ఉంటుంది. ఆసియాలోనే అతి పెద్ద నెట్‌వర్క్ కలిగిన భారతీయ రైల్వేలకు ప్రత్యేక బడ్జెట్ ఉన్నప్పుడు కూడా నిధుల కొరత ఉండేది. ఇప్పుడు కేంద్ర బడ్జెట్‌లో భాగమైంది కనుక, మిగిలిన శాఖలకు మాదిరిగానే రైల్వే శాఖకు ఆర్థిక మంత్రి కేటాయింపులు చేస్తారు. ఆ కేటాయింపులేవో ఎప్పటి మాదిరిగానే ఉంటే ఇబ్బంది లేదు. కానీ, 27 శాతం కోత విధించడం అంటే, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రైల్వేలు నిధుల కోసం వెంపర్లాడక తప్పదు. వచ్చే ఆర్థిక సంవత్సరం లో రైల్వేల వ్యయం 1.31 ట్రిలియన్ రూపాయిలు ఉండవచ్చని అంచనా. అయితే, ఆర్థిక మంత్రి రైల్వేలకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో 550 బిలియన్లు మాత్రమే కేటాయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రైల్వేల కేటాయింపుల్లో 27 శాతం కోత విధించింది. 2017-18 సంవత్సరం సవరించినకేటాయింపులు సవరించిన అంచనాల కన్నా 13 శాతం తక్కువ. అంటే, 2016-17కు సవరించిన అంచనాలు 463 బిలియన్లు. 2017-18 సంవత్సరంలో సవరించిన కేటాయింపులు 463.5 బిలియన్లు. సవరించినఅంచనాల్లో 400 బిలియన్లు మాత్రమే రైల్వేలకు లభిస్తాయి. రైల్వేలు ఇప్పుడు భద్రతపైనా, పునరుద్దరణ కార్యక్రమాలపైనా ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించాయి. అయితే కేటాయింపుల్లో కోత ప్రభావం భద్రతపై ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. భద్రతా పరమైన ప్రాజెక్టులకు చాలినన్ని నిధులు ఉన్నాయని వారు తెలిపారు. బడ్జెట్ మద్దతు అనేది రైల్వేలకు వచ్చే ఆదాయంలో ఒక భాగం మాత్రమేననీ, లోటును విస్తరించిన బడ్జెటరీ వనరుల ద్వారా భర్తీ చేసుకోవడం జరుగుతుందని అధికారులు వివరించారు. ఇందుకోసం రైల్వేలు అన్ని ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తున్నాయి. ఆస్తుల విక్రయం, మార్కెట్ నుంచి రుణాల సేకరణ, ఆర్థిక సంస్థల నుంచి రుణాల సేకరణ మొదలైన ప్రత్యామ్నాయాలను రైల్వే శాఖ పరిశీలిస్తోంది. 2018-19 సంవత్సరానికి రైల్వేలకు 1.46 ట్రిలియన్‌ల ప్రణాళికను రూపొందించారు. బడ్జెట్ మద్దతు ద్వారా 600 బిలియన్‌లు రావచ్చు. రైల్వేమంత్రి పియూష్ గోయెల్ విలేఖరులతో మాట్లాడుతూ, బడ్జెట్ మద్దతు లేకపోయినా, రైల్వేలను నడిపేందుకు దారులు అన్వేషిస్తున్నామని చెప్పారు.

బడ్జెట్ మద్దతుపై అతిగా ఆధారపడే ధోరణి తగ్గించాలన్నది అభిమతం. అందువల్ల కేటాయింపుల్లో మరింత కోత విధించే అవకాశం లేకపోలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల వివరాల్లోకి వెళ్తే.... 2014-15లో 31.6బిలియన్లు, 2015-16లో 416 బిలియన్లు, 2016-17లో 450 బిలియన్లు బడ్జెట్ మద్దతుగా లభించాయి. 2014-15 నుంచి ఐదేళ్ళలో రైల్వేలు పెట్టుబడు ప్రణాళిక 8.56 ట్రిలియన్లు కాగా, 4ట్రిలియన్ రూపాయిల పెట్టుబడులు పెట్టడం జరిగింది. 2009-14 మధ్య కాలంలో సగటు మూలధన పెట్టుబడులు 459 బిలియన్లు. ఈ మొత్తాన్ని 2017-18లో 1.31 ట్రిలియన్లకు పెంచగలగామని అధికారి ఒకరు చెప్పారు.

భద్రతకు ప్రాధాన్యం: రైల్వేలు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా, సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పుల కోసం పెట్టుబడులు పెంచవచ్చు. ఇందుకోసం 600 బిలియన్లు ఖర్చుకాగలదని అంచనా. 8వేల కిలోమీటర్ల మేర పాతమార్గం స్థానే కొత్త మార్గాలను వేయాల్సి ఉంటుంది. భద్రతకు అవసరమైన నిధులను అంతర్గతంగా సమకూర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఆ అధికారి తెలిపారు.

అసంఘటిత కార్మికులకు భద్రతా చట్టం

● పార్లమెంట్‌లో చట్టం తేవడానికి కృషి



ధన్‌బాద్: దేశంలో సంఘటిత రంగ కార్మికుల పరిధిలోకి అసంఘటిత రంగ కార్మికులను తీసుకుని రావడానికి వచ్చే పార్లమెంటు సమావేశాల్లో సమగ్ర శాసనాన్ని ప్రవేశపెడతామని కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ కుమార్ గాంగ్వార్ వెల్లడించారు.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా,అవసరమైన శాసనాలను నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకుని వస్తున్నదని ఆయన చెప్పారు.కార్మిక రంగానికి సంబంధించి 40 చట్టాలు న్నాయనీ, ఇవన్నీ కాల దోషం పట్టినవేనని ఆయన అన్నారు. అందువల్ల ప్రస్తుత అవసరాలకు అను గుణంగా చట్టాలను తీసుకుని వచ్చేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని ఆయన అన్నారు.ఈ నలభై చట్టాలను నాలుగు కోడ్‌లుగా తయారు చేశామనీ, వేతనాల చట్టం, పరి శ్రమ- కార్మికుల సంబందాలు, కార్మికుల సామాజిక భద్రత,కార్మికుల స్థితిగతులుపై ఈకోడ్‌లను తయారు చేశామని చెప్పారు. గనుల భద్రతపై డైరక్టరేట్ జనరల్ 117వ వ్యవస్థాపక దినం సందర్భగా పార్లమెంటునుద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగంలో ఈ విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. సంఘటిత రంగంలో 6కోట్ల మంది,అసంఘటిత రంగంలో 40 కోట్ల మంది కార్మికులు ఉన్నారని గాంగ్వార్ తెలి పారు.అసం ఘటిత రంగంలో కార్మికుల భద్ర త,సంక్షే మం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఆయన ప్రకటిం చారు.దేశంలో ఏడువేలు పైగా గనులున్నాయనీ, కోట్లాది మంది ఈ గనుల్లో పని చేస్తున్నారని ఆయన చెప్పారు. అసంఘటిత రంగంలో కార్మికుల సమస్యల పట్ల ప్రభు త్వానికి సంపూర్ణమైన అవగాహన ఉందనీ, కార్మి కుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్‌కి చెందిన భూగర్భ గనులను మంత్రి గాంగ్వార్ పరిశీలించారు.గనుల్లో ప్రమాదాలను అరికట్టడంలో డైరక్టర్ జనరల్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను ఆయన అభినందించారు.ధన్‌బాద్, చంద్రాపూర్ భూగర్భ రైలుమార్గాన్ని పునరుద్ధరించాలన్న అభ్యర్థనలను మంత్రి తోసిపుచ్చారు. ఈ అంశంపై ప్రధానమంత్రి వ్యక్తిగత కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ పరిశీలన జరుపుతున్న దృష్ట్యా,దీనిపై తాను ఆదేశాలు ఇవ్వలేనని ఖరాకండీగా చెప్పారు.

టీవీఎస్ బ్రాండ్ ప్రొటెక్షన్ ప్రోగ్రాం ప్రారంభం

హైదరాబాద్: టీవీఎస్ మోటార్ కంపెనీ నకిలీ ఉత్పత్తులను నిరోధించడానికి బ్రాండ్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. నకిలీ ఉత్పత్తులతో తమ బ్రాండ్ వాహనాలు పాడయిపోవడమేకాక, తమ కంపెనీకి చెడ్డపేరు వస్తున్నదని కంపెనీ అధికారి మీడియాకు చెప్పారు. ఇందుకోసం కంపెనీ 4000కు పైగా టచ్ పాయింట్లను నెలకొల్పి వినియోగదారుడికి అసలైన విడిభాగాలను అందుబాటులోకి తేనుంది.

ఫుడ్ అవార్డ్స్‌కు నామినేషన్ల ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్న హోటళ్ళకు ఫుడ్ అవార్డ్స్ - 2018కి పోటీ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బిజినెస్ టు బిజినెస్, బిజినెస్ టు కన్స్యూమర్ పోర్టల్ ట్రేడ్ హైదరాబాద్ డాట్ కాం ఈ అవార్డ్స్‌కు నామినేషన్లను ఆహ్వానిస్తోంది. రాష్ట్రంలోని అన్ని పట్టణాల నుంచి రెస్టారెంట్లు, హోటళ్ళు ఈ పోటీలో పాల్గొనేందుకు నామినేషన్లు పంపించుకోవచ్చునని ట్రేడ్ హైదరాబాద్ డాట్ కామ్ సీఈవో బి.వెంకట్ తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్న హోటళ్ళు, రెస్టారెంట్లను ప్రోత్సహించేందుకు ఈ అవార్డులను నెలకొల్పిందని చెప్పారు. వచ్చేనెల 24వ తేదీలోగా నామినేషన్లు పంపించాలని కోరారు.

గ్రామీణ ఉపాధిలో సీఎస్‌సీలే కీలకం

● కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకా శాలను పెంచడానికి సాధారణ సేవలకేంద్రా లు(కామన్ ఆపరే టింగ్ సర్వీసెస్ సెం టర్స్-సీఎస్‌సీఎస్) ఉపకరిస్తాయని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ప్రసాద్ శనివారం దేశ రాజధానిలో పలు రాష్ట్రాలకు చెందిన 2000 మంది మహిళా ఎంటర్‌ప్రీన్యూర్ల నుద్దేశించి ప్రసంగించారు. మహిళా ఆరోగ్యం- పరిశుభ్రతకు సంబంధించి 'స్త్రీ స్వాభిమాన్' పేర సేవా కేంద్రం ఏర్పాటును మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ఎంటర్‌ప్రీన్యూర్లు(వీఎల్‌ఈ) చేపట్టిన ఆధార్, బ్యాంకింగ్, బీమా సేవా కేంద్రాల తోడ్పాటును ప్రశంసించారు. ఈ కేంద్రాలు గ్రామీణ భారతంలో డిజిటల్ అక్షరాస్యతకు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. స్త్రీ స్వాభిమాన్ కేంద్రాలు మహిళలకు, కౌమారదశలో ఉన్న బాలికలకు తక్కువ ధరల్లో సానిటరీ ఉత్పత్తులు అందిస్తున్నాయి. స్త్రీస్వాభిమాన్ ప్రాజెక్టులో భాగంగా దేశవ్యాప్తంగా సానిటరీ నాప్కిన్ల ఉత్పత్తికోసం మహిళా ఎంటర్‌ప్రీన్యూర్ల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ తయారీ యూనిట్లు సీఎస్‌సీల్లో ఏర్పాటు చేస్తున్నారు. వాటిని మహిళలే తయారుచేసి వారే మార్కెటింగ్ చేసుకుంటారు. దేశవ్యాప్తంగా 46,500 పైగా మహిళలు వీఎల్‌ఈలుగా పనిచేస్తూ ఈ సేవాకేంద్రాలను నడుపుతున్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో మహిళలు కీలక భూమిక నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఈవెంట్‌లో యు.పి, రాజస్థాన్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్రలకు చెందిన మహిళ ఎంటర్‌ప్రీన్యూర్లు పాల్గొన్నారు. మహిళా ఆరోగ్య భద్రతకు సంబంధించి ఏర్పాటు చేసే ఒక్కో కేంద్రం 8 నుంచి 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తుందని మంత్రి తెలిపారు.

వందశాతం ఎఫ్‌డీఐల కోసం ఐడియా దరఖాస్తు



న్యూఢిల్లీ: టెలికాం ఆపరేటర్ ఐడియా సెల్యూలర్ తన కంపెనీలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెట్టేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ పాలసీ అండ్ ప్రమోషన్(డీఐపీపీ)కు దరఖాస్తును సమర్పించింది. ఇన్వెస్టర్ ప్రజెంటేషన్ వివరాలను కూడా కంపెనీ తన దరఖాస్తుతో జతచేసింది. భారత్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న ఎఫ్‌డీఐ పరిమితి నిబంధనల మేరకు ఐడియా కంపెనీలో విదేశీ పెట్టుబడులు 27శాతం ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం టెలికాం రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐలను అనుమతించింది. ఇందులో 49 శాతం పెట్టుబడులు ఆటోమేటిక్ రూట్‌లో చేయవచ్చు. ఈ పరిమితిని మించిన పెట్టుబడులకు భద్రతా దృష్ట్యా ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. కాగా ఐడియా ఇప్పటికే బ్రిటిష్ టెలికాం మేజర్ కంపెనీ వోడాఫోన్ ఇండియా విభాగాన్ని విలీనం చేసుకొనే ప్రక్రియను కొనసాగిస్తోంది. టెలికాం నియంత్రణ బోర్డు ట్రాయ్ తాజాగా విడుదల చేసిన వివరాల ప్రకారం ఐడియా, వోడాఫోన్ సంయుక్తంగా 40కోట్లకు పైగా మొబైల్ సబ్‌స్క్రైబర్లను కలిగివున్నాయి. భారత టెలికాం రంగంలో ఇది అతిపెద్ద వాటాగా గుర్తింపు పొందింది. ఐడియా-వోడాఫోన్ విలీనం తర్వాత ఏర్పడే కొత్త కంపెనీ అత్యధిక రెవెన్యూ వాటా 37.5శాతం, రేడియో తరంగాలలో 1,850 మెగా హెర్ట్జ్‌తో రెండో అతిపెద్ద స్పెక్ట్రం హోల్డర్‌గా మారుతుందని ఐడియా తెలిపింది. కాగా, భారతీ ఎయిర్‌టెల్ 1,976 మెగా హెర్ట్జ్‌తో తొలి స్థానంలో ఉండనుంది. రిలయన్స్ జియో పలు చిన్న టెలికాం ఆపరేటర్లను త్వరలో విలీనం చేసుకొని 1,480 మెగా హెర్ట్జ్‌తో మూడో స్థానం పొందనుంది. ఐడియా, వోడాఫోన్ విలీనం తర్వాత, వోడాఫోన్ 47.5శాతం వాటాను కలిగివుంటుందని.. మిగతా వాటా ఐడియా, దాని ప్రమోటర్ ఆధిత్య బిర్లా గ్రూప్ కలిగివుండనుంది.

ఆదాయ పన్ను సమస్యలపై 29న చర్చా గోష్ఠి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఇతర అన్ని రకాల పన్ను చెల్లింపుదారులు ఆదాయ పన్ను చెల్లింపులో ఎదురవుతున్న సమస్యల నివృత్తి, చెల్లింపులలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, అధిక పన్నులు, ముందస్తు పన్నులు తదితర అన్ని రకాల పన్నుల సమస్యల నివృత్తి కోసం ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎస్‌పి చౌదరితో ముఖాముఖి చర్చాగోష్టిని నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌ట్యాప్సీ సహాయ సంచాలకురాలు ఎస్‌వీఎస్ లక్ష్మి తెలిపారు. 29న జరిగే ఈ సదస్సులో రెండు రాష్ట్రాలకు చెం దిన పన్నుల విభాగం ఉన్నతాధికారులు పాల్గొంటారు. అలాగే ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యక్షులు అరుణ్ లుహారుకా, ప్రత్యక్ష పన్నుల కమిటీ ఛైర్మన్ అభయ్ కుమార్ జైన్, కో ఛైర్మన్ రాందేవ్ భుట్టాడ తదితరులు పాల్గొనున్నారు.

అసోంలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు

గువాహతి: ఫిబ్రవరి 3,4 తేదీల్లో అసోంలో జరుగనున్న అడ్వాన్టేజ్ అస్సాం గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు కార్పొరేట్ దిగ్గజాలైన రతన్ టాటా, ముకేశ్ అం బానీ, దిలీప్ సాంఘ్వీలతో పాటు ప్రపంచ దేశాల నుంచి 4,800 మంది ప్రతి నిధులు హాజరు కాను న్నారు. వివ రాలను అసోం వాణి జ్య శాఖ మం త్రి సీహెచ్ పటొవారీ తెలిపారు.

అడ్మిషన్లు తీసుకుంటే
చర్యలు తప్పవు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లను ఇప్పుడే తీసుకోవద్దని తెలంగాణ ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను తాము జారీ చేస్తామని, అది వచ్చే వరకు ఏ కాలేజీ వారు ప్రవేశాలు తీసుకోవద్దని బోర్డు కార్యదర్శి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రవేశాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరు ఇప్పుడే ప్రవేశాల కోసం కాలేజీలను సంప్రదించవద్దని, 2018-19 సంవత్సరానికి సంబంధించిన అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల వివరాలను ఏప్రిల్‌లో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. అదేవిధంగా కాలేజీలు అనుబంధంగా హాస్టల్స్‌ను కూడా కొనసాగిస్తున్నవి ఉన్నాయని వాటిలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని, ఈ ఏడాది నుంచి వాటికి కూడా అనుబంధ గుర్తింపును తాము ఇవ్వనున్నామని వాటి వివరాలను ఏప్రిల్‌లో ఇస్తామని అప్పటి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్లను తీసుకోవద్దని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి:టి ఆక్టా

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్(టి- ఆక్టా) డిమాండ్ చేసింది. శనివారం టి- ఆక్టా అత్యవసర సమావేశం అసోసియేషన్ అధ్యక్షులు ఎం రామేశ్వరరావు అధ్యక్షత ఉస్మానియా యూనివర్సిటీలో జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కుమార్ లోథ్, జి వెంకటేశ్వర్లు, డాక్టర్ టి వెంకటేశ్వర్లు, చిట్యాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు. 2017లో ఉద్యోగ భద్రత కోసం నిరవధిక సమ్మె చేపట్టిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి బేసిక్, డిఏ ఇస్తూ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వేతన పెంపుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పి 6 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఉత్తర్వులు రాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇచ్చి పెరిగిన వేతనాలను అమలు చేయాలని లేకపోతే ఉద్యోగ భద్రత, జీతాల పెంపుకోసం ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

భారతీయ నదులపై మరింత
అధ్యయనం జరగాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారతీయ నదులపై మరింత అధ్యయనం జరగాలని, పరిశోధనలు జరగాలని ఇతిహాస సంకలన సమితి తెలంగాణ రాష్ట్రశాఖ నిర్వహించిన జాతీయ సెమినార్‌లో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సెమినార్‌ను జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ప్రారంభించగా,జాతీయ సంకలన యోజన అధ్యక్షులు ప్రొఫెసర్ సతీష్ చందర్ మిట్టల్, ఐసిహెచ్ఆర్ మెంబర్ సెక్రటరీ రజనీష్ శుక్లా, సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ సురభివాణి దేవి, సెమినార్ కన్వీనర్ వి.కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.వీరేందర్ తదితరులు పాల్గొన్నారు. సెమినార్‌లో ప్రధానంగా సరస్వతి రీసెర్చ్ సొసైటీ డైరెక్టర్ ఎస్.కళ్యాణరమణ్ ప్రసంగించారు. సరస్వతి నదిపై మరిన్ని పరిశోధనలు జరగాలని, విస్తృతమైన చర్చ జరగాలన్నదే సదస్సు ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఒక్క సరస్వతి నదే కాక.. భారతీయ నదులన్నింటిపైనా పరిశోధనలు పెరగాలన్నారు.

జడ్జిల నియామకాల్లో
రిజర్వేషన్లు అమలు చేయాలి

• తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్ డిమాండ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: న్యాయమూర్తుల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ అడ్వకేట్స్ యునైటెడ్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని న్యాయ వాదులకు వృత్తి భరోసా కల్పించాలని అడ్వకేట్స్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన తెలంగాణ అడ్వకేట్స్ యునైటెడ్ ఫెడరేషన్ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫెడరేషన్ సమావేశానికి హైకోర్టు అడ్వకేట్ గుండ్రాతి శారదాగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బాలరాజు, శరత్, మల్లిఖార్జున్, సునీల్, కవిత, శైలజ, గుజ్జ కృష్ణ, దేవరాజ్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి హైకోర్టు విభజన జరిగే వరకు ఎలాంటి న్యాయసంబంధ పదవులను భర్తీ చేయరాదని ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తరువాత కూడా బీసీలకు న్యాయసంబంధ పదవుల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సును 29న నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ తెలిపారు.

నెరవేరని 3-ఆర్ లక్ష్యం

● పూర్తిస్థాయిలో దృష్టి పెట్టని ఉపాధ్యాయులు ● కేవలం 20శాతం విద్యార్థుల్లోనే మెరుగుదల ● స్పందించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ సిఫారసులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస విద్యా సామర్థ్యాలు పెంచడం కోసం పాఠశాల విద్యా శాఖ చేపట్టిన 3 ఆర్ కార్యక్రమం అనుకున్న విధంగా లక్ష్యాన్ని సాధించలేకపోయింది. చదవడం, రాయడం, అర్థమెటిక్‌పై చేపట్టిన3ఆర్ పథకాన్ని 60 రోజులపాటు నిర్వహించారు. డిసెంబర్‌లో ఆయా విద్యార్థులకు పరీక్షలను సైతం నిర్వహించారు. త్రి ఆర్ కార్యక్రమం ఎలా అమలు జరిగిందనేదానిపై పాఠశాల విద్య సంచాలకులు సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నివేదికను పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి సమర్పించింది.

60 రోజులపాటు కొనసాగిన కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 3 నుంచి 9 వ తరగతి వారికి తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో చదవడం, రాయడం సరిగా రావడం లేదని, అదేవిధంగా గణితంలో లెక్కలను అర్థం చేసుకొని వాటిని సాధించడం(అర్థమెటిక్)లో అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యా శాఖ 3ఆర్‌ను ప్రారంభించింది. 3ఆర్‌ను 60 రోజులపాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఆగస్టులో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని డిసెంబర్‌లో ముగించారు. మొత్తంగా 60 రోజులపాటు నిర్వహించారు. విద్యార్థులకు రాయడం, చదవడం ప్రత్యేకంగా నేర్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని ముగించి డిసెంబర్‌లో ఆయా విద్యార్థులకు పరీక్షలను సైతం నిర్వహించారు. 3ఆర్‌ను అమలు చేయడం కోసం ప్రత్యేకంగా రాష్ట్ర వ్యాప్తంగా టీమ్‌లను ఏర్పాటు చేశారు. అందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులే ఉన్నారు. వారు జిల్లాల్లో కొన్ని పాఠశాలలకు వెళ్లి 3 ఆర్ ఎలా అమలు జరుగుతుందో పర్యవేక్షించారు.

3ఆర్‌పై తనిఖీలు

3ఆర్ కార్యక్రమం ఎలా జరిగిదనే దానిపై తనిఖీలు చేయడానికి పాఠశాల విద్యా శాఖ ప్రత్యేకంగా రీసోర్స్ పర్సన్లను నియమించింది. రీసోర్స్ పర్సన్లు జనవరి 3 నుంచి 9 వరకు 3ఆర్ అమలు జరిగిన ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. వాటిలో చాలా వరకు ప్రైమరీ పాఠశాలల్లో 3ఆర్ సక్రమంగా అమలు జరగలేదని తేలింది. 3ఆర్‌ను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అమలు చేయడంలో విఫలమయ్యారని వారి పరిశీలనలో తేలింది. కొందరు ఉపాధ్యాయులు అయితే మొదటి దశలో 3ఆర్‌ను బాగానే అమలు చేసినప్పటికీ రెండో దశలో వాటి గురించి పట్టించుకోలేదని తేలింది. దీంతో ఆయా విద్యార్థులు సైతం పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఆయా విద్యార్థుల్లో అభివృద్ధి కనిపించ లేదు. ఇటువంటి పాఠశాలలే ఎక్కువగా ఉన్నట్టు రీసోర్స్ పర్సన్ల పరిశీలనలో బహిర్గతం అయింది. తెలుగులో రాయడం చాలా మందికి రావడం లేదు, ఒత్తులు ఎక్కువగాఉన్న తెలుగు పదాలను స్పష్టంగా చదవడం కూడా రావడం లేదని రీసోర్స్ పర్సన్ల పరిశీలనలో తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1800 స్కూల్స్‌కి పైగా పరిశీలన చేశారు.

20 శాతం మాత్రమే మెరుగుదల

ప్రభుత్వం చేపట్టిన 3ఆర్ పథకం మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 20 శాతం మంది విద్యార్థుల్లోనే మెరుగుదల కనిపించినట్టు రీసోర్స్ పర్సన్ల పరిశీలనలో తేలింది. దాదాపు 80 శాతం మంది పిల్లల్లో ఎటువంటి మార్పు కనిపించలేదు. అంటే వారు మొదట్లో ఎలా ఉన్నారో చివర్లో కూడా అలాగే ఉన్నారు. 3ఆర్‌లో భాగంగా తెలుగులో సరళ పదాలు, ఒత్తులు నేర్చుకోవడం వరకు బాగానే ఉంటుంది. ఆ తరువాత గుణింతాల దగ్గర ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఇంగ్లీష్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇక గణితంలో అయితే కూడికలు, తీసివేతల వరకు బాగానే నేర్చుకుంటున్నారు. గుణకారం, భాగహారం నేర్చుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. వీటిలో పూర్తిస్థాయిలో విద్యార్థుల్లో మార్పు రావడం లేదు.

స్పందించని టీచర్లపై చర్యలకు సిఫారసులు

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన 3ఆర్‌పై సరిగా స్పందించని ఉపాధ్యాయులపై రీసోర్స్ పర్సన్లు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారులకు చర్యలకై సిఫారసులు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులపై చర్యలకు రీసోర్స్ పర్సన్లు సిఫారసులు చేయడంతో ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. పాఠశాల విద్యా శాఖ చేపట్టిన 3ఆర్ కార్యక్రమంపై నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

ఉపాధ్యాయులకు భారం ...

3ఆర్ కార్యక్రమం మంచిదైనప్పటికీ దానిని అమలు చేయడం ఉపాధ్యాయులకు భారంగా మారుతోంది. ఒక పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉంటే వారికి తెలుగు బోధించే ఉపాధ్యాయుడు ఒక్కడే ఉంటున్నాడు. అటువంటి సమయంలో విద్యార్థులకు డిక్టేషన్ చెప్పిన తరువాత దానిని సరిచేయడానికి సమయం సరిపోవడం లేదు.

అలా కాకుండా ఒక భాషా ఉపాధ్యాయుడికి ఎక్కువ మంది కాకుండా 30 నుంచి 40 మంది విద్యార్థులు ఉంటే దానిని సక్రమంగా అమలు చేయడానికి వీలవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాల విద్యా శాఖ అధికారులు దీనిపై ఆలోచించాలని కోరుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే వారిని పరిశీలించడం భారంగా మారుతోందని అంటున్నారు.

న్యాయవ్యవస్థ ధర్మ రథాన్ని కాపాడాలి

• కక్షిదారుని విశ్వాసాన్ని కోల్పోకూడదు
• గురుతర బాధ్యతతో న్యాయవాదులు పనిచేయాలి
• కోర్టు బహిష్కరణలు న్యాయవాది వృత్తికి సరికాదు
• హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి. నాగార్జునరెడ్డి



విశాఖపట్నం(నర్సీపట్నం), ప్రభన్యూస్: న్యాయవాదులు, న్యాయమూర్తులు ధర్మరథానికి రెండు చక్రాలువంటి వారని ధర్మ సంస్థాపన కోసం ఏర్పడ్డ న్యాయస్థానాలలో నిష్పక్షికంగా పవిత్రతను కాపాడాలని రెండు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి. నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో నూతన న్యాయస్థాన భవన సముదాయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి యుత జీవనాన్ని ప్రజలు గడిపేందుకు రూపకల్పన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం న్యాయ వ్యవస్థ సృష్టిస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. స్వతంత్ర ప్రతి పత్తి కలిగిన న్యాయస్థానాలు విఫలం కాకుండా న్యాయంకోసం వచ్చిన కక్షి దారుని విశ్వాసం చవి చూడాలన్నారు. న్యాయవాదులు తమ గురుతర బాధ్యతనెరిగి న్యాయ వ్యవస్థ పట్ల నిష్పాక్షికంగా వుండాలన్నారు. సమాజం పై అవగాహన సామాజిక స్పృహ కలిగిన వారు న్యాయవాదులని అటువంటి వారు విధులు బహిష్కరించడం పట్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తద్వారా న్యాయ వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోయే ప్రమాదం కూడా వుందన్నారు. న్యాయ వాదులు చర్చలు ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

కక్షి దారులు న్యాయ వ్యవస్థకు దేవునితో సమానమని స్పష్టం చేశారు. భారత ప్రజా స్వామ్యంలో స్వాతంత్ర్య సమరయోధులు మేధావులు ఈ న్యాయ వ్యవస్థ నుండే అధికంగా పుట్టుకు వచ్చారన్నారు.గతంలో15, 20 సంవత్సరాలుపై బడి న్యాయస్థానాలలో కేసులు పెండింగ్ వుండేవని ఇటీవల 5 సంవత్సరాలకు పైబడి ఏకేసు వుండకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు దీర్ఘ కాలిక కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రత్యేక చర్యలులో భాగంగా 11 నెలలులో ఈ దీర్ఘ కాలిక కేసులు సంఖ్య 12శాతం నుండి 6 శాతానికి తగ్గడం పట్ల హర్షం వెల్లబుచ్చుతూ హైకోర్టు తరపున అభినందనలు తెలిపారు. కేసులు పరిష్కారం జాప్యం జరగడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అనగా పోలీసులు రాజకీయనాయకుల తదితర వర్గాలను ఆశ్రయించే పరిస్థితి ఎదురవుతుందన్నారు.శాసన వ్యవస్థ ప్రభుత్వ అధికారులు హద్దు మీరితే ప్రతీ పౌరుడు న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చుని అలాగే హక్కును కోరే ప్రతీ పౌరుడు బాధ్యతలను స్వీకరించి మెలగాలన్నారు. రాజ్యాంగంలో శాసన కార్యనిర్వాహక న్యాయవ్యవస్థలు భారత ప్రజా స్వామ్యానికి మూల స్థంబాలుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి పి.వి జ్యోతిర్మయి నర్సీపట్నంలో కోర్టు భవనం ప్రారంభించడం ఎంతో సంతోషంగా వుందన్నారు. జస్టిస్ నాగార్జున రెడ్డి తమ వృత్తి పట్ల నిబ్దత కలిగిన గొప్ప మేధావని ఆచరిస్తూ చెప్పే మాటకు ఆదరణ ఎక్కువన్నది ఆర్యోక్తి అన్న విధంగా ఆయన ధర్మం న్యాయం పట్ల ఉట్టి పడేలా వుంటారని ఆమె వెల్లడించారు. దీనికి ఉదాహరణగా సత్యంబాబు కేసు పరిష్కారంలో నిరపరాధిగా ప్రకటించడమే కాకుండా నష్టపరిహారం చెల్లించమని ఇచ్చిన తీర్పు అలాగే రెవెన్యూ దస్త్రాలు సడలికరణ చేయమని ఇచ్చిన తీర్పు ఆదర్శ ప్రాయమని అన్నారు.

రైతుల ఆత్మహత్యకు టీఆర్ఎస్ కారణం

● గ్రామాల్లోకి టీఆర్ఎస్ నాయకులు వస్తే తరిమి కొట్టండి: రేవంత్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాక్షస పాలనను కొనసాగిస్తూ, 3,400 మంది రైతుల ఆత్మహత్యకు కారణమయ్యారని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంవత్సర కాలంగా మూతపడ్డ నిజాం షుగర్ ఫ్యాక్టరీలను ప్రారంభించాలని కోరుతూ చేస్తున్న దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. మెట్‌పల్లిలో రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం సుమారు 3వేల మందితో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి సమావేశానికి భారీ ర్యాలీగా తరలివెళ్ళారు. సమావేశంలో ఆయన మాట్లాడు తూ గత సంవత్సర కాలంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తు రైతుల ఆవేదనలను ప్రభుత్వాలకు తెలియజేసేందుకు కొమరెడ్డి రాములు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. సమైఖ్య పాలనలో నిరంత రంగా నడిచిన తెలంగాణ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసివేశారన్నారు. ప్రైవేట్ భాగస్వా మ్యంతో నడుస్తున్న చక్కెర ఫ్యాక్టరీలను అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ప్రభుత్వం పరం చేసుకుని ప్రారంభిస్తామని అన్న కేసీఆర్, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 3,400 మంది రైతులు పిట్టల్లా రాలి పోయినా ఏ ఒక్క రైతు కుటుంబాన్ని ముఖ్యమంత్రి పరామర్శించికపోవడం అతని అహంకారానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 58లక్షల రైతు కుటుంబాలు మద్దతు ధర లేక, పండించిన పంటలు సారైన దిగుబడి రాక ఆత్మహత్యలు చేసుకుంటున్న ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రాన్ని దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిద్దిమని చెప్పు కుంటున్న ముఖ్యమంత్రి ఆత్మహత్యల్లో సైతం రాష్ట్రాన్ని ముందు వరసలో ఉంచరన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభించే దాక టిఆర్ఎస్ నాయకులను గ్రామాల్లో రాకుడాదని తీర్మణాలు చేయాలని సూచించారు. ఎంపీ కవిత, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావులు గ్రామాలకు వస్తే చెప్పులతో, రాళ్ళతో కొట్టాలన్నారు. రైతుల దాయదక్ష్యాన్యాలతో అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను పట్టించుకోకుండా తీరుగుతున్నారన్నారు. ఎలక్షన్లు తొందరలో రానున్న నేపథ్యంలో టిఆర్ఎస్ తోడెళ్ళ గుంపు గ్రామాల్లోకి ఓట్ల కొరకు మళ్ళి వస్తారని, వారిని తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. తమ నివసించడానికి వేయి కోట్లతో విలాసవంతమైన భవనం, వంద కోట్లతో కొత్త కార్లు కొనుగోలు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన కెసిఆర్ వేలాది మంది రైతులు, కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న షుగర్ ఫ్యాక్టరీలను ప్రారంభించడానికి ఎందుకు వెనుకంజ వేస్తున్నరని ప్రశ్నించారు. తెలంగాణలో కెసిఆర్ కుటంబం రాబందువుల ప్రజల రక్తన్ని పిల్చుతూ పాలన సాగిస్తున్నరన్నారు. రైతుల కళ్ళల్లో సంతోషాన్ని చూసేవరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటలు చేస్తామన్నారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి రాములు, పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే విజయరామ రావు, సత్యనారాయణ, హరికిరణ్ నర్సరెడ్డి, రాజారాం యాదవ్, నాయకులు కొమిరెడ్డి విజయ్ అజాద్, కొమిరెడ్డి కరమ్, ఎండీ షాకీర్, పుప్పాల లింబద్రి, ఎర్రోల్ల హన్మండ్లు తోట ప్రేమ్, ఆకుల ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు.



బీసీలను మోసం చేస్తున్న కేసీఆర్

• రాజ్యాధికారం కోసం బీజేపీతో కలిసి రావాలి: రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



నల్గొండ(టౌన్), ప్రభ న్యూస్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీలకు చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కడంతో పాటు బీసీలను మోసం చేస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్రఅధక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీల సంగ్రామం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అట్టి కులాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో బీసీల సమస్యల అసెంబ్లీ సమావేశంలో చర్చించి బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి రాత పూర్వక నివేధికలను అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓట్ల రాజకీయాల కోసం ముస్లిం బీసీ మైనార్టీల రిజర్వేషన్‌ల పెంపు తెరమీదకు తీసుకువచ్చిందన్నారు. బీసీలకు న్యాయం జరిగేంతవరకు బీజేపీ చేపట్టిన పోరాటంలో బీసీలు కలసిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా పరిపాలన కొనసాగించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు సామాజిక న్యాయం గురించి మాట్లాడలేదన్నారు. నేడు టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా బీసీలకు సముచిత న్యాయం కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాటం నర్సింహాయాదవ్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు పీఎన్ చారీ, రామోజీ శన్మఖచారీ, నూకల నర్సింహారెడ్డి, పల్లెబోయిన శ్యాంసుందర్, ఓరుగంటి రాములు, వీరేల్లి చంద్రశేఖర్, సాంబయ్య, బండారు ప్రసాద్, నర్సింహ్మా, లక్ష్మాచారీ, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీసీ సంఘం నాయకులు సత్యానారయణ కాసోజు విశ్వనాథం లక్ష్మీనారాయణ, రాములు తదితరులు లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు.

బాసర ఆలయ ఘటనలపై
నిజనిర్ధారణ కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ వ్యవహారా లపై నిజ నిర్దారణకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. గత రొండు రోజుల క్రితం వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన దేవాదాయ శాఖ ముగ్గురు అధికారులతో కమిటీని నియమించింది. ఎండోమెంట్ జాయింట్ కమిషనర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, సూపరింటెండెంట్ ఇంజనీర్‌లతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తక్షణమే ఆలయాన్ని సందర్శించి, వాస్తవాలను పరిశీలించాలని ఆదేశించింది. ఆరోపణలను ప్రత్యక్షంగా పరిశీలించి వారంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించింది.

29న పల్లె పల్లెకు టీడీపీపై సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశంపార్టీ తెలంగాణ నిర్వహిస్తున్న పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమంపై సోమవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమీ క్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, త్రిసభ్య కమిటీ, పార్టీ పరిశీల కులు పాల్గొనాల్సిందిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. బుచ్చిలింగం కోరారు.

పిల్లల మరణాలు, విక్రయాలపై
హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల శిశు గృహాల్లో ఉన్న 0-6 ఏళ్ల పిల్లల మరణాలు, విక్రయాలపై సమగ్ర దర్యాప్తు జరిపేలా, బాధ్యులైన ఉద్యోగులు/అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు దాఖలు చేశారు. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఈ ప్రజాహితవ్యాజ్యం పై మంగళవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది.

విభజన హామీలపై
ఢిల్లీ వీధుల్లో ధర్నా చేస్తాం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విభజన హామీలపై దేశ రాజధానిలో ధర్నా చేస్తామని తెలుగు శక్తి సంస్థ ప్రకటించింది. ఆ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు బీవీ రామ్ ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని బీజేపీ మంటగలుపుతోందని దుయ్యబట్టారు. ఫిబ్రవరి 1న కేంద్రం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక లోటును భర్తీ చేయడం సహా ప్రత్యేక కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా తాము ముందు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి డిమాండ్ చేస్తామని అన్నారు. ఆయన స్పందించకుంటే మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలో 500 మందితో పార్లమెంటు సమీపంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ భిక్ష వల్లనే బీజేపీకి ఏపీలో 2 ఎంపీ సీట్లు, 4 అసెంబ్లీ స్థానాలు దక్కాయన్న విషయం మర్చిపోరాదని వ్యాఖ్యానించారు.

తెలుగు రాష్ట్రాలకు అన్యాయం
అవార్డుల్లేవు.. శకటాల్లేవు

• ఏపీ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవ ఉత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు సరైన గుర్తింపు రాలేదని తెలుగుదేశంపార్టీ శాసనమండలి సభ్యుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఆరోపించారు. గణతంత్ర దినోత్సవాల్లో ప్రదర్శించిన శకటాల విషయంలో, పద్మ అవార్డుల్లో కూడా అన్యాయం జరిగిందని శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన విచారం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల శకటాలకు అవకాశం ఇవ్వలేదని, పీవీ నరసింహారావు, ఎన్‌టి రామారావు లాంటి పరిపాలనాధ్యక్షులు, రాజనీతిజ్ఞులకు భారతరత్న ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం సరిగా స్పందించలేదని ఆయన చెప్పారు. అలాగే నీలం సంజీవరెడ్డి, ఎస్వీ రంగారావు, సావిత్రి, దాసరి నారాయణరావు లాంటి వ్యక్తులకు కూడా పద్మా అవార్డుల్లో ఎలాంటి గౌరవం దక్కలేదని దుయ్యబట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచే కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం వస్తుందని గతంలో కేసీఆర్ లెక్కలు వివరించారని ఆయన గుర్తుచేశారు.

ఆర్‌డబ్ల్యుఎస్
ఇంజనీర్ల మౌనదీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామీణ తాగునీటిసరఫరా విభాగం ఇంజనీర్లు శనివారం ఈఎన్‌సీ కార్యాలయం ఎదుట మౌనదీక్ష నిర్వహించారు. ఏళ్ల తరబడి ఆర్‌డబ్ల్యుఎస్ విభాగంలో పనిచేస్తున్నప్పటికీ తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయటం లేదని ఆందోళన వెలిబుచ్చారు. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ విభాగం ఇంజనీర్ల ఆసోషియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ఎల్లారెడ్డి, నరేందర్ అధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఉద్యోగులు , ఆసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దాం
కమీషనర్ వాకాటి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలియో రహిత తెలంగాణ సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వాకాటి కరుణ అన్నారు. ఆదివారం రాష్ట్రమంతటా పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్దం చేసినట్టు తెలిపారు. దేశంలో చివరిపోలియో కేసును 2011 జనవరి 13న పశ్చిమబెంగాల్‌లోని హౌరా నగరంలో గుర్తించినట్టు తెలిపారు. గడిచిన ఏడేళ్లలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదన్నారు. అయినప్పటికీ పొరుగున ఉన్న పాకిస్తాన్ , ఆప్ఘనిస్తాన్ , నైజీరియా దేశాలలో పోలియో కేసులు నమోదవుతూనే ఉన్నాయన్నారు. ఈ వ్యాధి క్రిములు తిరిగి మనదేశంలోకి ప్రవేశించకుండా ఉండేందకు కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రమంతటా ఐదేళ్లలోపు ఉన్న 36.55లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 22768 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ నగర పరిధిలో ఫిలింనగర్‌లోని ప్రశాసన్ బస్తీలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్ పల్స్‌పోలియో కార్యాక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతిఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కమీషనర్ వాకాటి కరుణ ఈ మేరకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రపతితో రాహుల్ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో శనివారం ఇక్కడ సమావేశమయ్యారు. పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత ఆయన రాష్ట్రపతిని కలవడం ఇదే తొలిసారి. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో నేటి నా సమావేశం అద్భుతం అని రాహుల్ ట్వీట్ చేశారు. అది మర్యాదపూర్వక సమావేశమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

మైనార్టీలకు ఆస్ట్రేలియా విట్ ఉచిత విద్య?

హైదరాబాద్, ఆంధ్రప్రభ :ఆస్ట్రేలియాలో మైనారిటీలకు ఉచితంగా విద్యనందించేందుకు మెల్‌బోర్న్‌లో ఉన్న విక్టోరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వి.ఐ.టి) ముందుకు వచ్చింది. ఈ మేరకు వి.ఐ.టి. సీ.ఇ.ఓ అర్జున్ సూరపనేని, నిశిధర్‌రెడ్డిలు రాష్ట్ర హోం, కార్మిక శాఖ మంత్రి నాయినినర్సింహారెడ్డిలతో శనివారం నాడు సచివాలయంలో చర్చించారు. మంత్రి ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్ళినప్పుడు వి.ఐ.టి ని సందర్శించి తెలంగాణ విద్యార్థులకు ఏదైనా ప్రయోజనం చేకూర్చాలని కోరారు. ఇందుకు స్పందించిన వి.ఐ.టి. సీ.ఇ.ఓ ప్రస్తుతం డిగ్రీ స్థాయిలో కాని, పి.జి.స్థాయిలో కాని మైనార్టీలకు ఉచితంగా విద్యనందించాలని నిర్ణయించమని దాని కోసం ఒక్కొక్కరికి రూ.25 లక్షల రూపాయల వ్యయం అవుతుందని తెలిపారు. వి.ఐ.టి.కి ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీలలో వాఖలు ఉన్నాయని త్వరలో దుబాయ్‌లో శాఖలు ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. దీంతో మంత్రి నాయిని నర్సింహారెడ్డి అంజుమన్ ముస్లిం మైనార్టీ సంస్థనిర్వాహకులను సంప్రదించారు. అర్హతలు, ఆసక్తి కలిగిన మైనార్టీ విద్యార్థులను సూచించాల్సిందిగా మంత్రి కోరారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరెడ్డి, అంజుమన్ సంస్థ అధ్యక్షుడు అక్తర్ అలీ, కార్యదర్శి అబ్దుల్ వాహెబ్, ఇమాముద్దీన్‌లు మంత్రితో చర్చించారు.

ఏపీలో టెట్ వాయిదా

ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకు పరీక్షలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఊహించినట్లుగానే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ షెడ్యూల్ మారింది. ఈ మేరకు రాష్ట్ర మానవవరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు టెట్ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు శనివారం ప్రకటించారు.ఉదయం ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈమేరకు ఆయన శనివారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థులు,విద్యార్థి సంఘాల నుంచి విస్తృతంగా అభ్యర్థనలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఫిబ్రవరి 5 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగాల్సిన టెట్ పరీక్షలను ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నుంచి వస్తున్న అభ్యర్థనలు,ఆందోళనలను పరిగణలోకి తీసుకుని టెట్ పరీక్షలను వాయిదా వేశామని మంత్రి స్పష్టంచేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఈ క్రమంలోనే వారి ప్రయోజనాలను కాపాడడం కోసం టెట్ పరీక్షలను వాయిదా వేసి,మరింత సమయం ఇచ్చామని అన్నారు. దీంతో విద్యార్థులు మరింతగా చదువుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. 2016-18 బ్యాచ్ డీఎడ్ విద్యార్థులకు కూడా టెట్‌లో అర్హత కల్పించాలని అభ్యర్థించడం, డీఎడ్, బీఈడీ,బీటెక్ విద్యార్థులకు టెట్‌లో అర్హత కల్పించడం,భాషా పండితులకు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని ప్రత్యేకంగా రూపొందించాలని వారు అభ్యర్థించడం, డిగ్రీలో టెట్ పరీక్షల అర్హత మార్కులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని,ఆయా కేటగిరీలకు సంబంధించిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు టెట్ పరీక్షను ఫిబ్రవరికి వాయిదా వేసామని మంత్రి తెలిపారు.

మొత్తం 4,46,833 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. పరీక్షల షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని, ఇందుకు సంబంధించి ఏర్పాట్లుజరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే పరీక్షనిర్వహిస్తామని మంత్రి గంటా స్పష్టం చేశారు.

సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షమా? పరోక్షమా?

(మొదటిపేజీ తరువాయి)

నెలలుగా ఉపసంఘం సభ్యులు సామాజిక, రాజకీయ, న్యాయ నిపుణులతో సమాలోచనలు జరిపి సీఎంకు నివేదిక సమర్పించారు. అదే సమయంలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని ఆవిష్కరించి దేశానికే ఆదర్శంగా గ్రామీణ వ్యవస్థను తీర్చిదిద్దాలన్న కోణంలోనూ ఉపసంఘం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అందులో ఇప్పుడున్న ప్రక్రియలో మార్పుచేస్తూ గ్రామ సర్పంచ్ ఎన్నికను వార్డు సభ్యుల ద్వారా జరపాలన్న నిర్ణయాన్ని వెల్లడించారు. కానీ ఈ మార్పుతో రాజ్యాంగ సమస్య తలెత్తే అవకాశాలు ఉండడంతో పాటు గ్రామస్థాయిలో రాజకీయంగా కూడా వ్యతిరేకత ఎదురవుతున్నందున ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలా? లేక ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు పరోక్షంగా ఎన్నుకోవాలా? అన్న అంశంపై కేసీఆర్ లోతుగా సమాలోచనలు జరుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో తుది నిర్ణయం తీసుకునేందుకు కాస్త సమయం అవసరమవుతున్నందున గడువు ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించి ఎన్నికలను కొంతకాలం పాటు వాయిదా వేయాలన్న కోణంలోనూ ఆలోచిస్తున్నారు. అసలు ఈ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అభిప్రాయం ఏ విధంగా ఉంటుందోనన్న కోణంలోనూ రాజకీయ వ్యూహాన్ని రచిస్తున్నారు. ఈ అంశంపై ప్రత్యేకంగా అధ్యయనంచేసి నివేదిక ఇచ్చే బాధ్యతలను పార్టీ సీనియర్లయిన కేశవరావు,, డి.శ్రీనివాస్, తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డిలకు అప్పగించారు. అన్ని కోణాల్లో ఆలోచించి పూర్తిస్థాయి నివేదిక అందిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్ళాలని సీఎం కేసీఆర్ సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లోగా నిర్ణయం



ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

జవాబుదారీగా ఉండాలన్నదే లక్ష్యం

గ్రామ, పంచాయతీలకు నూతన జవసత్వాలు తేవడంతో సహా పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో సర్పంచ్‌లు, పాలక మండలి సభ్యులు వ్యవహరించేలా కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా కొత్త చట్టం ముసాయిదాను రూపొందించిన అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. దీనిపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సుదీర్ఘ సమావేశాలు నిర్వహించి పూర్తిస్థాయిలో మంతనాలు జరిపి సీఎం కేసీఆర్‌కు కొత్త చట్టంలో పొందుపర్చాల్సిన అంశాలపై సిఫారసు చేస్తూ నివేదిక అందజేసింది. అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి ఈ చట్టాన్ని ఆమోదింపజేసుకుని ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని సీఎంకేసీఆర్ తొలుత భావించారు. అయితే ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేపరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉంటే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణను చేపట్టింది. రాష్ట్రంలోని 83 గ్రామీణ ప్రాంతాలకు చెందిన నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన ముసాయిదా జాబితాను ఇప్పటికే ఎన్నికల సంఘం విడుదల చేసింది. ముసాయిదాపై అభ్యంతరాలు, వినతులు వచ్చే నెల 14వ తేదీవరకు స్వీకరిస్తామని స్పష్టంచేసింది. మార్చి 24వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తామని ఎన్నికల సంఘం ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. ఓటర్ల సవరణ తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ ప్రతిపాదించినప్పటికీ నూతన పంచాయతీరాజ్ చట్ట సవరణ కూర్పుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున మార్చి చివరిలో కూడా ఎన్నికలు సాధ్యంకావని అప్పటికే వేసవి వస్తుందని అధికారులు అంటున్నారు.

స్పష్టత లేకనే నిర్ణయం వాయిదా

గ్రామ సర్పంచ్ పదవికి పరోక్షంగా ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదనపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. నూతన పంచాయతీరాజ్ చట్ట సవరణకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సర్పంచ్ ఎన్నికపై ఎటూ తేల్చకపోవడంతో పాటు ఎటువంటి సిఫారసు చేయకపోవడంతో ముఖ్యమంత్రి కూడా సర్పంచ్ ఎన్నికను ఏ విధంగా నిర్వహించాలన్న అంశంపై ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. సర్పంచ్ పదవికి పరోక్ష పద్ధతిన ఎన్నికలు జరిపితే పార్టీకి కూడా ఇబ్బందులు తలెత్తుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయాలు పూర్తిగా మారిపోతాయని కొందరు మంత్రులు, పార్టీ సీనియర్లు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన సందర్భంలో చెప్పినట్టు సమాచారం. దీంతో సర్పంచ్ ఎన్నిక విధానంపై ఇప్పటికిప్పుడు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా వాయిదా వేయాలని కేసీఆర్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

తాజాగా అధికారులతో సమాలోచనలు

రెండు రోజుల క్రితం ప్రగతి భవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో కూడా సర్పంచ్ ఎన్నిక విధానానికి సంబంధించి ఎటువంటి చర్చ జరపకుండా మిగతా అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. సమావేశంలో పాల్గొన్న కొందరు న్యాయ కోవిదులు సర్పంచ్ ఎన్నిక విధానంపై తమ అభిప్రాయాలను వెల్లడించినట్టు తెలుస్తోంది. గతంలో మాదిరిగానే ప్రత్యక్ష విధానం ద్వారా ఈ ఎన్నిక జరిగితేనే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తంచేసినట్టు ప్రచారం జరుగుతోంది.

బడ్జెట్ సమావేశాల తర్వాతే నోటిఫికేషన్?

శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి 12 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతుండగా, నెల రోజులపాటు ఇవి జరగనున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో పాటు ఎండలు మండుతాయని ఈ రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని ఒకవేళ జరిపినా తాగునీటి సమస్యలను ప్రజలు ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం.

అందుకే ఫిబ్రవరి నెలలో జరపాలనకున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను జూన్ నెలలో జరిపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నూతన పంచాయతీరాజ్ చట్టంపై ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై కూడా ఎన్నికల వాయిదాకు కారణంగా భావిస్తున్నారు. చట్ట సవరణకు మరింత సమయం కావాల్సి వస్తుందని ఇటీవల జరిగిన సమావేశంలో అధికారులు, న్యాయశాఖకు చెందిన సీనియర్లు సీఎం దృష్టికి తీసుకువచ్చినట్టు సమాచారం. వాస్తవానికి అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి నూతన పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సీఎం కేసీఆర్ భావించారు. అయితే ఈ బిల్లును కూడా బడ్జెట్ సమావేశాల్లోనే అసెంబ్లీ ముందుకు తీసుకురావాలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

కలెక్టర్లకు కొత్త పంచాయతీల బాధ్యతలు

కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలు పంపవలసిన గడువును ఈనెల 30 వరకు ప్రభుత్వం పొడిగించింది. అయితే ఈ నాలుగు రోజుల్లో అన్ని జిల్లాల నుంచి కొత్త పంచాయతీలపై పూర్తి సమాచారం వచ్చే అవకాశాలు కనిపించడం లేదని మరో పదిహేను రోజులపాటు గడువును పెంచవచ్చన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది. పూర్తిస్థాయిలో సమాచారం వచ్చాకే ముసాయిదా బిల్లును సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పుడున్న పంచాయతీల పదవీకాలం జులై నెలాఖరుతో ముగుస్తుంది. ఐదు నెలల ముందు ఎన్నికలుఎలా నిర్వహిస్తారని ఇప్పటికే విపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్న సమయంలోనే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిపే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సమావేశంలోనూ గ్రామ పంచాయతీ ఎన్నికలపై కొందరు కలెక్టర్లు తమ అభిప్రాయాన్ని ప్రకటించారని ప్రస్తుత పంచాయతీ గడువు ముగిశాకే ఎన్నికలు జరిపితే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తంచేశారని సమాచారం. సర్పంచ్ ఎన్నికపై కూడా సీఎం కేసీఆర్ కలెక్టర్ల అభిప్రాయాలను కోరగా వారు కూడా ప్రత్యక్ష విధానంతో కాకుండా పరోక్షంగా జరపడమే ఉత్తమమని తేల్చి చెప్పినట్టు ప్రచారం జరిగింది.

పటేల్, పట్వారీ వ్యవస్థకు కుట్ర

● ఎస్సీ, ఎస్టీ, బీసీల నాయకత్వ అణచివేతకే పంచాయతీరాజ్ చట్ట సవరణ ● తెలంగాణ ప్రభుత్వంపై మండిపడ్డ ప్రజా సంఘాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల నాయకత్వాన్ని దెబ్బకొట్టడానికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణకు పూనుకుంటోందని టీఆర్ఎస్ఎస్ఎస్, డిబిఎఫ్, టివివియు, టిబిఎన్‌సికేయు సంఘాలు ఆరోపించారు.శనివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. రిటైర్డ్ ఐఏఎస్ గోపాల్‌రావు, టిఆర్ఎస్ఎస్ఎస్‌కు చెందిన చార్లెస్ వెస్లీ, డిబీఎఫ్‌కు చెందిన శంకర్, కేసీఎస్‌కు చెందిన చంద్రన్న, టిబిఎన్‌సికేయుకు చెందిన ప్రసాద్, టివివియుకు చెందిన వెంకటయ్య తదితరులు మాట్లాడుతూ, పంచాయతీరాజ్ చట్ట సమరణ ద్వారా రాష్ట్రంలో తిరిగి పటేల్‌పట్వారీ వ్యవస్థను తిరిగిని ప్రవేశపెట్టేందుకు తెరాస ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలలో బలహీన వర్గాలకు పెద్దఎత్తున అవకాశాలు వచ్చాయని, వాటిని గండికొట్టడానికే తెరాస ప్రభుత్వం సవరణ కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం రాష్ట్రా ల అధికారాలు కేంద్రం వద్ద కాకుండా రాష్ట్రా లకు అప్పగించాలని పదేపదే కోరుతున్నారని, అలాంటప్పుడు స్థానిక అధికారాలను ఆయన ఏ విధంగా గుంజుకుంటారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిపాలన అంటే అధికారంలో ప్రజలందరిని పాలుపంచుకోవడమే పంచాయతీరాజ్ వ్యవస్థ అని అన్నారు. మన రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో 40వ ఆర్టికల్ గ్రామ స్వపరిపాలన పంచాయితీలగురించి చాటిచెప్పిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గ్రామపంచాయతీల రూపకల్పనకు ప్రభుత్వాల కృషి చేయడంతో పాటు వాటికి తగిన అధికారాలను కల్పించి స్వయంపరిపాలన యూనిట్లుగా రూపుదిద్దాలని రాజ్యాంగం ఆదేశించిందని వ్యాఖ్యానించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరణ చేయాలని ఎవరు కోరకపోయినప్పటికీ ప్రభుత్వంయత్నించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నట్లుగా తెలుస్తోందని ఆరోపించారు. గత మూడున్నర సంవత్సరాలుగా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోగా...కేంద్రం నుండి వచ్చిన నిధులను కూడా పక్కదారి మళ్ళించిందని వారు మండిపడ్డారు. మన ఊరు-మన ప్రణాళిక పేరుతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలనురూపొందించి....వాటికి నిధులు కేటాయించకుండా గ్రామజ్యోతి పేరుతో మరో పథకానికి ప్రభుత్వం స్వీకారం చుట్టడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిన్నింటిని కప్పి పుచ్చుకోవడానికి ఎన్నికలు దగ్గర పడుతున్నందన చట్ట సవరణ పేరుతో ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో గందరగోళం సృష్టించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం కనుక చట్టసవరణ చేయాలనుకుంటే విధివిధానాలను రూపొందించుకుని మంత్రివర్గ ముసాయిదాను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు వచ్చి అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. ఇలాంటి ప్రక్రియ చేపట్టకుండా సవరణ చేయడం వల్ల ప్రజలకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో శోభారాణీ, కల్పన, చుంచురాజేందర్, కిరణ్, ఎర్రనర్సింహా, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

కుడిచేయి పనిచేయకున్నా దావోస్ వెళ్లొచ్చా!

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: దావోస్ పర్యటన విజయవంత మైందని, ఎన్నో మార్పులకు ప్రపంచ ఎకనమిక్ ఫోరం నాంది పలికిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. దావోస్ లో అందరి చూపు భారతదేశం, ఆంధ్రప్రదేశ్ వైపేనని పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలో శనివారం మీడియా ప్రతినిధుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ దావోస్ పర్యటన సందర్భంగా తాము అనుకున్న లక్ష్యం నెరవేరిందని తెలిపారు. వివిధ అంశాలకు సంబంధించిన పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఏర్పడిం దని, ప్రపంచ మేధావులు, ఆర్థికవేత్తలు, సీఈవోలతో ఫలప్రదంగా చర్చలు జరిగాయని చెప్పారు. భారతదేశంలో ఉన్న అవకాశాలు ఎక్కడా లేవని ప్రపంచమే ఒప్పుకుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటానని, ఆరోగ్యాన్ని సైతం లక్ష్యపెట్టకుండా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 1995 నుంచి తాను దావోస్‌కు వెళుతున్నానని, ప్రపంచంలో ఉండే మేధావి వర్గ మంతా దావోస్ సదస్సులో పాల్గొంటుండడం ఒక ప్రత్యేకత అని సీఎం అన్నారు. మొత్తం 14సార్లు దావోస్ ప్రపంచ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్నానని, రాష్ట్రం విడిపోయిన అనంతరం నాలుగు సార్లు ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్నానని పేర్కొన్నారు. రెండు దశాబ్దాల అనంతరం దేశం నుంచి ఈ సదస్సులో దేశ ప్రధాని పాల్గొనడం ఇదే ప్రథమమని చంద్రబాబు తెలియజేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రెండు ఒప్పందాలు చేసుకున్నామని, జ్యూరిక్‌లో సిస్టర్ సిటీతో ఒక ఎంవోయు కుదిరిందని ఆయన వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్3.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు.

ప్రత్యేక హోదాపై పోరాటం ఆగదు

ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్



నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: ప్రత్యేక హోదాపై తమ పోరాటం ఆగదని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం మానేసి పరిశ్రమలు, పెట్టుబడుల పేరుతో విదేశాల్లో పర్యటిస్తూ నల్లధనాన్ని దాచుకుంటున్నారని ఆయన ఈ సందర్భంగా బాబుపై నిప్పులు చెరిగారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆయన శనివారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోని సగుటూరు గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఓజిలి మండలంలోని గుర్రంకొండ, ఆర్మేటిపాడు, తిమ్మసముద్రం, కాంద్ర వరకు 14.7 కి.మీల మేర నడిచారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, మహిళలతో కొంతసేపు మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు గ్రామాల పరిధిలో పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. వైకాపా అధికారంలోకి వస్తే నవరత్నాలతో పాటు పేద ప్రజలకోసం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ ఫలాలను ఆయన వివరించారు. అంతకముందు గుర్రంకొండ వద్ద ఆయన మాట్లాడుతూ అధికార తెలుగుదేశం పార్టీపై మరోసారి ఘాటైన విమర్శలు చేశారు. బాబు రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చేందుకు విదేశాలకు వెళుతున్నానని ఘనంగా ప్రకటనలు అయితే చేస్తున్నారు తప్ప ఇప్పటివరకు ఒక్క పరిశ్రమను కూడా నెలకొల్పలేకపోతున్నారన్నారు. విశాఖలో రెండుసార్లు పారిశ్రామిక సదస్సులను నిర్వహించిలక్షల కోట్లు పెట్టుబడులు తెస్తున్నామని, లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకున్నారే తప్ప ఒక్కరికి కూడా ఉద్యోగ అవకాశం కల్పించలేకపోయారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి పెద్ద పరిశ్రమ రావాలన్నా, బడా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలన్నా ప్రత్యేక హోదా రావాలన్నారు. అప్పుడే పారిశ్రామికవేత్తలు విదేశాలనుంచి రాష్ట్రానికి పరుగులు తీస్తారని, అప్పటివరకు ఎన్నిసార్లు బాబు విదేశాలకు వెళ్ళినా పెట్టుబడులు మాత్రం తీసుకురాలేరన్నారు. ఆయన గడిచిన నాలుగు సంవత్సరాల్లో విదేశీ పర్యటనపై చూపుతున్న శ్రద్ధ ప్రత్యేక హోదాపై చూపిఉంటే ఈ పాటికి రాష్ట్రంలో ఎన్నో పరిశ్రమలువచ్చి ఉండేవని తద్వారా యువతకు కూడా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించి ఉండేవన్నారు. వైకాపా మాత్రం ఈ విషయంపై మాట తప్పదని, ప్రత్యేక హోదా సాధించేవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు.

ఆధార్‌ను గుర్తించిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ

జైపూర్: 2017 సంవత్సరానికి హిందీ పదంగా ఆధార్‌ను ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఎంపిక చేసింది. ఆధార్ కార్డు కారణంగా ఈ పదం గతేడాది వార్తల్లో ప్రముఖంగా నిలిచింది. ఈ సంవత్సరం కూడా అంతే ప్రత్యేకతను చాటుకుంటున్నది. ఇక్కడ జరుగుతున్న జైపూర్ సాహితీ వేడుకలో భాగంగా శనివారం జరిగిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీస్.. ఈ ఏటి హిందీ పదం సదస్సులో పై ప్రకటన చేశారు. మిత్రో, నోట్‌బందీ, గౌరక్షక్ లాంటి ఇతర పదాలను సైతం పరిగణనలోకి తీసుకున్నప్పటికీ విస్తృతమైన చర్చల అనంతరం ఆధార్‌ను ఎంపిక చేసుకోవడం జరిగిందని జర్నలిస్టు సౌరభ్ ద్వివేది తెలిపారు.

వికలాంగులుకాదు.. దివ్యాంగులు

రైల్వేశాఖ ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ: అంగవైకల్యం కలిగిన వారిని దివ్యాంగులుగా పిలవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన రెండేళ్ల తర్వాత రైల్వే శాఖలో కదలికవచ్చింది. రైల్వే రిజర్వేషన్ ఫాంలో అంగవైకల్యం కలిగిన వారిని ఇక నుంచి వికలాంగులకు బదులు దివ్యాంగులు వ్యవహరించాలని రైల్వే శాఖ ఆదేశాలిచ్చింది.. వారికి ఇచ్చే సర్టిఫికెట్లలో కూడా ఇక నుంచి దివ్యాంగులు అని పేర్కొననున్నారు. అంధత్వం కలిగిన వారిని ఇక నుంచి పర్సన్ విత్ విజువల్ ఇంపెయిర్‌మంట్ అని .. చెవిటి, మూగ వారిని పర్సన్ విత్ ఇయరింగ్ అండ్ స్పీచ్ ఇంపెయిర్ మెంట్ అని.. ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ వ్యక్తులను పర్సన్ విత్ డిసెబులిటీస్ అని వ్యవహరించాలని పేర్కొంది. కొత్త ఆదేశాలు ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి వస్తాయి.

టీడీపీ-బీజేపీ మిత్రభేదం సెగలు

● మా పార్టీ వాళ్లను నేను నియంత్రిస్తున్నా ● బీజేపీ అధిష్టానమూ అదే చేయాలి ● ఇష్టం లేకుంటే నమస్కారం పెట్టేస్తాం ● బీజేపీ నేతలే ఆలోచించుకోవాలి ● ఏపీ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు ● బీజేపీ అభ్యంతరం

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగుదేశం , బీజేపీ పార్టీల మధ్య మరోసారి మాటల యుద్ధానికి తెరలే చింది. గత కొన్ని నెలలుగా జిల్లా, రాష్ట్ర నేతల వరకే పరి మితం అయిన ఈ వ్యవహారం నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపతున్నాయి. శనివారం జరిగిన మీడియా సమావేశం లో ఆయన ఇటీవలి పరిణామాలపై ఘాటుగా స్పందిం చారు. వివిధ జిల్లాల్లో చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన స్పందించారు. పొత్తు కోసం తాము వెంపర్లా డటం లేదనే రీతిలో ముఖ్యమంత్రి ప్రత్యక్ష, పరోక్ష వ్యాఖ్యలు చేయడం ప్రకంపనలు సృష్టించే అవకాశాలు ఉన్నాయి. తెలుగుదేశంపై, కొన్ని అంశాలపై బిజెపి నేత లు చేస్తున్న వ్యాఖ్యలు తమకు సమ్మతం కాదనే రీతిలో చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. తాము ఎప్పుడంటే అప్పుడు తెగతెంపులకు సిద్ధమేననే సంకేతాలను ఇచ్చారు. చంద్రబాబు మధ్యాహ్నం చేసిన వ్యాఖ్యలకు జాతీ య బీజేపీ నాయకురాలు పురందేశ్వరి, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సాయంత్రం ఘాటుగా స్పందించారు.

నమస్కారం పెట్టేస్తాం: బాబు

తాము బీజేపీ విషయంలో మిత్ర పక్ష ధర్మం వల్లనే సమయమనం పాటిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమతో బంధం వద్దనుకుంటే బీజేపీ వాళ్లే ఆలోచించుకోవాలని, తాము నమస్కారం చెప్పి తప్పుకోవడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. శనివారం వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ తాము ఇంకా కూడా తమ కేడర్‌ను నియంత్రిస్తునే ఉన్నామని అన్నారు. ఇటీవల తాడేపల్లి గూడెంలో ఇరుపార్టీల మధ్య ఘర్షణను వివరిస్తూ ఇలాంటి సందర్భాలు మంచివి కాదన్నారు. భారతీయ జనతాపార్టీ నేతలు తెలుగుదేశం పై చేసిన ఆరోపణలపై ఆ పార్టీ అధిష్టానవర్గం చూసుకుంటుందని తెలిపారు. మిగిలిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే వరకూ ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వంపై వుందని స్పష్టం చేశారు. ఒకవైపు సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు విపక్షాలతో పోరాటం చేయాలా అని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇస్తే భారతీయ జనతా పార్టీతో కలిసి పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి కొత్తగా అనడం లేదని విమర్శించారు. జగన్ మాట మీద నిలబడే వ్యక్తి కాదని ప్రత్యేక హోదా కోసం ఎంపీలతో రాజీనామా చేయిస్తానని, మాట తప్పాడని పేర్కొన్నారు. వాళ్ళవల్ల ఒరిగేదేమీ వుండదన్నారు. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా తాను రాష్ట్రం కోసం కష్టపడుతుంటే తన మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇచ్చినప్పుడు ప్రత్యేక హోదా జగన్‌కు గుర్తులేదా అని ప్రశ్నించారు. కేసుల నుంచి బయటపడటానికి, అక్రమాస్తులను కాపాడుకోవడానికి జగన్ చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒకటని ధ్వజమెత్తారు. అవినీతిపరుల ఆస్తులను ఇక నుంచి ప్రజలకు చెందాల్సిందేనని వ్యాఖ్యానించారు. ఒరిస్సా, బీహార్ తరహాలో అవినీతి ఆరోపణలతో దోచుకున్న సొమ్మంతా వెనక్కి తీసుకుంటామని అగ్రిగోల్డ్ బాధితులకు తిరిగి ఇప్పిస్తున్నామని తెలిపారు. మిగిలిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే వరకు ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని అంటూ గవర్నర్ లాంటి గౌరవప్రదమైన వ్యక్తులకు సంబంధించి తాను బహిరంగ వ్యాఖ్యలు చేయలేనని స్పష్టం చేశారు. తాను హుందాగా ఉంటానని గవర్నర్‌ను మార్చాలని కొంత మంది చేస్తున్న కామెంట్లపై స్పందించబోనని చంద్రబాబునాయుడు వివరించారు.



చంద్రబాబు వ్యాఖ్యలు సరికాదు: దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టీకరణ ..

తాము ఇప్పటికీ మిత్ర ధర్మాన్ని పాటిస్తున్నామని, విడిపోవాలని బీజేపీ భావిస్తే నమస్కారం పెట్టేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం చేసిన వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సెగలు పుట్టిస్తున్నాయి. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ మహిళా మోర్చా నాయకురాలు దగ్గుబాటి పురంధేశ్వరి స్పందించారు. తాము మిత్ర ధర్మం పాటించడం లేదనడం చంద్రబాబుకు సమంజసం కాదన్నారు.

తమతో కలిసి ఉంటారో, అండరోననే విషయాన్ని తెలుగుదేశం పార్టీనే తేల్చుకోవాలని ఆమె వ్యాఖ్యానించారు. చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధిష్టానం చూసుకుంటుందని ఆమె చెప్పారు. బీజేపీతో కలిసి ఉండాలని టీడీపీ భావిస్తే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుతో మాట్లాడాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చి సొంత పథకాలుగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని ఆమె విమర్శించారు. పంచాయితీలకు కూడా కేంద్రం నుంచి నేరుగా నిధులు అందుతున్నాయని ఆమె చెప్పారు. రాజీనామా చేసిన తర్వాతనే టిడీపీలోకి రావాలంటూ దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు కోరేవారని పురంధేశ్వరి చెప్పారు. ఫిరాయింపు నేతలపై చర్యలు తీసుకోవాలంటూ ఇదే విషయంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు లేఖ రాసినట్లు ఆమె పేర్కొన్నారు.

సమయం ఆసన్నమైంది..

చంద్రబాబు వ్యాఖ్యలపై స్పందించే సమయం ఆసన్నమైందని బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు అన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ తమ పార్టీ అదిష్టానం త్వరలోనే దీనిపై స్పందిస్తుందని, చంద్రబాబు ఉండనంటే అది వారిష్టమని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు పొత్తు ధర్మం ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. అసలు టీడీపీ మిత్ర ధర్మం పాటిస్తుందా..? ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రధాని మోడీ ఫోటో పెట్టారా..? కేంద్రంపై మీరు సుప్రీంకోర్టుకు వెళ్తారా.. అలా కేసు వేస్తాననడం మిత్ర ధర్మం ఉల్లంఘన కాదా.. అంటూ తెలుగుదేశం పార్టీని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి ఆయన పలు ప్రశ్నల వర్షం కురిపించారు..

గిరిజన కుంభమేళా.. మహా సంబురం



జంపన్నవాగుకు జలకళ

భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క - సారలమ్మ మహాజాతరకు తరలివచ్చిన భక్తులకు పుణ్య స్నానాలు చేయడానికి జంపన్న వాగు జలకళతో కళకళ లాడుతున్నది. శనివారం మధ్యాహ్నం సమయానికి జంపన్న వాగుకు నీరు రావడంతో జాతరకు వచ్చే భక్తులు హర్షాన్ని వ్యక్తం చేశారు. గోవిందరావు పేట మండలంలోని లక్నవరం చెరువులో మూడు రోజుల క్రితం విడుదల చేసిన నీరు మేడారం చేరుకుంది. జాతర కు వచ్చిన భక్తులు జంపన్న వాగులో తనివితీరా పుణ్య స్నానాలు చేస్తున్నారు.

అద్భుతం గిరిజన మ్యూజియం



భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారంలో సమ్మక్క - సారలమ్మ ఆదివాసీ మ్యూజీయం భక్తులకు కనువిందు చేసేలా తీర్చిదిద్దారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు కట్టు బొట్లకు అద్దంపట్టేలా ఈ మ్యూజీయాన్ని నిర్మించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా, మరో కుంభమేళాగా ప్రఖ్యాతిగాంచిన శ్రీ మేడారం సమ్మక్క - సారలమ్మను దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్టాలతోపాటు దేశ , విదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ, ఆచారా లను తెలిపేందుకు ఆదివాసీ మ్యూజీయాన్ని రూ.3 కోట్లతో నిర్మించారు. ఈ మ్యూజీయంలో పూర్వకాలం నుంచి నేటి తరం వరకు గిరిజనలు జీవన విధానాన్ని తెలిపే విభిన్న పరికరాలు, వారు వాడిన వస్తువులు , దుస్తులు జీవన చిత్రాలు , పనిముట్లు ప్రత్యేకంగా సేకరించి పొందుపరిచారు.

నిరంతర త్రిఫేజ్ విద్యుత్



భూపాలపల్లి, ప్రభన్యూస్ : జాతరలో నిరంతరం త్రిపేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు అండ్ ఫైనాన్స్ డైరెక్టర్ బుగ్గవీటి వెంకటేశ్వర్ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో శనివారం ప్రభన్యూస్ ప్రతినిధితో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే ప్రయాణికులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం 24 గంటల పాటు త్రిఫేజ్ విద్యుత్‌ను అందిస్తున్నామని అన్నారు. గత జాతరలో ఒక్క నిమిషం పాటు కూడా విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా అందజేసిన ఘనత తమ సంస్థకు ఉందని ఈ జాతరలో కూడా మరో సారి సేవలు అందించి పేరు నిలుపుకుంటామని వారన్నారు. గత జారతలో 33 /కేవీ సబ్ స్టేషన్ మాత్రమే ఉండేదని, ఈసారీ మరో 33/11కేవీ సబ్ స్టేషన్‌ను మ్యూజీయం సమీపంలో అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక సబ్ స్టేషన్‌కు ములుగు 132/33 కేవి నుంచి సరఫరా ఇస్తున్నామని, మరొక సబ్ స్టేషన్‌కు మంగపేట మండలం కమలాపురం 132/33 కేవీ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రెండు సబ్ స్టేషన్‌లో 5ఎంవీ ట్రాన్స్‌ఫార్మలులు మూడు చొప్పున ఉన్నాయన్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ అంతరాయం కలిగితే మరో ట్రాన్స్‌ఫార్మర్ ద్వార జాతరంతటికి విద్యుత్ సరఫరా చేస్తామని అన్నారు. జాతర మొత్తంలో వివిధ కేటగిరిలకు చెందిన156 త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మరులు ఏర్పాటు చేయడం జరిగిందని , 15 సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్ములు ఏర్పాటు చేశామన్నారు. 400 మంది విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారని వారు తెలిపారు, అందులో డీఈలు నలుగురు , 20 ఏడీలు, 30 ఏఈలు , మిగతా సిబ్బంది ఉన్నారన్నారు. స్పెషల్ అధికారి సీజీఎం మోహన్ రావు పర్యవేక్షిస్తారని వారు తెలిపారు. ఈసమావేశంలో భూపాలపల్లి ఎస్ఈ నరేష్ ,విజిలెన్స్ డీఈ మంచూర్, ములుగు డీఈ భాస్కర్, ఏఈ అండ్ ఏడి వేణు తదితరులున్నారు.



మ్యూజియంను తిలకిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా, ప్రఖ్యాతి గాంచిన మరో కుంభమేళా మేడారం మహాజాతర. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో కొలువుదీరిన గిరిజన ఆరాధ్యదైవాలకు శ్రీ మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు రాష్ట్రం నుండే కాకుండా దేశంలో వివిధ ప్రాంతాల నుండి లక్షలసంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు ,ముడుపులు , నైవేద్యాలు సమర్పించి తన్మయత్వంతో మొక్కులు చెల్లించు కుంటారు. ఆ తల్లులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఇస్తూ ,మహిమాన్విత శక్తులుగా వీరాజిల్లుతున్నారు. ఈ జాతర జనవరి 31 నుండి ఫిబ్రవరి 3 వరకు అంగరంగ వైభవోపేతంగా భక్తజన ప్రవాహంతో కొనసాగుతుంది.



- పచ్చని అడవిలో ఇసుకేస్తే రాలనంత జనం
- మహాజాతరలో ఆ 'నాలుగు' రోజులు..

భూపాలపల్లి, ప్రభన్యూస్ :

నాలుగు రోజుల జాతర విశిష్టత, ప్రాచుర్యం ఇలా..!

జనవరి 31న జాతర మొదటి రోజు

కన్నెపల్లి కల్పవల్లి ఆగమనం

కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకురావడంతో మహాజాతర మొదలవుతుంది. సమ్మక్క కూతురు కన్నెపల్లి కల్పవల్లి, వరాల తల్లి అయినటువంటి సారలమ్మను నివాసం కన్నెపల్లి., మేడారానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోని చిన్న ఆలయంలో ప్రతీష్టించిన సారలమ్మను జనవరి 31న సాయంత్రం మేడారంలోని గద్దె వద్దకు చేరుతుంది. ఈ రోజు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కన్నెపల్లి నుంచి సారలమ్మను గిరిజన పూజారులు (వడ్డెలు) మేడారంలోని గద్దెలకు వచ్చి అక్కడ ప్రత్యేక ముగ్గులు వేసి మళ్ళీ కన్నెపల్లిలోని పూజా మందిరానికి చేరుకుంటారు. అక్కడ గిరిజన పూజారులు (వడ్డెలు) సుమారు రెండు గంటల పాటు అత్యంత రహస్యంగా పూజలు నిర్వహిస్తారు. కడుపు పండాలని కోరుకునేవారు , దీర్ఘకాలిక రుగ్మతలతో భాదపడు తున్న వేల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి తడి బట్టలతో గుడి ఎదుట పొర్లు దండాలతో, సాష్టాంగా నమస్కారాలతో వరం పడుతుంటారు. దేవతా రూపాన్ని చేతపట్టుకుని గుడి బయటకు వచ్చిన పూజారులు వరం పడుతున్న వారి పై నుంచి నడిచి వెళతారు. ఆ వరాలతల్లి , కల్పవల్లి సారలమ్మే తమ పై నుంచి నడిచి వెళ్తుందని భక్తుల్లో నమ్మకంఉంది. సారలమ్మను గిరిజన పూజారి (వడ్డె) మోస్తుంటే వారివెంట ట్రస్టు కమిటీ, ప్రజా ప్రతినిధులు వెంట నడుస్తారు. అతడిని దేవదూతగా భావిస్తారు. కన్నెపల్లి గ్రామ ఆడపడుచులు, మహిళలు హారతులు ఇచ్చి, నీళ్లు ఆరబోసి కొబ్బరికాయలు కొట్టి సారలమ్మను మేడారానికి సాగనంపుతారు.



చిలుకలగుట్ట



తల్లిని తాకాలనే తపనతో భక్తులు

కన్నెపల్లి నుంచి మేడారానికి బయలుదేరిన సారలమ్మను తాకాలనే తపనతో భక్తులు ఎగబడుతుంటారు. వారిని నిలువరిం చేందుకు వందల సంఖ్యలో పోలీసులు వలయంగా ఏర్పడి రక్షణ కల్పిస్తారు. అక్కడి నుంచి సారలమ్మ జంపన్న వాగు మీదుగా మేడారంలోని గద్దెల వద్దకు చేరుకుంటుంది. సారలమ్మ జంపన్న వాగు(సంపెంగ) దాటుతున్న క్రమంలో వాగులో భక్తులు పుణ్యస్నానాలు చేస్తూ రెండు చేతులు పైకెత్తి అమ్మవారికి స్వాగతం పలుకుతారు. శివసత్తులు తన్మయంతో భక్తిపారవశ్యంతో ,పూనకాలతో ఊగిపోతారు. కాగా సారలమ్మ గద్దె పైకి రాక ముందే ఏటూర్‌నాగారం మండలంలోని కొండాయి నుంచి గోవింద రాజులను , కొత్తగూడ మండలంలోని ప ూను గోండ్ల నుంచి పగిడిద్ద రాజును అటవీ మార్గం మీదుగా కాలినడకన మేడారానికి తీసుకువచ్చి గద్దెల పై ప్రతిష్టిస్తారు. సారలమ్మ సహా వీరిని తీసుకువచ్చే ముగ్గురు వడ్డెలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. అనంతరం వారి వారి గద్దెల పై ప్రతీష్టింప జేస్తారు. ఇది మొదటి రోజు మహాఘట్టం

కంకవనం తోడుగా కుంకుమ భరిణెలో గద్దెలకు పయనం

ఫిబ్రవరి 1 సమ్మక్క తల్లి ఆగమనం

మహాజాతరలో రెండో రోజు ఫిబ్రవరి 1న సమ్మక్క తల్లి సాయంత్రం గద్దెపైకి వస్తుంది. గురువారం ఉదయం ఆరు గంటల నుంచే పూజా కార్యక్రమాలు మొదలవుతాయి. మొదటగా గిరిజన పూజారులు (వడ్డెలు) మేడారం సమీపంలోని చిలకల గుట్టకు వెళ్ళి కంకవనం (వెదురు కర్రలు) తెచ్చి గద్దెల పై పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం సమ్మక్క పూజా మందిరం నుంచి పసిడి కుండ లను తెచ్చి గద్దెల పై నెలకోల్పుతారు. తర్వాత మళ్ళీ చిలుకలగుట్టకు వెళ్తారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సమ్మక్కను గద్దె పైకి తీసుకువచ్చే మహాఘట్టం మొదలవుతుంది. చిలుకలగుట్ట పై కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెచ్చేందు కు పూజారులు బయలుదేరుతారు. మహాజాతరకు ఇదే అత్యంత ప్రధాన ఘట్టం. సమ్మక్క ఆగమనం కోసం లక్షలాది మంది భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆసక్తిగా ఎదురుచూస్తారు. సమ్మక్క కొలువైన ప్రదేశానికి చేరుకుని పూజారులు అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. తల్లి రూపాన్ని చేతపట్టుకున్న మరుక్షణమే ప్రధాన వడ్డె (పూజారి) తన్మయత్వంతో పరుగు పరుగున గుట్ట దిగుతాడు. అక్కడ వంద లాది మంది పోలీసులు వలయంగా ఏర్పడి రక్షణగా ఉంటారు. జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ తుపాకితో గాల్లోకి కాల్పులు జరిపి వనదేవతకు ఆహ్వానం పలుకుతారు. సమ్మక్క రాకతో మేడారం మొత్తం శివ సత్తుల పూనకాలతో హోరెత్తి ఊగిపోతుంది. దారి పొడవున భక్తుల జన ప్రవాహం తల్లికి స్వాగతం పలుకుతూ జాతర అంతటా కోళ్ళు, మేకలతో మొక్కులు (బలులు)ప్రారంభ మవుతాయి. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న భక్తులు , శివసత్తులు తన్మయత్వంతో పూనకాలతో ఊగిపోతుంటారు. గద్దెల వద్దకు సమ్మక్క చేరే క్రమం లో భక్తులు ఆలయం ఎదురుగా ఎదురుకోళ్ళతో స్వాగతం పలుకు తారు. దేవతను పట్టుకున్న వడ్డెను తాకే ప్రయత్నిం చే క్రమంలో జనాన్ని అదుపు చేయడం కష్టాసాధ్యమైనపని. సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు అనంతరం కుంకుమ భరణిని గద్దెల పైకి చేర్చు తారు. అనంతరం మహా జాతర లాంఛనంగా ప్రారంభ మవుతుం ది.గద్దెల పై ఆశీనులైన గిరిజన ఆరాధ్యదైవాలు, అడవి తల్లుల (తల్లీ బిడ్డలు)ను దర్శించుకునేందుకు భక్తులు లక్షలాధిగా భారులు తీరుతారు. ఇది మహా జాతర ప్రధాన ఘట్టం.

ఫిబ్రవరి 2 జాతర మూడవ రోజు

గద్దెల పైన ఆసీనులుకానున్న వన దేవతలు

గద్దెల పైకి సమ్మక్క -సారమ్మ వన దేవతలు ఆసీనులైన మూడవ రోజు శుక్రవారం అశేషభక్తజనానికి దర్శనమిస్తారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారు. కోరిన కొర్కెలు తీర్చమని తల్లులను వేడుకుంటారు. కొర్కెలు తీరిన వారు అమ్మావార్లకు కానుకలు చెల్లిస్తారు. నిలువుదోపిడి, నైవేధ్యాలు సమర్పిస్తారు. వన దేవతలను ఆడపడుచులుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, చీరె , సారె, పెడతారు. ఒడి బియ్యం పోస్తారు. తలనీలాలు సమర్పించు కుంటారు. ఎత్తు బంగారం నైవేధ్యాలుగా పెడతారు. అత్యంత భక్తితో ఉరకలేస్తున్న జనంతో మేడారం పరిసరాలు సందడిగా మారు తాయి. ఈ రోజంతా లక్షలాది మంది గద్దెల వద్దకు చేరుకుని అమ్మ వార్లను దర్శించుకుని పునీతులవుతారు. జాతరలో మేడారానికి ఈ మాడవ రోజు లక్షల్లో భక్తులు జాతరకు వస్తారు.

జాతరలో నాలుగవ రోజు శనివారం సమ్మక్క ను చిలకల గుట్టకు , సారలమ్మను కన్నెపల్లికి , గోవింద రాజును కొండాయికి , పగిడిద్ద రాజును పూనుగొండ్లకు కాలినడకన తీసుకెళ్తారు. ఇలా దేవతలు వన ప్రవేశం చేయ డంతో మహాజాతర ముగుస్తుంది. కనులారా వీక్షించి మొక్కు లు తీర్చుకునేందుకు వచ్చిన అశేష భక్తజనానికి దర్శనమిచ్చిన శ్రీ సమ్మక్క -సారలమ్మలు నాలుగో రోజు సాయంత్రం తిరిగి వన ప్రవేశం చేస్తారు. సాయంత్రం నాలుగు నుంచి ఆరు

నాలుగోరోజు చివరి ఘట్టం

గంటల సమయంలో ఈ ప్రక్రియ ముగుస్తుంది. సమ్మక్క చిలకలగుట్ట పైకి, సారలమ్మ కన్నెపెల్లికి తరలివెళ్ళిన తర్వాత భక్తులు తిరుగు పయణమవుతారు. అప్పటి వరకు భక్తజన సంద్రంగా ఉన్న మేడారంలో భక్తుల సందడి తగ్గుతుంది. మళ్ళీ రెండెళ్ళపాటు భక్తులు తల్లుల రాక కోసం వేచి చూస్తుంటారు. ఈ నాలుగు రోజులు మేడారం మహాజాతరకు లో అత్యంత వీశీష్టమైన రోజులు.

విశ్వవ్యాప్తం.. మేడారం జాతర

శాసన సభ స్పీకర్ మధుసుధనాచారి

భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర విశ్వవ్యాప్తంగా కీర్తి గడించిందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూధనచారి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క -సారలమ్మ తల్లులను శనివారం వారు దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఎత్తు బంగారాన్ని తూచగా వంద కిలోలు వచ్చిందని, గత జాతరలో 110 కిలోల బంగారాన్ని అమ్మవార్లకు సమర్పిం చడం జరిగిందని ఈ సందర్భంగా స్పీకర్ తెలిపారు. మేడారం ట్రస్టు బోర్డు కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు స్పీకర్‌ను గిరిజన సంప్రదాయాల ప్రకారం మేళతాళాలతో గద్దెల వద్దక ు తీసుకువెచ్చి పట్టు శాలువాలతో ఘనంగా సన్మానం చేసి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. అనంతరం ఆయన గద్దెల ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క - సారలమ్మల ఖ్యాతి ప్రపంచ దేశాలలో మార్మోగు తున్నదన్నారు. వివిధ దేశాల నుంచి సమ్మక్క - సారలమ్మ తల్లులను దర్శించుకోవడానికి భక్తులు తరలి వస్తున్నా రన్నారు. తాను చిన్నపుడు ఎడ్లబండిలో మేడారం జాతరకు వచ్చే వాడినని ఈ నెల 31న కుటుంబ సమేతంగా మళ్ళీ ఎడ్లబండి పై రావాలని ఆశగా ఉందని వారన్నారు. పరిస్థితులు అనుకూలిస్తే , పోలీసు అధికారులు అనుమతి ఇస్తే ఎడ్లబండి కోరిక తీర్చుకుంటానన్నారు. తెలంగాణ ప్రభుత్వం సమ్మక్క -సారలమ్మ జాతరకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి నిధులను కేటాయించడం జరిగిందన్నారు. గడిచిన నాలుగేళ్ళలో రెండు జాతరలు వచ్చాయని ఈ జాతరలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.240 కోట్లు కేటాయించి పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. జాతరలో అన్ని హైటెక్ హంగులు కల్పించడం జరిగిందని, పోలీసు భద్రత కూడా భక్తుల సంఖ్యను బట్టి పెంచడం జరిగిందని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ సమస్య25 లక్షల మంది భక్తులు తలెత్తకుండా ప్రణాళిక బద్దంగా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. జాతరలో నిర్మించి గిరిజన మ్యూజీయం అద్భుతంగా ఉందని అన్నారు. హరిత హోటల్ ఏర్పాటు, ఆధునిక గుడారాలు ఏర్పాటు చేయడం జాతరలో అదనపు ఆకర్షణ అన్నారు. సమ్మక్క - సారలమ్మ జాతరను ప్రాధాన్యతను ప్రాచుర్యంలోకి తీసు కురావాల్సిన బాధ్యత మీడియాలదే అన్నా రు. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరతో పాటు జిల్లాలో మరో 50 వరకు ఉన్నాయని గుర్తు చేశారు. మేడారం జాతరకు కోటీ 24 హాజరవుతున్నారని అధికారులు అంచనా వేస్తున్నారని అన్నారు. జిల్లాలోని చిన్న చిన్న జాతరలను కలుపుకుంటే తల్లులను దర్శించుకునే వారి సంఖ్య రెండు కోట్లకు పైగానే ఉంటుందని వారన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర రెండేళ్లకొకసారి నాలుగు రోజులు మాత్రమే ఉంటుందని అన్నారు .గత రెండు మూడు జాతరల నుంచి నెల రోజుల ముందు నుంచే తల్లులను భక్తులు దర్శించుకుంటు న్నారన్నారు. రానున్న రోజుల్లో ఎప్పటికి (నిత్యం) జాతర జరిగే పరిస్థితులు ఉంటాయని అన్నారు. లక్నవరం సరస్సు రిజర్వాయర్ మారుస్తున్నామని ఆ తర్వాత జంపన్న వాగులో ఎప్పటికి నీరు ఉంటుందని అన్నారు. రానున్న రోజుల్లో మేడారం వైపు ప్రపంచ దేశాల భక్తులు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కర్ణన్, జాయింట్ కలెక్టర్ అమయ్‌కుమార్, సబ్ కలెక్టర్ వి.పి. గౌతమ్, మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్ కాకా లింగయ్య, ఆలయ ఈఓ రమేష్ బాబు తదితరులున్నారు.

మీడియా పాయింట్ ప్రారంభం

మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ మహాజాతరలో పౌర సంబంధాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌ను శనివారం రాష్ట్ర శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూధనచారి ప్రారంభించారు. గిరిజన దేవతలు సమ్మక్క- సారలమ్మ లకు అంతర్జాతీయ ఖ్యాతి ఉందని అన్నారు. ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా మూలంగా మేడారం జాతరకు విశిష్ట ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు. గతంలో లక్షల్లో వచ్చే భక్తులు ఈ జాతరకు కోటి 20 లక్షలు వస్తారని, ప్రపంచం లోని అన్ని దేశాల నుంచి సమ్మక్క - సారమ్మ తల్లులను దర్శించుకునే అవకాశం ఏర్పడాలంటే ఆ స్థాయిలో కవరేజీలు పత్రికల్లో , ఎలక్ట్రానిక్ మీడియాలో ఉండాలని అన్నారు. 2020 జాతరకు రూ.2 కోట్లు భక్తులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కలెక్టర్ కర్ణన్, జాయింట్ కలెక్టర్ అమయ్ క ుమార్, భూపాలపల్లి ఆర్డీఓ వీరబ్రహ్మచారి, పౌర సంబంధాల డీడీ జగన్‌లు పాల్గొన్నారు.



మహాజాతర ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

సమ్మక్క - సారలమ్మ మహాజాతర ప్రత్యేక సంచికను రాష్ట్ర శాసన సభ స్పీకర్ సిరికొండ మధు సూధనచారి శనివారం మీడియా పాయింట్ కార్యా లయంలో ప్రారంభించారు. అనంతరం స్పీకర్ మాట్లా డుతూ ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర సమ్మక్క - సారలమ్మ జాతర అని అన్నారు. మహావిశ్వ జాతర ను తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభ వంగా నిర్వహిస్తుం దని అన్నారు. గత రెండు జాతరలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 240 కోట్లను కేటాయించి అభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. మహి మగల తల్లులను దర్శించు కోవడానికి దేశ విదేశాల నుండి భక్తులు తరలి వస్తు న్నా రని వారన్నారు. జాతర ప్రాముఖ్యతను తెలిపే విధంగా ప్రత్యేక సంచిక తీసుకు రావడం అభినంద నీయమని అన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ కర్ణన్, జాయింట్ కలెక్టర్ డి. అమయ్ కుమార్ , ఆర్డీఓ వీర బ్రహ్మా చారి, పౌరసం బంధాల సంచాలకులు జగన్ తదితరులున్నారు.



జాతరకు 16 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మేడారం జాతరకు దక్షిణ మధ్య రైల్వే 16 ప్రత్యేక రైళ్లు నడిపించబోతుంది. సికింద్రాబాద్ - వరంగల్ - హైదరాబాద్, కాజీపేట - సిర్పూర్ కాగజ్ నగర్ - కాజీపేట, సిర్పూర్ కాగజ్ నగర్ - ఖమ్మం - సిర్పూర్ కాగజ్ నగర్ మధ్యన ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నామని దక్షిణ మధ్యరైల్వే ప్రకటిం చింది. ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నారు. మార్గమధ్యలో ఈ రైళ్లు మౌలాలి, చర్లపల్లి, ఘట్ కేసార్, బీబీనగర్, భువన గిరి, రాయిగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగాం, రఘునాథ్‌పురం, ఘన్ పూర్, పిండియాల్, కాజీపేట స్టేషన్లలో నిలుపుదల చేయడం జరుగుతుంది. సికింద్రా బాద్ - వరంగల్ ప్రత్యేక రైళ్లు జనవరి 31, ఫి బ్రవరి1, 2, 3, తేదీల్లో సికింద్రాబాద్ నుండి 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు 15.40 గంటలకు వరంగల్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో జనవరి 31, ఫిబ్రవరి 1, 2, 3, తేదీల్లో వరంగల్ నుండి 17.45 గంటలకు బయలుదేరి అదే రోజు 21.30 గంటలకు హైదరాబాద్ చేరుకుం టాయి. కాజీపేట - సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రత్యేక రైళ్లు జనవరి 31న కాజీపేట నుండి 19.00 గంటలకు బయలుదేరి అదే రోజు 23.00 గంటలకు సిర్పూర్ కాగజ్ నగర్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్ నగర్ నుండి 05.30 గంటలకు బయలుదేరి అదే రోజు 09.00 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. ఈ రైలు మార్గమధ్యలో హసన్‌పర్తి, ఉప్పల్, జమ్మికుంట, బిస్గురు ఫరీఫ్, పోత్కపల్లి, ఓదేలా, కొలనూరు, పెద్దపల్లి, రాఘవాపురం, రామ గుండం, పెద్దంపేట, మంచి ర్యాల, రవీంద్రఖని, మంద మర్రి, బెల్లంపల్లి, రేపల్లె వాడ, అసీఫాబాద్, రాలపేట స్టేషన్లలో నిలుపుదల చేయ డం జరుగుతుంది. సిర్పూర్ కాగజ్ నగర్ - ఖమ్మం ప్రత్యేక రైలు కాగజ్ నగర్‌లో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో కాగజ్ నగర్ లో 05.30 గంటలకు బయలుదేరి అదే రోజు 11.15 గంటలకు ఖమ్మం చేరుకుంటుంది. తిరు గు ప్రయాణంలో ఖమ్మంలో 1, 2, 3 తేదీల్లో 16.45 గంటలకు బయలు దేరి సిర్పూర్ కాగజ్ నగర్ కు 23.00 గంటలకు చేరుకుం టుంది. మార్గ మధ్యలో రాలపేట, అసీఫాబాద్, రేపల్లెవాడ, బెల్లంపల్లి, మంద మర్రి, రవీంద్రఖని, మంచి ర్యాల, పెద్దంపేట, రామ గుండం, రాఘవాపురం, పెద్దపల్లి, కొత్తపల్లి, కొలనూ రు, తదితర స్టేషన్లలో నిలుపుదల చేయడం జరుగుతుంది.

మేడారం జాతరకు సర్వం సిద్ధం

- ముందస్తు మొక్కులకు పోటెత్తుతున్న భక్తులు
- 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు మహాజాతర
- 1.20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- 2 న జాతరకు ఉప రాష్ట్రపతి, సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మల జాతరకు సర్వం సిద్ధమైంది. ఈనెల 31నుండి ఫిబ్రవరి 3వతేదీవరకు జరిగే ఈ మహా ఉత్సవానికి ప్రభుత్వం అన్నిఏర్పాట్లు పూర్తిచేసింది. ముందస్తు మొక్కలు చెల్లించేందుకు ఇప్పటికే భక్తజనం పోటెత్తగా, గత రెండు రోజులుగా రద్దీ పెరిగింది. ఇప్పటికే లక్షల్లో భక్తులు తరలివస్తుండగా, మహాజాతరకు కోటి ఇరవైలక్షలమంది భక్తులు హాజరవుతారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. బంగారంగా కొలిచే బెల్లాన్ని మొక్కుబడిగా చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుండగా, పసుపు కూడా మొక్కుబడిగా చెల్లిస్తారు. ఈసారి జాతరకు మరిన్ని ఆధునిక హంగులు సమకూర్చగా, ఎక్కడికక్కడ సిసికెమెరాలు ఏర్పాటుచేసి పటిష్టభద్రతను కల్పించారు. ఈ సారి జాతరకు ఫిబ్రవరి 2న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రానున్నారు. తొలిసారి ఉప రాష్ట్రపతి మహాజాతరను కళ్ళారా చూడనుండడం ఈ సారి జాతర ప్రత్యేకత.

జాతరకు రూ.80.55కోట్లు

ప్రభుత్వం తరుపున ఈ ఏడాది జాతరకు రూ.80.55కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.170కోట్లు కేటాయించి శాశ్వత ప్రాతిపదికన రహదారులు, షాపింగ్‌కాంప్లెక్స్‌లు ఏర్పాటుచేసినం దున ఈసారి బడ్జెట్ తగ్గించినట్లు అధికారవర వర్గాలు వివరిస్తున్నాయి. గతానికంటే భిన్నంగా ఈసారి లగ్జరీటెంట్లు, మరుగుదొడ్లు, కార్పెట్ సౌకర్యాలు ఏర్పాటుచేశారు. రూ.3కోట్లతో గిరిజన మ్యూజియం నిర్మించగా, 10హరిత కాటేజీలు నిర్మించగా.. ఆదివాసీ నృత్యప్రదర్శనలు, చిత్రప్రదర్శనకు హంపి థియేటర్‌ను నిర్మిస్తున్నారు. భక్తులకోసం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో మూడు హెలికాప్టర్లు నడిపి స్తున్నారు. తొలిసారి కొత్తటెక్నా లజీతో సిసికెమెరాలు, డ్రోన్‌లు, యాప్‌లను వాడు తోంది. అన్ని శాఖలను కలుపు కుని 38సెక్టా ర్లుగా జాతర ప్రాంగణాన్ని విభజించగా, సింగరేణి 10లక్షల వాటర్ బాటిల్స్, జెన్‌కో 10లక్షల వాటర్ బాటిల్స్, ఆర్టీసి 5లక్షల వాటర్ బాటిల్స్ ఉచితంగా అందిస్తోంది.

పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రం నలుమూలల నుండే కాక.. వివిధ రాష్ట్రాల నుండి భక్తులు మేడారం జాతరకు వెల్లువెత్తను న్నందున వీటిని దృష్టిలో పెట్టుకుని పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. 35ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్ చేయాలని నిర్ణయించగా, జాతర పరిసరాల్లో వందకు పైగా చెత్తకుండీలు, చెత్తసేకరణకు 3600మంది కార్మి కులను ఏర్పాటుచేశారు. ఏటేటా జాతర వైభవం విస్తరిస్తుం డగా, జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్రప్రభుత్వం కోరుతోంది.



గిరిజన సంప్రదాయ డోలు వాయిస్తున్న స్పీకర్

హత్యతో టీఆర్ఎస్‌కు సంబంధం లేదు

● కాంగ్రెస్ అబద్ధపు ఆరోపణలు: ఎమ్మెల్సీ కర్నె



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నల్లగొండ మునిసిపల్ చైర్మన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో టిఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌తో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా దానిని టిఆర్ఎస్‌కు ఆపాదించడం కాంగ్రెస్ దివాళా కోరు రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలి రాష్ట్ర రాజకీయాలను భ్రష్టుపట్టించే విధంగా ఉందన్నారు. నేరెళ్ళలో ప్రమాదవశాత్తు లారీ కింద పడి చనిపోయిన ఘటన, ఖమ్మం జిల్లాలో కుటుంబకలహాల వల్ల జరిగిన హత్య నుండి తాజాగా నల్లగొండ జిల్లాలో జరిగిన శ్రీనివాస్ హత్య వరకు కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్‌కు అంటగడుతూ ప్రచారం చేయడం దారుణమన్నారు. హతుడు శ్రీనుతో టిఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధంలేదని, ఆయన ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి శిష్యుడని, హత్యచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాంబాబు, మల్లేష్, శరత్‌లో కోమటిరెడ్డి శిష్యబృందంలో సభ్యులేనన్నారు. ఉత్తమ్, జానా, విహెచ్‌లు శవరాజకీయాలకు తెరలేపారన్నారు. ఈ ఘటనతో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశంకు సంబంధం ఉన్నట్లు అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నేరచరితులకు స్నేహహస్తం అందించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనన్నారు. శ్రీనివాస్ హత్యకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని, అవసరమైతే న్యాయవిచారణ జరిపించి వాస్తవాలు వెలుగులోకి తేవాలన్నారు.

టీఆర్ఎస్‌వి హత్యా రాజకీయాలు

● శ్రీనివాస్ హత్యపై సీబీఐ విచారణ జరిపించాలి ● డీజీపీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు ● కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిరుమర్తి లింగయ్యకు బెదిరింపులు వస్తున్నాయి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● హత్య వెనుక ఎమ్మెల్యే వీరేశం: కోమటిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికార టీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. నల్లగొండ పట్టణంలో కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను కిరాతకంగా హత్య చేశారని పేర్కొన్నారు. శ్రీను హత్య వెనుక నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం హస్తం ఉందన్నారు. శ్రీనివాస్ హత్య విషయంపై శనివారం డీజీపీ మహేందర్ రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ, సీనియర్ నేత వి. హనుమంతరావు, మాజీ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గీతారెడ్డి, ఎమ్మెల్సీలు రాజగోపాల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీ పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి, మల్లు రవి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు కలిశారు.

కాంగ్రెస్ నాయకుడు శ్రీను హత్యపై సీబీఐ విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని వినతిపత్రం అందజేశారు.

'రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదు'

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పోలీసుల జులంతో ప్రజలను అణిచివేయాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. సిద్దిపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ బూటకపు హామీలతో గద్దెనక్కిన కేసీఆర్.. ఇప్పుడు ఏ ఒక్కరికి కూడా న్యాయం చేయడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలతో పాటు రైతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళితులు, బీసీలు ఇసుక మాఫియా ముఠాతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ.. తన కార్యాలయంలో ఉపవాస దీక్ష చేస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పట్టారని మండిపడ్డారు. టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ తన నివాసంలో దీక్ష చేస్తే తలుపులు పగులకొట్టి అరెస్టు చేశారని ఆయన విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను హింసిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటకు చెందిన భూపతిరెడ్డి పార్టీలో చేరగా ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ ఎం. రంగారెడ్డి, వీవర్స్‌సెల్ చైర్మన్ శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, గంప మహేందర్, ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే వీరేశం నుంచి బెదిరింపుల ఫోన్‌కాల్స్ వచ్చాయని, తనకు ప్రాణహాని ఉందని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. సీఎం చంద్రశేఖర్‌రావు, మంత్రి జగదీశ్‌రెడ్డి అండ చూసుకుని ఎమ్మెల్యే వీరేశం అక్రమాలకు, నేరాలకు పాల్పడుతున్నారని ఉత్తమ్ వివరించారు. టీఆర్ఎస్‌లో చేరని వారిపై బెదిరింపులకు పాల్పడుతూ చివరకు హత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ తెచ్చుకున్నది హత్యా రాజకీయాలకేనా..? అని ఆయన నిలదీశారు. శ్రీనివాస్ హత్యపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, వారికి భద్రత పెంచాలని ఆయన కోరారు.

శ్రీను హత్యపైన టీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. హత్యలు చేసుకుంటూ పోతే చివరకు కత్తులే మిగులుతాయని ఆయన హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కొలేక.. సీఎం కేసీఆర్ హత్యలను ప్రోత్సహిస్తున్నాడని ఆయన మండిపడ్డారు. తమ సహనాన్ని పరీక్షించొద్దన్నారు.



హత్యా రాజకీయాల కోసం తెలంగాణ రాలేదని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. నయీమ్ వలే ఎమ్మెల్యే వీరేశం బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్న సర్కార్

● పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్



రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను, భావ ప్రకటన స్వేచ్ఛను నులిమేయాలనుకోవడం సిగ్గుచేటని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావణ్‌కుమార్ దుయ్యబట్టారు. తెలంగాణలో అణిచివేతల పాలన సాగుతోందని మండిపడ్డారు. కేసీఆర్ ఏ భాష మాట్లాడిన వేద వాక్కులు.. ఇతరులు మాట్లాడితే తిట్ల కిందికి వస్తుందా..? అని ఆయన నిలదీశారు. సోషల్ మీడియాపై ఆంక్షలు విధించడం దుర్మార్గమన్నారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. సోషల్ మీడియాతో దేశంలో గొప్ప మార్పులు జరుగుతుంటే.. సీఎం చంద్రశేఖర్‌రావు మాత్రం సోషల్ మీడియాపై ఆంక్షలు పెట్టడం సిగ్గు చేటన్నారు. 506, 507 సెక్షనులతో సోషల్ మీడియాను అడ్డుకోవడం నియంతృత్వమే అవుతోందన్నారు. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవాలనుకునే ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. తప్పులు చేయడం న్యాయస్థానాల నుంచి మొట్టికాయలు వేయించుకోవడం ఈ ప్రభుత్వానికి పారిపాటిగా మారిందన్నారు. 506, 507 సెక్షన్‌లను నాన్ కాగ్నిజబుల్ చట్టాలుగా మార్పు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా పాలకులకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాతో పోస్టులు చేసిన అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మోసాలు బయటపడొద్దనే సీఎం కేసీఆర్ ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

అన్నివర్గాలకు సమతుల్య ఆహారం



తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చందూలాల్ తదితరులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత రాచరిక పాలనలో పేదలకు రుచికరమైన, పోషక విలువలు కలిగిన ఆహారం లభించేది కాదనీ, ప్రస్తుత తరుణంలో అన్ని వర్గాలకు సమతుల్య ఆహారం అందుతోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ అన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పేదలకు కూడా మంచి ఆహారం లభిస్తోందని చెప్పారు. దేశంలో అత్యుత్తమ బిర్యానీ హోటల్స్‌కు హైదరాబాద్‌కు చెందిన ఆరు రెస్టారెంట్లను వాల్‌స్ట్రీట్ జర్నల్ గుర్తించి ఈ మేరకు ఒక వ్యాసం ప్రచురించింది. ఈ జర్నల్‌కు ఎంపికైన ఉత్తమ రెస్టారెంట్ యాజమాన్యాలను తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ శనివారం సన్మానించింది. ఈ కార్యక్రమంలో మంత్రి చందూలాల్ ముఖ్య అతిథిగా పాల్గొని వారిని సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచ గుర్తింపు రావడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో కూడా తెలంగాణ ప్రవాసులకు హైదరాబాద్ బిర్యానీ రుచి చూపించామని గుర్తుచేశారు. తెలంగాణలో అతిథులకు బిర్యానీ పెడితేనే ఆహ్వానం పలికినట్లుగా భావిస్తారని, ఈ నేపథ్యంలో హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచ గుర్తింపు రావడంతో పర్యాటక రంగానికి ఇది ఎంతగానో దోహద పడుతుందని చందూలాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్ అసిసోయేషన్ ప్రెసిడెంట్ ఎస్.వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.జగదీష్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఎమ్మెల్యేల నూతన భవనాలు ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదర్‌గూడలోని నూతనంగా నిర్మించే శాసన సభ్యుల భవనాల పనులను శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, స్పీకర్ మధు సూదనచారి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తుమ్మల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే భవనాలను ఫిబ్రవరి నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలకు 120 క్వార్టర్, మరో 120 సర్వెంట్ క్వార్టర్స్ కాగా స్టాఫ్‌కు 26 క్వార్టర్లు నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 70 ఎమ్మెల్యే క్వార్టర్ పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన 50 ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను వచ్చే నెలలో పూర్తి చేయనున్నట్లు మంత్రి తుమ్మల వివరించారు.



నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యేల క్వార్టర్లను పరిశీలిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మంత్రి తుమ్మల

రాజ్యాంగ ద్రోహం చేస్తున్న కేసీఆర్

● మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణమాదిగ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగ ద్రోహానికి పాల్పడుతోందని, దళితులకో న్యాయం, దొరలకో న్యాయంగా పాలన సాగిస్తోందని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. దళితుడు బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని దొరలు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారని, రాజ్యాంగం ప్రకారం దళితులకు న్యాయం జరగడంలేదని శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ (టిజెయు) నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. టిజెయు అధ్యక్షుడు కప్పర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంద కృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, ఆ నలుగురికి తప్ప ఇతరులెవరికీ ప్రజాస్వామ్యం రాజ్యాంగ పరమైన హక్కులు, స్వేచ్ఛా స్వతంత్ర్యాలు వర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి 1500 రోజులవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మాదిగ బిడ్డ భారతి చనిపోయిన తర్వాత రెండు రోజుల్లో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్తానన్న కెసిఆర్ రెండు నెలలైనా స్పందించడం లేదని, ఇదేమని ప్రశ్నిస్తే ఒకే నెలలో రెండు సార్లు నిర్బంధించి జైల్లో పెట్టారన్నారు. విగ్రహాల విధ్వంసం, అధికారులపై దాడి తదితర నేరాలపై కెసిఆర్, కెటిఆర్, కవిత, హరీష్‌రావులపై కేసులు నమోదైనావారిని ఇప్పటికీ అరెస్టు చేయకపోవడర ఒకటైతే, నాన్ బెయిలబుల్ కింద కేసులు నమోదైనా వారిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. మరోపక్క స్టేషన్ బెయిల్ ఇవ్వాలని కోర్టులు చెప్తున్నా పోలీసులు మాత్రం తనని నిర్బంధించి రిమాండ్‌కు పంపడం గమనిస్తుంటే దళితులకు న్యాయం జరగడం లేదన్నది స్పష్టమవుతుందన్నారు. తాను నిరాహార దీక్షకు దిగి ఒక్క నిమిషం కాకముందే పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టారని, అదే కేసిఆర్ 10 రోజులు దీక్ష చేస్తే పోలీసులు దగ్గరుండి ఇంటికి పంపించారని గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ యాత్ర చేస్తానంటే అనుమతించి పోలీసులు దగ్గరుండి యాత్రను నిర్వహించేందుకు సహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ అణచివేత ధోరణికి నిరసనగా సోమవారం హైదరాబాద్‌లో అఖిలపక్ష నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బిజెపి నుంచి లక్ష్మణ్, టిడిపి నుంచి ఎల్. రమణ, సిపిఐ నుంచి చాడ వెంకట్‌రెడ్డి, సిపిఎం నుంచి తమ్మినేని వీరభద్రంలు పాల్గొంటున్నారన్నారు. టిఆర్ఎస్ నుంచి ఎవరు వస్తున్నారని అడుగగా ఆ పార్టీ నేత కెసిఆర్ తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు.

చరిత్రను ప్రతిబింబించేది ఛాయాచిత్రమే

● తెలంగాణ చరిత్ర, జీవనశైలిని సజీవంగా చిత్రించిన జర్నలిస్టులు: మండలి చైర్మన్ స్వామిగౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జరిగిన వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించి తరతరాలకు అందించేది ఛాయాచిత్రమేనని తెలంగాణ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. తెలంగాణ చరిత్ర కూడా ఛాయా చిత్రంతోనే ప్రపంచానికి తెలిసిందని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, ప్రజల జీవనశైలిని చిత్రీకరించడం ఒక అద్భుతమైన కళ అని ఆయన పేర్కొన్నారు. ఫోటో జర్నలిస్టులు చిత్రీకరించిన తెలంగాణ చరిత్ర, ప్రకృతి, జీవనశైలిని సజీవంగా, అపురూప దృశ్యాలుగా ఉన్నాయని ఆయన అన్నారు.

శనివారం శాసన మండలిలోని తన కార్యాలయంలో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ సంఘం రూపొందించిన 2018 నూతన సంవత్సర మల్టీకలర్ క్యాలెండర్‌ను స్వామిగౌడ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ గొప్ప చరిత్ర, ప్రకృతి అందాలను, బహుళ సంస్కృతి ప్రతిబింబిస్తున్న చిత్రాలను రాష్ట్రంలోని వివిధ దినపత్రికల్లో పని చేస్తున్న ఫోటో జర్నలిస్టులు తీసిన చిత్రాలు ఈ క్యాలెండర్‌లో అద్భుతంగా పొందుపరిచారని, ఇవి ప్రజలను అమితంగా ఆకర్షిస్తాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ఇకముందు కూడా దాగి ఉన్న తెలంగాణ చరిత్ర, ప్రకృతి అందాలు, జీవనశైలి వెలికితీసి తమ చిత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఫోటో జర్నలిస్టులను ఉద్బోధించారు.

కార్యక్రమంలో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.నరహరి, ఉపాధ్యక్షులు టి.కిషోర్ సింగ్, కోశాధికారి కె.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాసులు, అలీముద్దీన్, పి.మోహనచారి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ సమస్యలపై మోడీని కలుద్దాం

● రైతు సమస్యలపై పోరాడతా: అండగా ఉండండి

● అభివృద్ధి కోసం తెలుగు రాష్ట్రాల సీఎంలతో చర్చిస్తా: జనసేన అధినేత పవన్ కళ్యాణ్



రైతులను ఆప్యాయంగా పలకరిస్తున్న పవన్ కళ్యాణ్

అనంతపురం, ప్రభన్యూస్ బ్యూరో: నేను జీవిత ప్రయాణికున్ని. అనునిత్యం ప్రజాసమస్యల కోసమే పనిచేస్తా. రైతు కష్టం, యువత ఆశయం నాకుతెలుసు. సీమపట్ల ప్రేమ, కరవుపట్ల బాధ్యత తెలిసినవాన్ని. ప్రజాసమస్యల పట్ల త్రికరణ శుద్ధితో పనిచేయాలన్న లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. నాకు అండగా మీరు వుండండి. మీ సమస్యల పరిష్కారానికి నేను ఆఖరి శ్వాసవరకు పోరాడుతానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఛలోరె.. ఛలోరె.. ఛల్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన అనంతపురంజిల్లాలో పర్యటించారు. ఉదయం 10గంటలకు జిల్లా సరిహద్దులోని గుత్తిలో ప్రవేశించగానే ఆయనకు కార్యకర్తలు, అభిమానులు అపూర్వస్వాగతం పలికారు. గుత్తిరోడ్డులో నిర్మిస్తున్న జనసేన పార్టీ కార్యాలయ భవనానికి భూమిపూజచేశారు.


సీమ సమస్యలపై నిపుణులు, మేధావులు, రైతులు, రాజకీయ నేతలను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రిని కలుస్తామన్నారు. సీమ అభివృద్ధికి ప్రత్యేకంగా ఏ చర్యలు తీసుకుంటారో ప్రధానమంత్రిని కోరదామన్నారు. కేంద్రంతోపాటు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సలహాలు తీసుకుని ముందుకెల్దామన్నారు. సమస్యలను శాంతియుతంగా సహృద్భావ సందర్భంలో పరిష్కరించుకోవాలన్నదే తన ఆకాంక్షని పేర్కొన్నారు. అనవసరంగా బజారున పడటం తనకు ఇష్టంలేదని, ఆ పరిస్థితి వస్తే అప్పుడు చూద్దామన్నారు. ఒకవేళ ఎవరైనా అలాంటి మాటల ద్వారా మీ మనస్సు మార్చడానికి ప్రయత్నిస్తే వారిపట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. తనపై ఎంత మంది దాడిచేసినా.. వెనకడుగు వేయనన్నారు. తాను రాబోయే 2019, 2024 ఆ తర్వాత ఎన్నికల కోసం ఓటు అడిగేందుకు రాలేదన్నారు. ఎపికి అండగా తానుంటానని భావిస్తే.. బలంగా ఓటు వేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో యువత నిర్ణయమే కీలకమని తాను విశ్వసిస్తానన్నారు.

రైతే రాజు కావాలి

రాయలసీమలో కరవు ప్రాలదోలేందుకు పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం వుందని జనసేన అధినేత అభిప్రాయపడ్డారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన అనంతపురంలోని కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ కరవు పరిస్థితులపై రైతులు, మేధావులతో చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా సీమలో కరవుకు కారణమైన అనేక సమస్యలను రైతులు, మేధావి వర్గాలు ఆయనకు వివరించాయి. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. సీమ ప్రాంతంలో సాగు, తాగు నీరు కీలకమన్నారు. వీటికోసం మరింత ప్రయత్నం జరగాల్సివుందని ఆశాభావం వ్యక్తపరిచారు. రైతు సమస్యలు పరిష్కరించేవారికి తాను అండగా ఉంటానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కేంద్రంలో అయినా.. రాష్ట్రంలో అయినా.. రైతులకు ఏమి చేస్తారు? ముఖ్యంగా అనంత జిల్లా నుంచి వలసలు నివారించేందుకు ఏమి చేస్తారో స్పష్టత ఇచ్చే పార్టీలకు తాను అండగా నిలుస్తానన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

● వ్యవసాయ అనుబంధ రంగాలపై మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతులు అదనపు ఆదాయాన్ని పొందే పశు సంపదను పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే దిశగా జీవాల ఆరోగ్య పరిరక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖలపై ఆయా ఆఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం వ్యవసాయ తర్వాత జీవాల పెంపకానికి అంతటి ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి సీఎం కేసీఆర్ చొరవతో రూ.5వేల కోట్ల వ్యయంతో చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేటివరకు 40 లక్షల గొర్రెలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పెరిగిన గొర్రెల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా ప్రతి పశు వైద్యశాలలో జీవాలకు అవసరమైన మందులు సక్రమంగా సరఫరా అవుతున్నాయా? లేదా? అనే విషయాన్ని పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

జీవాల వద్దకే వైద్యం తీసుకువెళ్ళాలనే లక్ష్యంతో 100 సంచార పశు వైద్యశాలలను గత ఏడాది సెప్టెంబర్ 15న ప్రారంభించామని తెలిపారు. 1962 కాల్‌సెంటర్‌కు వైద్యసేవల కోసం పెద్దమొత్తంలో కాల్స్ వస్తున్నాయన్నారు. కాల్‌సెంటర్‌పై ఒత్తిడి తగ్గించేందుకు సిబ్బందిని పెంచాలని, 1962 పరిధిలోకి ప్రధాన పశు వైద్యశాలలను అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 1962 పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత గొర్రెలకు నట్టల నివారణ మందును మూడు విడతలకు పెంచడం జరిగిందన్నారు. వచ్చే నెల నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. వేసవిలో జీవాలకు గ్రాసం కొరత ఏర్పడకుండా ఇప్పటినుండే ముందస్తు ప్రణాళికలను అమలు చేయాలని అధికారులకు సూచించారు.

రైతులను సొంత భూమిలో గడ్డిసాగు చేసే విధంగా ప్రోత్సహించాలని, సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేయాలని అన్నారు. అంతేకాకుండా చెరువుశిఖం భూములు, పశు సంవర్ధక, గొర్రెల అభివృద్ధి సమాఖ్యకు సంబంధించిన భూములలో సైతం గడ్డి పంపకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేసిన గొర్రెలన్నింటికి ఇన్సూరెన్స్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పశు సంవర్ధకశాఖలో భాగస్వాములుగా ఉన్న గోపాలమిత్రలకు కనీస భృతి చెల్లించేందుకు తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా చెల్లింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెలకు షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుందని, లబ్ధిదారులు 10శాతం వాటా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ ఏడాది రిజర్వాయర్లు, చెరువులలో 50 కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని, ప్రయోగాత్మకంగా 11 రిజర్వాయర్లలో 1.89 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేసినట్లు చెప్పారు. చేపలు విక్రయించుకునేందుకు మార్కెటింగ్ వైపు కూడా అధిక శ్రద్ధ చూపాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్, హోల్‌సేల్, రిటైల్ మార్కెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిధులకు కొరత లేదని, మార్కెట్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల కోసం జిల్లా కలెక్టర్లకు నివేదిక పంపించాలన్నారు. పర్యాటక ప్రాంతాలు, పార్కులు, హైవేలవెంట చేపల వంటకాల విక్రయాలు జరిగేలా కియోస్క్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయ డెయిరీ విక్రయాలు పెంచుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని, రాష్ట్రంలో వెయ్యి డెయిరీ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యాసంస్థలకు విజయ ఉత్పత్తులు సరఫరా అయ్యేలా చూడాలని మంత్రి తలసాని ఆదేశించారు.

ఈ సమావేశంలో పశు సంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, టిఎస్ఎల్‌డిఏ చైర్మన్ రాజేశ్వర రావు, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ నిర్మల, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, టిఎస్‌డిఏ సీఈవో డాక్టర్ మంజువాణి పాల్గొన్నారు.

పసికందు శరీరంలో బాంబు

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత విచారించగా ఆ బాంబులను చిన్నారి ద్వారా కాబూల్ నుంచి కుందూజ్‌కు తరలించినట్లు తెలిసింది. దీంతో తనిఖీలు చేపట్టిన అక్కడి సిబ్బంది కుందూజ్‌లోకి అక్రమంగా చొరబడాలని ప్రయత్నించిన ఐదుగురు ఉగ్రవాదులను అరెస్టు చేశారు. ఆ చిన్నారి శరీరానికి చుట్టి ఉన్న బాంబులను తొలగించి అతడిని కాపాడారు. తాలిబన్ ఉగ్రవాదులు ఇలా చిన్నారులతో ఉగ్ర కార్యకలాపాలు చేయించడం ఇదే తొలిసారి కాదని.. గతంలోనూ కొందరు చిన్నారులు ఏకంగా ఉగ్రదాడులకే పాల్పడ్డారని అక్కడి భద్రతా సిబ్బంది చెబుతున్నారు.

శునకానికి బంగారం మొక్కు..!

(మొదటిపేజీ తరువాయి)

ఎదురుగా సమ్మక్క - సారలమ్మకు మనుషుల ఎత్తు బంగారం ఇచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. కానీ కరీంనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సత్యనారాయణ తన కుటుంబ సభ్యుల్లో ఒకరిగా భావించే కుక్కకు నిలువెత్తు బంగారం అందించి మొక్కు చెల్లించుకున్నారు. కుక్క ఎత్తు బంగారం సమ్మక్క- సారలమ్మకు సమర్పించి అమ్మ కృప అందరిపై ఉండాలని భక్తులు మొక్కుకున్నారు. స్థానిక భరత్‌నగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనతో పలువురు భక్తులు ఒకింత ఆశ్చర్యానికి లోనుకావాల్సి వచ్చింది.

క్రీడాప్రభ



రషీద్‌కు బంపర్ ఆఫర్



అఫ్ఘానిస్తాన్ యువ సంచలనం రషీద్ ఖాన్‌ను అదృష్టం వరించింది. గత సీజన్‌లో నాలుగు కోట్లకు అమ్ముడయిన రషీద్, ఈసారి ఏకంగా రూ. 9 కోట్ల దక్కించుకున్నాడు. ఈ రోజు బెంగళూరు వేదికగా జరుగుతున్న తొలి రోజు వేలంలో రషీద్ కనీస ధర రూ. 2 కోట్లు ఉండగా, అతను భారీ రేటుకు అమ్ముడు పోవడం విశేషం. రైట్ టు మ్యాచ్ కార్డ్ పద్ధతి ప్రకారం రషీద్‌ను సన్ రైజర్స్ రూ. 9కోట్లకు కొనుగోలు చేసింది. తొలుత కింగ్స్ పంజాబ్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తీవ్రంగా పోటీ పడ్డాయి. చివర్లో రాయల్ చాలెంజర్స్ పోటీకి రావడంతో అతనికి డిమాండ్ పెరిగింది. రూ. 9 కోట్లకు ఆర్సీబీ బిడ్ వేయగా, రైట్ టు మ్యాచ్ పద్ధతిలో అదే రేటుకు సన్ రైజర్స్ అట్టిపెట్టుకుంది.

సీనియర్లు డౌన్!



ఐపీఎల్-11 సీజన్ వేలంలో టీమిండియా సీనియర్లకు ఊహించని పరిణామాలు ఎదురయ్యాయి. భారీ ధర పలకకున్నా, కనీసం వారిస్థాయికి తగిన ధర దక్కుతుందనుకున్న సీనియర్లకు నిరాశే మిగిలింది. హర్భజన్ సింగ్, గౌతం గంభీర్, యువరాజ్ సింగ్‌ను తీసుకునేందుకు పాత ఫ్రాంఛైజీలు మొగ్గుచూపలేదు. దీంతో కొత్త యాజమాన్యాలు కనీస ధరలకే కొనుగోలు చేశాయి. 10 సీజన్లు ముంబై ఇండియన్స్‌కు ఆడిన హర్భజన్ సింగ్‌ను చెన్నై సూపర్ కింగ్స్ 2 కోట్లకు, సన్‌రైజర్స్ స్టార్ ప్లేయర్ యువరాజ్ సింగ్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ 2 కోట్లకు సొంతం చేసుకున్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఐపీఎల్ ట్రోఫీలు అందించిన గౌతం గంభీర్‌ను ఢిల్లీ డేర్‌డెవిల్స్ 2.8 కోట్లకు కొనుగోలు చేసింది. గతేడాది భారీ ధర దక్కించుకున్న రహానేను రాజస్థాన్ రూ.4 కోట్లకు సొంతం చేసుకుంది. విదేశీ ఆటగాళ్లలో దక్షిణాఫ్రికా క్రికెటర్ డుప్లెసిస్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.1.6 కోట్లకు, బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు సన్‌రైజర్స్ రూ. 2 కోట్లు చెల్లించనుంది.

ఐపీఎల్ మనీలాండరింగ్‌కు వేదిక : బిషన్ సింగ్ బేడి

కోల్‌కతా: ఇండియా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ బిషన్ సింగ్ బేడీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్ ఫ్రాంఛైజీలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఇది ఒక రకంగా మనీలాండరింగ్‌కు వేదికగా మారుతోంది అని ఆరోపించారు. 'ఐపీఎల్ వల్లనే జస్టిస్ ఆర్ఎం లోధా కమిషన్‌ను నియమించారు. ఇలాంటి వాటికి అది కారణం అవుతుందని అస్సలు అనుకోలేదు. నాకు ఎలాంటి లాభం కలగడం లేదనే ఐపీఎల్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నానని చాలా మంది నాపై విమర్శలు చేస్తున్నారు. కావాలంటే మీరు నన్ను పరీక్ష చేసుకోవచ్చు' అని బేడీ అన్నారు. 'ఒక వికెట్ ధర కోటి అని ఒక పరుగు ధర 97 లక్షలని ఎవరైనా నిర్ణయించగలరా? దేశం తరఫున ఆడుతూ ఆటగాళ్లు డబ్బులు సంపాదించుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు. ఒక చిన్న క్లబ్‌కు అంత ధరకు ఆడటంపైనే నాకు అభ్యంతరం. అయితే ఇప్పుడు ఖర్చు చేస్తున్న డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చినట్టు? ఎక్కడికి వెళ్తున్నట్టు? ఇది మనీ లాండరింగ్ కాకపోతే మరేమిటో నాకు తెలియదు!' అని బేడీ అన్నారు. 'విరాట్ కోహ్లీని రూ.17 కోట్లకు తిరిగి తీసుకున్నారు. అందుకు అతడు అర్హుడు. అదే డ్రెస్సింగ్ రూమ్‌లో ఒక యువకుడికి వచ్చేది రూ.10-15 లక్షలు. అతనిప్పుడు ఏం చేస్తాడు.. విరాట్ కోహ్లీని అందుకోవాలని ప్రయత్నిస్తాడు. దానికి చాలా అడ్డదారులు ఉన్నాయి. అందులో స్పాట్‌ఫిక్సింగ్ ఒకటి' అని బేడీ పేర్కొన్నారు.

కోట్లాటలో స్టోక్స్ టాప్





- రూ. 12.5 కోట్లకు సొంతం చేసుకున్న రాజస్థాన్
- దుమ్మురేపిన మనిశ్ పాండే, కేఎల్ రాహుల్
- రూ. 11 కోట్ల చొప్పున ధర పలికిన యువ ఆటగాళ్లు
- సీనియర్ ప్లేయర్స్‌కు తగ్గిన డిమాండ్
- సూపర్ కింగ్స్‌లో అధికులు 30 ప్లస్
- స్టువర్ట్ బిన్నీకి కనిష్ట ధర రూ. 50 లక్షలు
- విధ్వంసకర బ్యాట్స్‌మన్ గేల్‌కు నిరాశ
- నేడు వేలానికి ఆఖరు

బెంగళూరు: ఐపీఎల్-11 సీజన్ ఆటగాళ్ల వేలంలో ఇంగ్లండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ గరిష్ట ధర పలికాడు. అందరికంటే ఎక్కువగా రూ.12.5 కోట్లకు అమ్ముడయ్యాడు. గత రెండు సీజన్లలో నిషేధం ఎదుర్కొన్న రాజస్థాన్ రాయల్స్, సీజన్ ప్రారంభంలోనే భారీ ధరకు స్టోక్స్‌ను సొంతం చేసుకుంది. గత ఏడాది రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించిన స్టోక్స్ ఈ ఏడాది రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడనున్నాడు. స్టోక్స్ కోసం రాజస్థాన్ రూ.12.5 కోట్లు వెచ్చించింది. గత ఏడాది స్టోక్స్ రికార్డు స్థాయిలో రూ.14.5 కోట్లకు అమ్ముడుపోయిన సంగతి తెలిసిందే. భారత యువ క్రికెటర్లు మనీశ్ పాండే, కేఎల్ రాహుల్‌లు రూ.11 కోట్లకు కొనుగోలు కాగా, సీనియర్ క్రికెటర్లు హర్భజన్, గంభీర్, టీ20 స్పెషలిస్టులు యువరాజ్, యూసఫ్ పఠాన్‌లు తక్కువ ధర పలికారు. అత్యల్పంగా స్టువర్ట్ బిన్నీ రూ.50 లక్షల ధర పలికాడు. కనీస ధరకు రాజస్థాన్ రాయల్స్ అతడిని సొంతం చేసుకుంది.

కాగా, విండీస్ విధ్వంసకర బ్యాట్స్‌మన్ క్రిస్‌గేల్ అమ్ముడుకాలేదు. అదే క్రమంలో జో రూట్, మురళీ విజయ్, హషీమ్ ఆమ్లా, మార్టిన్ గప్టిల్, జేమ్స్ ఫాల్కనర్, పార్థీవ్ పటేల్, జానీ బెయిర్ స్టోలను సైతం కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంఛైజీకూడా ఆసక్తి చూపలేదు. శనివారం నాటి వేలంలో గరిష్ట (స్టోక్స్), కనిష్ట ధర (స్టువర్ట్ బిన్ని) ధరకు ఆటగాళ్లను దక్కించుకున్న ఘనత రాజస్థాన్ రాయల్స్‌కే చెల్లింది.

దుమ్మురేపిన రాహుల్, మనీష్ పాండే

భారత యువ క్రికెటర్లు మనీశ్ పాండే, కేఎల్ రాహుల్ అనూహ్యంగా రూ.11 కోట్లకు అమ్ముడయ్యారు. మనీశ్ పాండే కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కింగ్స్ ఎలెవన్ జట్లు రేట్లు పెంచుకుంటూ పోగా పదికోట్ల మార్కు చేరుకున్నాక సన్‌రైజర్స్ హైదరాబాద్ అనూహ్యంగా రేసులోకి వచ్చింది. 11 కోట్ల ధరకు మనీశ్ పాండేను సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. టీమిండియా మరో యువ క్రికెటర్ కేఎల్ రాహుల్ కోసం జరిగిన వేలం ఆసక్తికరంగా జరిగింది. ముంబై ఇండియన్స్, పంజాబ్ జట్లు పోటాపోటీగా ధరను పెంచుతూ ఉత్కంఠ రేపారు. చివరికి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.11 కోట్లతో రాహుల్‌ను సొంతం చేసుకుంది. కరణ్ నాయర్‌ను సైతం కింగ్స్ ఎలెవన్ పంజాబ్ 5.6 కోట్లతో కొనుగోలు చేసింది. మరోవైపు ట్వంటీ 20ల్లో మంచి పేరున్న హార్డ్ హిట్టర్ యూసఫ్ పఠాన్ కేవలం 1.9 కోట్లకు కొనుగోలు కావడం గమనార్హం. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తక్కువ ధరకు పఠాన్‌ను తీసుకుంది. మరో ఆటగాడు కేదార్ జాదవ్ కోసం కూడా తీవ్ర పోటీ నెలకొంది. చెన్నై-హైదరాబాద్ కేదార్‌ను దక్కించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాయి. చివరకు సన్‌రైజర్స్ వెనక్కి తగ్గడంతో అతడు చెన్నై సొంతం అయ్యాడు.

అక్కరకు రాని గేల్

మొదటి రోజు వేలంలో వెస్టిండీస్ స్టార్ ఆటగాడు క్రిస్ గేల్ క ు చుక్కెదురైంది. క్రిస్ గేల్ కనీస ధర రూ. 2.00 కోట్లు ఉండగా, అతన్ని ఏ ఫ్రాంఛైజీ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. అదే క్రమంలో జో రూట్, మురళీ విజయ్, హషీమ్ ఆమ్లా, మార్టిన్ గప్టిల్, జేమ్స్ ఫాల్కనర్, పార్థీవ్ పటేల్, జానీ బెయిర్ స్టోలను సైతం కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంఛైజీ కూడా ఆసక్తి చూపలేదు. దాంతో వీరంతా ఈసారి ఐపీఎల్‌కు దాదాపు దూరమయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ చివరి రోజు వేలంలో ఆయా ఆటగాళ్ల కనీస ధర కంటే తక్కువ మొత్తానికి ఫ్రాంఛైజీలు కొనుగోలు చేయడానికి ముందుకొస్తే గనుక వారికి ఐపీఎల్‌లో ఆడే అవకాశం ఉంటుంది.

ఆటగాళ్ల వేలం వివరాలు (రూ. కోట్లలో)

రాజస్థాన్ రాయల్స్

బెన్ స్టోక్స్	12.5
సంజూ శాంసన్	8
జోఫ్రా ఆర్చర్	7.2
జాస్ బట్లర్	4.4
అజింక్య రహానే	4
డీఆర్సీ షార్ట్	4
రాహుల్ త్రిపాఠీ	3.4
స్టూవర్ట్ బిన్నీ	0.50 (కనీస ధర 50 లక్షలు)



ఢిల్లీ డేర్‌డెవిల్స్

గ్లెన్ మాక్స్‌వెల్	9
అమిత్ మిశ్రా	4
విజయ్ శంకర్	3.2
మొహ్మద్ షమీ	3
రాహల్ తెవాటియా	3
గౌతం గంభీర్	2.8
జేసన్ రాయ్	1.5
పృథ్వీ షా	1.2

కింగ్స్ ఎలెవన్ పంజాబ్

కేఎల్ రాహుల్	11
అశ్విన్	7.6
ఆరోన్ ఫించ్	6.2
మార్కస్ స్టోయినిస్	6.2
కరుణ్ నాయర్	5.6
డేవిడ్ మిల్లర్	3
యువరాజ్ సింగ్	2
మయాంక్ అగర్వాల్	1

చెన్నై సూపర్ కింగ్స్

కేదార్ జాదవ్	7.8
డ్వేన్ బ్రేవో	6.4
కరణ్ శర్మ	5 కోట్లు
అంబటి రాయుడు	2.2
షేన్ వాట్సన్	2 (కనీస ధర కోటి)
హర్భజన్ సింగ్	2
డుప్లెసిస్	1.6
ఇమ్రాన్ తాహీర్	1



కోల్‌కతా నైట్‌రైడర్స్

క్రిస్‌లిన్	9.6
మిచెల్ స్టార్క్	9.4
దినేశ్ కార్తీక్	7.4
రాబిన్ ఉతప్ప	6.4
కుల్దీప్ యాదవ్	5.8
పీయూష్ చావ్లా	4.2
కమలేష్ నాగర్	3.2
నితీష్ రాణా	3.4
శుభ్‌మాన్ గిల్	1.8



సన్‌రైజర్స్ హైదరాబాద్

మనీశ్ పాండే	11
రషీద్ ఖాన్	9
శిఖర్ ధావన్	5.2
వృద్ధిమాన్ సాహా	5
దీపక్ హుడా	3.6
కార్లోస్ బ్రాత్‌వైట్	2 కనీస ధర కోటి)
షకీబ్ అల్ హసన్	2 (కనీస ధర కోటి)
యూసఫ్ పఠాన్	1.9



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

క్రిస్ వోక్స్	7.4
యజ్వేంద్ర చాహల్	6
ఉమేశ్ యాదవ్	4.2
బ్రెండన్ మెకల్లమ్	3.6
క్వింటన్ డికాక్	2.8
డి గ్రాండ్‌హోమ్	2.2
మొయిన్ అలీ	1.7 (కనీస ధర 1.5 కోట్లు)
మోహన్ వోహ్రా	1.1



ముంబై ఇండియన్స్

కృనాల్ పాండ్యా	8.8
ఇషాన్ కిషన్	6.2
కీరన్ పోలార్డ్	5.4
ప్యాట్ కమిన్స్	5.4
సూర్యకుమార్	3.2



ఖరీదైన ఆటగాళ్లు వీరే..

ఈ సారి వేలంలో అనుకున్నట్టుగానే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ అత్యధికంగా రూ.12.50 కోట్ల ధర పలికాడు. అతడిని రాజస్థాన్ రాయల్స్ తీసుకుంది. గతేడాది 14 కోట్లు పలికిన అతడు ఈసారి 2 కోట్లు తక్కువకే దొరికాడు. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ మనీశ్ పాండేను సన్‌రైజర్స్ రూ.11 కోట్లు, ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.11 కోట్లు, హిట్టర్ క్రిస్‌లిన్‌ను రూ.9.60 కోట్లు, మిచెల్ స్టార్క్ రూ.9.40 కోట్లకు కోల్‌కతా దక్కించుకున్నాయి. గతేడాది పంజాబ్‌కు ఆడిన ఆసీస్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌ను ఢిల్లీ రూ.9 కోట్లు, మిస్టరీ స్పిన్నర్, అఫ్గాన్ సంచలనం రషీద్ ఖాన్‌ను సన్‌రైజర్స్ రూ.9 కోట్లు, కృనాల్ పాండ్యను ముంబయి రూ.8.80 కోట్లు పెట్టి కొనుగోలు చేశాయి.

మొత్తం ఖర్చు రూ.321 కోట్లు

పదకొండో సీజన్‌లో వేలానికి 580 మంది ఆటగాళ్లను ఎంపిక చేయగా అందులో 361 మంది భారతీయులు. తొలి రోజు ఫ్రాంఛైజీలు అన్నీ కలిపి రూ.321.10 కోట్లు ఖర్చుచేసి 78 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. అందులో 29 మంది విదేశీయులే ఉండటం గమనార్హం. వేలంలో ప్రీతిజింతా నేతృత్వంలోని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పోటాపోటీగా ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఉత్సాహం ప్రదర్శించింది.

నాటి మ్యాచ్ విన్నర్లు.. కారుచౌక

ఒక్కప్పటి మ్యాచ్ విన్నర్లు యువీ, గంభీర్, హర్భజన్ కనీస ధరకే అమ్ముడుపోయారు. వీరిని కొనుగోలు చేసేందుకు ఫ్రాంఛైజీలు అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. లోకల్ బాయ్ యువీని రూ.2 కోట్లకు పంజాబ్ సొంతం చేసుకుంది. హర్భజన్‌ను రూ.2 కోట్లకు చెన్నై దక్కించుకుంది. గంభీర్‌ను రూ.2.8 కోట్లకు ఢిల్లీ డేర్ డేవిల్స్ దక్కించుకుంది.

గంభీర్, మాక్స్‌వెల్ ఢిల్లీ జట్టుకు

పంజాబ్ వీరుడు మ్యాక్స్‌వెల్ (9 కోట్లు)ను భారీ ధరకు కొనుగోలు చేసింది ఢిల్లీ. కోల్‌కతాను విజేతగా నిలిపిన గంభీర్ (2.80) ఇంకా రబాడ (4.20), అమిత్ మిశ్రా (4), విజయ్ శంకర్ (3.20), రాహుల్ తెవతియా (3), మహ్మద్ షమి (3), కొలిన్ మన్రో (1.90), జేసన్ రాయ్ (1.50), ప ృథ్వీషా (1.20), అవీశ్ ఖాన్ (0.7), హర్షల్ పటేల్ (.2)ను కొన్నది.

హైదరాబాద్‌కు ధావన్ పంజాబ్‌కు అశ్విన్



శిఖర్ ధావన్‌ను పాత జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతం చేసుకుంది. ఈ వేలంలో ముంబై ఇండియన్స్, పంజాబ్, సన్‌రైజర్స్ జట్లు పోటీపడగా చివరికి సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.5.2 కోట్లకు ధావన్‌ను కొనుగోలు చేసి అతనిపై నమ్మకాన్ని ఉంచింది. నిషేధానికి ముందు 8 సీజన్ల వరకు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడిన స్టార్ స్పిన్నర్ అశ్విన్‌ను ఆ ఫ్రాంఛైజీ వదులుకుంది. వేలంలో 7.6 కోట్ల భారీ ధరకు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సొంతం చేసుకుంది. ముంబై ఇండియన్స్, పంజాబ్ జట్లు అశ్విన్‌ను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపాయి. అయితే సెహ్వాగ్ సూచనతో ప్రీతి జింతా అశ్విన్‌ను కొనుగోలు చేసింది.

ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల ఛాంపియన్ వొజ్నియాకి..



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గ్రాండ్ స్లామ్ ఓపెన్ టోర్నీలో రెండో సీడ్, డెన్మార్క్ క్రీడాకారిణి కరొలినా వొజ్నియాకి కొత్త ఛాంపియన్‌గా అవతరించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో వొజ్నియాకి 7-6 (7/2), 3-6, 6-4 తేడాతో ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి హలెప్ (రొమేనియా)పై విజయం సాధించి తొలిసారి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సాధించింది. మరొకవైపు ఆస్ట్రేలియా గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరిన మొదటిసారే టైటిల్‌ను సాధించిన క్రీడాకారిణిగా అరుదైన ఘనత సాధించింది. తొలిసెట్‌లో ఒక దశలో ఇద్దరు 6-6తో సమంగా నిలిచారు. హోరాహోరీగా సాగిన సెట్‌ను టై బ్రేక్ ద్వారా దక్కించుకున్న వొజ్నియాకి, రెండో సెట్‌ను కోల్పోయింది. హలెప్ ఎదురుదాడికి దిగడంతో వోజ్నియాకి తేలిపోయింది. దీంతో 3-6తో సెట్ కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో విజృంభించి పదునైన సర్వీస్‌లను సంధించింది. దాంతో తడబాటుకు లోనైన హలెప్, వరుస పాయింట్లను కోల్పోయి సెట్‌తో పాటు టైటిల్‌ను కూడా తృటిలో చేజార్చుకుంది. 72 నిమిషాల పాటు సాగిన చివరి సెట్లో 6-4తో వోజ్నియాకి సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకుంది.

వోజ్నియాకి ఇదే తొలి గ్రాండ్ స్లామ్. ఇది హలెప్‌కు మూడో గ్రాండ్ స్లామ్ ఫైనల్ కాగా, మూడుసార్లు రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. 2014, 2017 ల్లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు చేరినప్పటికీ, టైటిల్ సొంతం చేసుకోవడంలో విఫలమైంది. మరొకవైపు 2009, 2014 సంవత్సరాల్లో యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన వొజ్నియాకి టైటిల్ సాధించడంలో విఫలమైంది. ఈసారి ఆస్ట్రేలియా ఫైనల్స్ నెగ్గడం ద్వారా ఆ లోటును భర్తీ చేసింది. కొత్త చాంపియన్ అవతరించింది. తన మొదటి ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్ పతకాన్ని గెలుచుకున్న తర్వాత కరోలిన్ ఉద్వేగానికి లోనయింది. గతంలో కరోలిన్, హలెప్ ఇద్దరు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో ఓడిపోయారు. హలెప్ రెండు సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్‌ను గెలవగా... వోజ్నియాకి.. యూఎస్ ఓపెన్‌ను రెండు సార్లు గెలిచింది. ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్ విజేతగా గెలవడంతో ఆరేళ్ల తర్వాత వోజ్నియాకి మళ్లీ నెంబర్ వన్ ర్యాంక్‌ను సాధించింది. మొత్తం మీద 43వ ప్రయత్నంలో వోజ్నియాకి ఆస్ట్రేలియా ఓపెన్‌ను గెలుచుకున్నది.

సఫారీలకు షాక్

- చివరి టెస్టులో టీమిండియా సంచలన విజయం
- 63 పరుగులతో ద.ఆఫ్రికాను చిత్తుచేసిన కోహ్లీ సేన
- ఆతిథ్య జట్టును బెంబేలెత్తించిన భారత పేసర్లు

జొహాన్స్‌బర్గ్: బౌన్సీపిచ్‌పై ఎట్టకేలకు కోహ్లీ సేన గెలిచింది. మూడో టెస్టులో ఆతిథ్య జట్టును 177 పరుగులకే కుప్పకూల్చిన ఇండియా 63 పరుగులతో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 1-2తో ముగించింది. తద్వారా వైట్‌వాష్ ప్రమాదాన్ని తప్పించుకుంది. తొలి రెండు మ్యాచ్‌లలో సఫారీ బౌలింగ్‌కు బెంబేలెత్తిన టీమిండియా, అదే పేస్ బౌలింగ్‌తో ఆతిథ్య బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించింది. చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఒక మోస్తరు భారీ స్కోరు సాధించిన కోహ్లీసేన, బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. మహ్మద్ షమి, ఇషాంత్, బుమ్రా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. చివరి సెషన్‌లో ప్రత్యర్థి బ్యాట్స్‌మన్‌ను ఒత్తిడికి గురిచేసి, క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టారు. కష్టసాధ్యమైన విజయాన్ని సునాయాసంగా ఒడిసిపట్టారు. ఆచితూచి ఇన్నింగ్స్ ప్రారంభించిన ద.ఆఫ్రికా నాటకీయంగా కుప్పకూలింది. చివరి ఎనిమిది వికెట్లను కేవలం 53 పరుగులకే కోల్పోయింది. మరో రోజు సమయం ఉండగానే పరాజయాన్ని మూటగట్టుకుంది.

241 పరుగుల లక్ష్య ఛేదనతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సఫారీ జట్టు ఒకానొక దశలో రెండు వికెట్ల నష్టానికి 124 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. కానీ ఆ తర్వాత భారత బౌలర్లు విజృంభించడంతో సఫారీ బ్యాట్స్‌మన్ పెవిలియన్‌కు క్యూ కట్టాల్సి వచ్చింది. ఆమ్లా (52), డీన్ ఎల్గర్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. అతనొక్కడే అత్యధికంగా 86 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కాగా భారత బౌలర్లలో మహ్మద్ షమి 28 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టగా, ఇషాంత్, బుమ్రా రెండేసి వికెట్లు, భువనేశ్వర్ కుమార్ ఒక వికెట్ తీశారు. తొలిసారి విదేశీగడ్డపై పేసర్లే మొత్తం వికెట్లు పడగొట్టారు. నలుగురు ఫుల్‌టైమ్ పేసర్లు మొత్తం 20వికెట్లను పంచుకున్నారు. కాగా, ఈ విజయంతో వాండరర్స్‌లో తమకు ఎదురు లేదని ఇండియా మరోసారి నిరూపించింది. ఇక్కడ మొత్తం ఐదు మ్యాచ్‌లుఆడిన ఇండియా రెండిట్లో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డుకు భువనేశ్వర్ కుమార్, సిరీస్ ఫిలాండర్ ఎంపికయ్యారు.


కొత్తరూల్ కలిసొచ్చింది

వికెట్ కీపర్‌కు సబ్‌స్టిట్యూట్ ఇచ్చే కొత్త నిబంధనను భారత్ సద్వినియోగం చేసుకుంది. పార్థివ్ పటేల్ గాయం కారణంగా మైదానం వీడటంతో, అతనిస్థానంలో గ్లౌజ్ ధరించిన దినేష్ కార్తీక్ వికెట్ల వెనుక రాణించాడు. ఎనిమిదేళ్ల విరామం తర్వాతటెస్టు మ్యాచ్ ఆడిన కార్తీక్, చివరి సెషన్‌లో కీలకమైన క్యాచ్‌లు అందుకున్నాడు. కొత్త నిబంధన గతేడాది అక్టోబర్‌లో అమలులోకి వచ్చింది. రెగ్యులర్ కీపర్ గాయపడితే, అతనిస్థానంలో సబ్‌స్టిట్యూట్‌ను పొందేందుకు ఈ రూల్ వీలు కల్పిస్తుంది. అయితే ఇందుకు అంపైర్ల ఆమోదం తప్పనిసరి. కుడిచేతి చూపుడు వేలు గాయం తీవ్రమైనదిగా తేలడంతో టీ20, వన్డే సిరీస్‌కు పార్థివ్ దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది.

డుప్లెసిస్ ఔటే టర్నింగ్ పాయింట్

ఇషాంత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా తలో రెండు వికెట్లు తీసి సఫారీలను దెబ్బ కొట్టారు. వీరి బౌలింగ్ ధాటికి ప్రత్యర్థి జట్టు 144 వద్ద డుప్లెసిస్, 145 వద్ద డికాక్ వికెట్లు నష్టపోయింది. డుప్లెసిస్‌ను ఇషాంత్, డికాక్‌ను బుమ్రా బోల్తా కొట్టించారు. దీంతో 64 ఓవర్లు ముగిసే సరికి ఆతిథ్య జట్టు 146/5తో నిలిచింది. ఆ జట్టు గెలవాలంటే మరో 96 పరుగులు అవసరం. అయితే ఓపెనర్ డీన్ ఎల్గర్, ఫిలాండర్ కొద్దిసేపు ప్రతిఘటించారు. అయితే భారత పేస్ ధాటికి ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ బాట పట్టారు.

స్కోర్లు: ఇండియా: 187 / 247
ద.ఆఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 194 / 177



కాబుల్‌పై అంబులెన్స్ బాంబ్



• మరోసారి రక్తమోడిన అఫ్ఘన్ రాజధాని • ఉగ్రదాడిలో 95 మంది మృతి, 158 మందికిపైగా గాయాలు

• మృతుల్లో ఎక్కువగా మహిళలు, చిన్నారులు • హై ప్రొఫైల్ సంస్థలు, ఈయూ ఆఫీసులే లక్ష్యంగా దాడి

కాబుల్: అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబుల్ మరోసారి బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. హై ప్రొఫైల్ సంస్థలు, యురోపియన్ యూనియన్ ఆఫీసులే లక్ష్యంగా తాలిబన్ ఉగ్రవాదులు జరిపిన దాడితో కాబుల్ ఒక్కసారిగా ఉలిక్కి పడింది.అంబులెన్స్ రూపంలో వచ్చిన మృత్యువు 95 మందిని కబలించగా..158 మంది గాయపడ్డారు. బాంబు పేలుళ్లు జరిగిన ప్రాంతంలో ఎటుచూసినా భయానక దృశ్యాలే కనిపిస్తున్నాయి. మృత్యువుతో పోరాడి ఊపిరొదిలిన వారు కొందరైతే.. తెగిపడిన శరీర భాగాలతో ఆక్రందనలు చేస్తున్నవారు మరికొందరు. గాయపడిన వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. బాంబు పేలుళ్లు జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వారిని తమ భుజాలపై ఎత్తుకుని ఆస్పత్రుల వైపు పరుగులు తీశారు. ఇక పేలుళ్లలో ఎక్కువ మందికి గాయాలవడంతో సమీప ఆస్పత్రులన్నీ వారి హాహాకారాలతో మారుమోగుతున్నాయి. సమీప ప్రభుత్వఆస్పత్రిలో గాయపడిన వారికి చికిత్స చేయడానికి సరైన వైద్య సిబ్బంది లేకపోవడంతో చాలామందికి ఆలస్యంగానే చికిత్స అందింది. తీవ్రంగా గాయపడిన వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్ బర్యాలీతెలిపారు. హై ప్రొఫైల్ సంస్థలు, యురోపియన్ యూనియన్ అధికారులు ఉండే ప్రాంతమే లక్ష్యంగా ఉగ్రదాడి జరిగింది. బాంబు పేలుళ్ల తీవ్రత ఎక్కువగా ఉండటంతో దాదాపు రెండు కిలోమీటర్లు దూరంలోని భవనాల కిటికీల అద్దాలు కూడా పగిలిపోయాయి. పేలుళ్ల శబ్దానికి తన స్టేషనరీ పునాదులు కదిలాయని షాపు ఓనర్ అనుముల్లా తెలిపాడు. సూసైడ్ బాంబర్ అంబులెన్స్ లో ఒక చెక్ పాయింట్ దాడి రెండో చెక్ పాయింట్ ముందే తనను తాను పేల్చుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని ముందస్తుగానే సమాచారం రావడంతో ప్రమాదం జరగడానికి 20 నిమిషాల ముందు పోలీసులు అంబులెన్స్‌లు తనిఖీ చేశారు. దీంతో చాలామంది డ్రైవర్లు, రోగులు రోడ్లపైనే వేచి ఉన్నారు.





అయినా ఫలితంలేదు. ఉగ్రవాదులు చాకచక్యంగా తమ లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు చెక్ పాయింట్లు జంప్ చేసి అమాయకుల ప్రాణాలు పొట్టనబెట్టుకున్నారు.

దాడి మా పనేఃతాలిబన్లు

కాబుల్‌లో ఆత్మాహుతి దాడి తమపనే అని తాలిబన్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

కాబుల్ లోని ప్రముఖ హోటల్ పై దాడి చేసి 25 మందిని పొట్టనబెట్టుకున్న తాలిబన్లే సరిగ్గా వారం రోజుల తర్వాత అంబులెన్స్ ద్వారా దాడికి తెగబడ్డారు. తాజాగా జరిపిన ఆత్మాహుతి దాడికి సంబంధించిన ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పెట్టారు.దాడి జరిగిన ప్రాంతంలో పెద్దఎత్తున పొగ కమ్ముకుంది.

ఉగ్రదాడిని ఖండించిన అఫ్ఘన్ అధ్యక్ష భవనం

తాలిబన్ల దాడిని అఫ్ఘనిస్తాన్ అధ్యక్ష భవనం ఖండించింది. ఉగ్రదాడులు మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలుగా అభివర్ణించింది. బాంబు పేలుళ్ల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. కాబుల్ లో ప్రతీకార దాడులు చేసేందుకు ఐసిస్ ఉగ్రవాద సంస్థ కుట్ర చేసిందని వెల్లడించింది. సూపర్ మార్కెట్లు, షాపులు, హోటళ్లు లక్ష్యంగా ఉగ్రవాదుల ప్రతీకార దాడులు జరగవచ్చని.. భద్రతను కట్టుదిట్టం చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు ఆత్మాహుతికి పాల్పడింది నస్రత్ రహిమీగా గుర్తించారు. కాబుల్ దాడిలో తాలిబన్లతో పాటు ఐసిస్ ఉగ్రవాదుల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

అనాగరిక..పిరికి చర్యః భారత్

కాబుల్ ఉగ్రదాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది ఆటవిక.. పిరికి చర్యగా అభివర్ణించింది. బాంబు పేలుళ్లలో గాయపడిన పౌరులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన భారత్.. క్షతగాత్రుల చికిత్సకు సాయం అందిస్తామని ప్రకటించింది. ఉగ్రవాదుల చర్యల వల్ల ఎవరికీ న్యాయం జరగదు. ఉగ్రవాదులకు సహకారం అందిస్తున్న వారిని కోర్టుల్లో నిలబెట్టాలి. అని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈనెల 24న జలాలాబాద్ లో జరిగిన ఉగ్రదాడిలో పౌరులు, చిన్నారులు మృత్యువాత పడ్డారన్న విషయాన్ని గుర్తుచేస్తూ ... ఉగ్రచర్యలపై భారత్ నిరంతర పోరాటం చేస్తుందని స్పష్టం చేసింది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు భారత్- ఆఫ్ఘనిస్తాన్ తో కలిసి పనిచేస్తుందని వెల్లడించింది. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢసానుభూతిని తెలియజేసింది. గాయపడిన వారు తొందరగా కోలుకోవాలని భారత్ ఆకాంక్షించింది.

ఇల్లు ఖాళీకి 52 ఏళ్లు

న్యూఢిల్లీ: ఇల్లు ఖాళీ చేయకుండా ఓ ప్రబుద్ధుడు ఏకంగా 52 ఏళ్లు యజమానికి ముప్పతిప్పలు పెట్టిన ఘటన గుజరాత్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై సర్వోన్నత న్యాయస్థానమే షాక్‌కు గురైంది. తక్షణమే ఇల్లు ఖాళీ చేసి యజమానికి అప్పగించాలని ఆదేశించింది. బీఎం పటేల్ అనే వ్యక్తి 1965లో తన ఇంటిని ఎంకే బారోత్ అనే వ్యక్తికి కిరాయికిచ్చాడు. కొన్నాళ్లకు పటేల్ తన ఇల్లు ఖాళీచేయమని అడగ్గా, బారోత్ కోర్టులో కేసు వేశాడు. అయితే, గుజరాత్ కోర్టు పటేల్‌కు అప్పగించాలని తీర్పు చెప్పింది. కానీ బారోత్ దాన్ని సవాలు చేస్తూ మరో పిటిషన్ దాఖలు చేసి తీర్పు అమలుకాకుండా ఆపించేశాడు. గత ఏడాది హైకోర్టు కూడా బారోత్ ఇల్లు ఖాళీ చేయాలని తీర్పు చెప్పింది. దీంతో బారోత్ ఈ తీర్పును సుప్రీంలో సవాల్ చేశాడు. ఈ పిటిషన్ విచారించిన జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం షాక్‌కు గురైంది. ఈ కేసు పెండింగ్‌లో ఉన్న కారణంగా యజమాని ఇంటిని స్వాధీనం చేసుకోలేకపోయారు. బారోత్‌ను ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా సుప్రీం ఆదేశించింది. ఆరు నెలల గడువుకోరగా, అందుకు కోర్టు నెల రోజులు మాత్రమే గడువు మంజూరుచేసింది.

భార్యను చంపి వండేశాడు

మెక్సికో: మెక్సికోలో ఓ కర్కోటకుడు అత్యంత దుర్మార్గంగా, దారుణంగా తన మాజీ భార్యను గొంతు నులిమి చంపేసి, ఆమెను ముక్కలు, ముక్కలుగా చేసి సగభాగాన్ని కుక్కర్‌లో పెట్టి వండేశాడు. మిగతా సగభాగాన్ని ఫ్రిజ్‌లో పెట్టి పరారయ్యాడు. ఈ దారుణమైన ఘటన మెక్సికోలో చోటుచేసుకుంది. అక్కడి అధికారులు చెప్పిన వివరాల ప్రకారం... మెగ్దలీనా(28), సెసర్ లోపేజ్ వివాహం చేసుకుని ఇద్దరు పిల్లలను కన్నారు. అయితే, వీరిద్దరి మధ్య పొసగకపోవడంతో కొంతకాలం క్రితం విడాకులు తీసుకున్నారు. పిల్లలు అప్పుడప్పుడూ తండ్రి వద్దకు వెళ్లివస్తుంటారు. ఎప్పటిలాగే కొద్దిరోజుల క్రితం తండ్రి వద్దకు వెళ్లారు. దీంతో వారిని తీసుకువచ్చేందుకు జనవరి 13న మెగ్దలీనా మాజీ భర్త లోపేజ్ నివాసానికి వెళ్లింది. అతడి ఇంటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఎంతటికీ ఆమె తిరిగిరాకపోయేసరికి కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి ఆమె మాజీ భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఇంటికి వెళ్లిన పోలీసులు అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. ఈ చర్య అంతా తన ఇద్దరు పిల్లల ముందే అతడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం లోపేజ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

తనకంటే15 ఏళ్ల చిన్నోడితో పెళ్లి

చైనా: తనకన్నా వయసులో చిన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని ఓ 38 సంవత్సరాల మహిళ కోరుకుంది. రూ.కోటికి పైగా కట్నం ఇచ్చి తన కోరికను నెరవేర్చుకుంది. ఈ ఘటన చైనాలోని హైనాన్‌లో చోటుచేసుకుంది. వరుడి తల్లిదండ్రులను ఒప్పించేందుకు ఆమె అంత మొత్తం కట్నంగా ఇచ్చిందట. పెళ్లి కుమారుడు ఆమె కన్నా 15 ఏళ్ల చిన్నవాడు. అంతేకాకుండా ఆమెకు 14 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. జనవరి 10న క్యాంగాయ్‌లో ఈ పెళ్లి జరిగింది. పెళ్లి కుమార్తె తన హోదాను చూపిస్తూ బంగారు ఆభరణాలతో ముస్తాబైంది. అయితే, మొదట పెళ్లి కుమారుడి తల్లిదండ్రులు ఈ వివాహానికి ఒప్పుకోలేదట. ఆ తర్వాత ఆమె కట్నం ఇస్తున్న విషయం తెలుసుకుని, ఇద్దరినీ ఆశీర్వదించారట.

బస్సు బోల్తా.. 13 మంది మృతి

కొల్హాపూర్: మహారాష్ట్రలో కొల్హాపూర్ నగర సమీపంలోని పంచగంగ నదిలో ఓ మినీబస్సు బోల్తాపడి 13 మంది మృతి చెందగా..మరో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారికి చత్రపతిప్రమీలరాజే సివిల్ హాస్పిటల్ లో చికిత్స అందిస్తు న్నారు.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 17 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరంతా పూణెలోని పర్యాటక ప్రాంతం గణపతి పూలేను సందర్శించి తిరుగు ప్రయాణమౌతుండటం ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు.

Published & Printed by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
I

చిత్ర పరిశ్రమలో... వేధింపులు నిజమే!



సాధించాలనే కోరిక బలంగా ఉంటే చేయిదాటే లక్ష్యాలేవీ ఉండవు. సందేహపడే మనసుకు ..గట్టిగా అనుకో అయిపోతుంది.. అని నమ్మకంగా ధైర్యం చెప్పుకోవచ్చు. ఇవి వ్యక్తిత్వ వికాస మాటలు కాదు...ఎందరి జీవితాల్లోనో నిజమైన కలలు. ఒక్కరోజులోనే అంతా జరక్కపోవచ్చు...కానీ సుదీర్ఘ ప్రయాణాన్ని ఆశించినప్పుడు అద్భుతాలే చెంత చేరుతాయి. ఇందుకు నాయిక సీరత్ కపూర్ తాజా ఉదాహరణ. నృత్య శిక్షకురాలిగా ప్రయాణం మొదలుపెట్టిన సీరత్....వెండితెరకు రావాలని బలంగా కోరుకుంది. మోడల్‌గా అరంగేట్రం చేసి...నాయికగా తెరంగేట్రం చేసింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ప్రముఖ తార అయ్యింది. తన జీవితంలోని ఆసక్తికరమైన విశేషాలను ఆంధ్రప్రభ లైఫ్ తో పంచుకుంది...

చిత్ర పరిశ్రమలో హీరోయిన్లు వేధింపులకు గురవుతున్న మాట వాస్తవమే..కాని నేను మాత్రం కాస్టింగ్ కౌచ్‌కు గురికాలేదు

-టాలీవుడ్ హీరోయిన్ సీరత్ కపూర్

మనసు మాట విన్నాను...

నేను పుట్టింది ముంబైలో. చిన్నప్పటి నుంచి చదువులతో పాటు కళలపై ఆసక్తి ఉండేది. అమ్మా నాన్న నా ప్రతిభను గుర్తించి నృత్యం, సంగీతంలో శిక్షణ ఇప్పించారు. పోదార్ ఇంటర్నేషనల్ పాఠశాలలో చదువుకున్నాను. తర్వాత మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేశాను. పాఠశాల నుంచే సాంస్కృతిక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాను. ఒకవైపు చదువు మరోవైపు డాన్స్ కోర్సులు చేశాను. అయితే ఈ రెండింటికీ సరైన సమయం కేటాయించడం కుదరలేదు. కొన్నాళ్లకు చదువుకోవడం కష్టమయింది. బాగా ఆలోచించాక...మనసుకు నచ్చిందే చేయాలని నిర్ణయించుకున్నాను. ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా గొప్ప శక్తి ఉంటుంది. అది ప్రత్యేకం. దాన్ని తెలుసుకోవడమే విజయం. అలా కళలనే వృత్తిగా ఎంచుకోవాలనుకున్నాను. ఆశ్లే లోబో డాన్స్‌వర్క్స్ అనే సంస్థలో నృత్య శిక్షకురాలిగా చేరాను. మనసు మాట విన్న ఆ క్షణం నుంచి నా జీవితం మారిపోయింది.

16ఏళ్లకే నృత్య శిక్షకురాలిగా...



డాన్స్ ఇలస్ట్రేటర్‌గా చేరేప్పటికి నా వయసు 16 ఏళ్లు. అయితే చిన్న వయసని అనుకునేవారు కాదు. నాలోని ప్రతిభే వాళ్లకు కనిపించేది. రాక్ స్టార్ అనే బాలీవుడ్ చిత్రానికి సహాయ కొరియోగ్రాఫర్‌గా పనిచేశాను. అలా చిత్ర పరిశ్రమవైపు అడుగులు పడ్డాయి. నృత్య శిక్షకురాలిగా స్వేచ్ఛను కోల్పోయాను. ఉదయం తొమ్మిందింటి నుంచి సాయంత్రం ఆరు దాకా..ఉద్యోగంలా పని చేయాల్సివచ్చేది. మూడేళ్లు కష్టపడిన తర్వాత....మోడలింగ్ వైపు వెళ్లాలని నిశ్చయించుకున్నాను. మోడల్‌గా అరంగేట్రం చేసిన కొద్ది రోజులకే వ్యాపార ప్రకటనల్లో అవకాశాలు వచ్చాయి.

అనుకోని అవకాశం...

మోడల్‌గా తీరిక లేకుండా ఉన్నప్పుడు....నా స్నేహితురాలి ద్వారా హైదరాబాద్‌లో ఓ చిత్రానికి ఆడిషన్స్ జరుగుతున్నాయని తెలిసింది. మరుసటి రోజే వెళ్లి ఆడిషన్ ఇచ్చాను. చాలా మంది వచ్చారు. వాళ్లలో నేను ఎంపికయ్యాను. అలా తొలి చిత్రం రన్ రాజా రన్ ప్రారంభమైంది. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో నాయికగా బాగా పేరొచ్చింది.

రెండు అపజయాలు...



రన్ రాజా రన్ చేసిన తర్వాత ఏడాది రెండు చిత్రాల్లో నటించాను. కొలంబస్, టైగర్..ఈ రెండు సినిమాలు సరిగా ఆడలేదు. ప్రభావం నా అవకాశాలపై బాగా చూపించింది. అయితే అపజయాలకు కుంగిపోవడం నా వ్యక్తిత్వంలో లేదు. ప్రతి చిత్ర కథ ఒక ప్రయోజనం కోసం రాసి ఉంటుంది. అవి కొన్నిసార్లు ప్రేక్షకులకు నచ్చుతాయి. మరికొన్నిసార్లు నచ్చవు. నేనిప్పటిదాకా చేసిన సినిమాల్లో దేని గురించి పశ్చాత్తాప పడటం లేదు. ఎందుకంటే హిట్ అయినా, కాకున్నా...ఆ చిత్రంలో నా పాత్ర గుర్తుండిపోయేలా తెరకెక్కింది. గొప్ప ప్రయాణంలో సాగాలనుకున్నప్పుడు...ఇలాంటి ఎదురుదెబ్బలు తగులుతుంటాయి. అపజయాలు ఉన్నా...రాజుగారి గది 2, ఇప్పుడు టచ్ చేసి చూడు లాంటి అగ్ర కథానాయకుల చిత్రాల్లో నన్ను నమ్మి ఎంపిక చేసుకున్న దర్శకులకు కృతజ్ఞతలు.

ఇద్దరు నాయికలుంటే...

నిజాయితీగా చెబుతున్నాను. ఇద్దరు నాయికలు ఉన్న సినిమాలు చేసేందుకు నాకేమీ అభ్యంతరం లేదు. కథలో రెండు పాత్రలకు సమాన అవకాశం ఉన్నప్పుడు ఆ చిత్రాన్ని ఎందుకు తిరస్కరించాలి. పెద్ద కథానాయకుడితో నటిస్తున్నప్పుడు ఇలాంటి చిన్న విషయాలను పట్టించుకోను. ఏదైనా సోలో నాయికగా చేయాలని ఎవరికి ఉండదు..? నాకు ఇష్టమైన నాయిక రకుల్ ప్రీత్‌సింగ్. ఆమెను చూసినప్పుడల్లా స్ఫూర్తి కలుగుతుంటుంది. రకుల్ స్టార్‌డమ్ ఇంకెన్నాళ్లు ఉంటుందో తెలియదు కానీ...ఎంతో శ్రమ, పట్టుదలతోనే ఆమె ఆ స్థాయికి చేరింది. నా తోటి నాయికలు మంచి విజయాలు సాధిస్తున్నప్పుడు...వాళ్లు ఎక్కడ సక్సెస్ అవుతున్నారో గమనిస్తాను.

వేధింపులు ఉన్నాయి..

కాస్టింగ్ కౌచ్ ప్రపంచవ్యాప్తంగా సినిమా పరిశ్రమల్లో చర్చనీయాంశంగా మారింది. అవకాశాల కోసం నాయికలను వేధించడం అనేది చాలా తప్పు. ఈ వేధింపులు ప్రతి రంగంలో ఉన్నాయి. నచ్చని వాటిని తిరస్కరించడం ద్వారా, బయటకొచ్చి మాట్లాడటం ద్వారానే ఇలాంటి వాళ్లను ఎదుర్కోవచ్చు. నా ప్రయాణంలో ఎప్పుడూ కాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కోలేదు.

హీరోయిన్‌లే హీరోలు...

నాయిక ప్రధాన చిత్రాలు పెరగడం, వాటికి ఆదరణ దక్కడం మేమంతా గొప్ప విషయంగా భావిస్తాము. ఒకప్పుడు హీరోల సినిమాలు వస్తే హీరోయిన్‌ల సినిమాలు వాయిదా వేసుకునేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి తిరగబడింది. అనుష్క భాగమతి కోసం మిగతా చిత్రాలు కొన్ని వాయిదా వేసుకున్నారని విన్నాను. పరిశ్రమలో మారిన పరిస్థితికి ఇదొక నిదర్శనం.

అభినేత్రి అనిపించుకోవాలి...

నన్ను గ్లామర్ నాయికగా చూస్తున్నారు. ఈ టైప్ కాస్టింగ్ నుంచి బయటకు రావాలని ప్రయత్నిస్తున్నాను. నా గత చిత్రాలు రాజు గారి గది 2, ఒక్క క్షణం ఈ ముద్రను మార్చాయి. నేను గ్లామర్‌గా కనిపించకుండా...కేవలం నటించి ఆకట్టుకున్నాను. ఒక్క క్షణంలో మేకప్ లేకుండా చేసిన సన్నివేశాలున్నాయి. రానున్న చిత్రాల్లోనూ అందంగా కనిపిస్తూనే నటనలో ప్రతిభ చూపించాలని అనుకుంటున్నాను. ఈ రెండు రకాల పాత్రలను సమతూకం చేసుకుంటాను. ఒక చిత్రాన్ని ఎంచుకునే ముందు నా పాత్ర ఎంత బాగుంది. అది కథలో కీలకంగా ఉందా లేదా అనే విషయాలను పరిగణనలోకి తీసుకుంటాను. ప్రస్తుతం రానా దగ్గుబాటితో ఓ చిత్రంలో నటిస్తున్నాను. గుంటూరు టాకీస్ కథానాయకుడు సిద్ధూతో మరో చిత్రంలో నటిస్తున్నాను. ఇంకొన్ని చర్చల దశలో ఉన్నాయి.

✍ రమేష్ గోపిశెట్టి

క్యాన్సర్ నిరోధానికి చేప నూనె!

క్యాన్సర్ రోగ నివారణలో సముద్ర చేపలు కీలక భూమిక పోషించనున్నాయా? అంటే అవుననే అంటున్నాయి నూతన పరిశోధనలు. వైద్య నిపుణులు చెప్పేదాని ప్రకారం క్యాన్సర్ కణితులను ఒమేగా-3 అనే కొవ్వు ఆమ్లాలు నిరోధిస్తాయి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు రోగనిరోధక వ్యవస్థను పటిష్టం చేయడంతోపాటు, క్యాన్సర్ కణితుల ఎదుగుదలను అడ్డుకుంటాయి. అయితే మొక్కల ఆధారిత ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల కంటే, సముద్ర ఆధారిత ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు ....8 రెట్లు అధిక సమర్థవంతంగా పనిచేస్తాయని ...క్యాన్సర్ కణితుల ఎదుగుదలను నిరోధిస్తాయని, ఇటీవల జరిగిన పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. దీనికి సంబంధించి మొదట రొమ్ము క్యాన్సర్ కణితి ఎదుగుదలపై పరిశోధనలు చేసినట్లు ఒంటారియా లోని గుల్ఫ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డెవిడ్ మా స్పష్టం చేశారు. మొక్కల ఆధారిత ..సముద్ర చేపల ఆధారిత ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలను పోల్చుతూ రొమ్ము క్యాన్సర్ కణితులపై ప్రయోగం చేసిట్లు ఆయన చెప్పారు. అప్పుడు సముద్ర ఆధారిత ఒమేగా-3, మొక్కల ఆధారిత ఒమేగా-3 కంటే చాలా సమర్థవంతంగా పని



చేయడం గమనించామని డెవిడ్ మా తెలిపారు. ఎలుకల మీద చేసిన ప్రయోగంలో సముద్ర ఆధారిత చేపల నుంచి ఉత్పత్తి చేసిన ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు క్యాన్సర్ కణితులను పరిమాణాన్ని 60 నుంచి 70శాతం, సంఖ్యలో 30 శాతం తగ్గించాయని, అంతే సమర్థవంతంగా పనిచేయడానికి మొక్కల ఆధారిత ఒమెగా-3 ఆమ్లాలను ఓవర్ డోస్ వాడాల్సి వచ్చిందని పరిశోధనల్లో తేలిందని డేవిడ్ తెలిపారు.

స్కూబా డైవింగ్ చేయాలా? ఛలో...మేఘాలయ!

మీకు స్కూబా డైవింగ్ చేయాలని ఉందా? జిప్ లైనింగ్ అంటే ప్రాణమా? మీరు పర్యాటక ప్రియులా? అయితే మీరు జీవితంలో ఒక్కసారైనా పర్యటించాల్సిన ప్రాంతం మేఘాలయ.. జిప్‌లైనింగ్...స్కూబా డైవింగ్..ట్రెక్కింగ్...మౌంటెన్ బైకింగ్..రివర్ రాఫ్టింగ్..లాంటి ఏ సాహస కృత్యం చేయాలన్నా..ఈశాన్య భారతంలోని మేఘాలయకు వెళ్లి తీరాల్సిందే. మేఘాలయ వెళ్లిన పర్యాటకులకు పైన చెప్పిన అడ్వంచెర్స్ అన్నీ అందుబాటులో ఉంటాయి. అక్కడి ప్రభుత్వం పర్యాటకులను ఆకట్టుకునేందుకు సాహసకృత్యాలను ప్రోత్సహిస్తుంది. అందు కోసం సురక్షితమైన ఏర్పాట్లు చేస్తుంది. దేశ విదేశాల పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేస్తుంది. పర్యాటకుల కోసం నూతన హంగులను సమకూరుస్తోంది. బస,రవాణా సౌకర్యాలను కల్పించడం లో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంది. అందుకే మేఘాలయ సందర్శన పర్యాటకులకు ఓ మధురాను భూతిని మిగిలిస్తుంది.



హస్తినలో లేట్‌నైట్ టేస్టీ ఫుడ్!

రాత్రి 12 గంటలు.. దేశ రాజధాని ఢిల్లీ నగరం..పని పూర్తిచేసుకుని రూం చేరుకున్నారు. మీరు దిగిన లాడ్జింగ్‌లో బోడ్జింగ్ సదుపాయం లేదు. పని ఒత్తిడిలో టైం చూసుకోలేదు. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. మరి ఇప్పుడెలా? ఆకలితో మంచినీళ్లు తాగి పడుకోవాల్సిందేనా? అవసరం లేదు. హస్తినలో లేట్ నైట్ లో కూడా రుచికరమైన, శుచికరమైన ఆహారం దొరుకుతుంది. అయితే అవి మీరు అనుకున్నట్లు ఫ్యాన్సీ రెస్టారెంట్స్, పెద్ద పెద్ద హోటల్స్ మాత్రం కాదు. రోడ్‌సైడ్ స్టాల్స్, దాబాలు, టీ బంక్‌లు. ఇక్కడ మ్యాగీ,టీ, శాండ్‌విచ్ వంటి ప్రాథమికమైన ఆహారంతో పాటు.. రుచికరమైన భోజనం కూడా లభిస్తుంది. అంతేకాదండోయ్.. రాజధాని నగరానికి దేశం నలుమూలల నుంచి వచ్చేవారిని దృష్టిలో ఉంచుకుని దక్షిణ భారత దేశానికి చెందిన వంటకాలు, చైనీస్ ఫుడ్, నార్త్ ఇండియన్స్ కోసం దాల్ మఖానీ, బట్టర్ చికెన్ తదితర ఆహార పదార్థాలు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా లభిస్తాయి. మీ ఆకలి కోర్కెను తీర్చుతాయి. దోస్తులు లేదా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి మరీ ఇక్కడ హాయిగా ఆరగించవచ్చు. దేశ రాజధాని నగరం ఢిల్లీలో లేట్ నైట్ లో మంచి భోజనం లభించే ఐదు హోటళ్ల గురించి తెలుసుకుందాం!

పెంటా కేఫే ఎక్స్‌ప్రెస్(Penta Cafe Xpress)



ఇది ఢిల్లీలోని మోడల్ టౌన్-1లో పెంటామ్డ్ ఆస్పత్రి సమీపంలో ఉంది. ఇక్కడ దాదాపు 20 రకాల ఆహార పదార్థాలు లభిస్తాయి. ముఖ్యంగా టీ తో సహా మ్యాగీ, పాస్తా, వెల్లుల్లి రొట్టె తదితర పదార్థాలు లభిస్తాయి. ఇక్కడ అన్ని ఆహార పదార్థాలు సరసమైన ధరలకే విక్రయిస్తారు. ఈ కేఫే రాత్రి 1గంట నుంచి 3 గంటల వరకు అంటే 2 గంటలు మాత్రమే మూసి ఉంటుంది.

కమ్‌సమ్ (Comesum)



కమ్‌సమ్ ..ఫ్యామిలీ రెస్టారెంట్. ఇది 24 గంటలు తెరిచే ఉంటుంది. నిజాముద్దీన్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉంది. ఇక్కడ 24 గంటలూ రుచికరమైన భోజనం లభిస్తుంది. అలాగే దేశంలోని అన్ని ప్రాంతాలకు సంబంధించిన ఆహారం లభిస్తుంది. భోజనం ధర మాత్రం 100 నుంచి 250 రూపాయలు వరకు ఉంటుంది.

మూల్ చంద్ పరంత్ వాలా(Moolchand Paranthe Walla)



మూల్‌చంద్ పరంత్ వాలా హోటల్ లజ్‌పత్ నగర్ సమీపంలో ఉంది. ఇది కూడా 24గంటలు ఓపెన్ చేసి ఉంటుంది. ఇది పరంతాలు, ఛాయ్‌కి ఫేమస్. ఆకలితో దాని పరిసరాల్లోకి వెళ్లగానే వంటకాల నుంచి వచ్చే ఒక రకమైన సువాసన మనలో మధురాను భూతిని కల్గిస్తుంది.



రైల్వే యార్డ్(Railway Yard)



ఇది గుజ్రన్‌వాలా టౌన్‌లో ఉంది. ఇక్కడ హాయిగా కూర్చొని తినేందుకు అనువుగా ఉంటుంది. సాయంత్రం 7 నుంచి తెల్లవారు జామున 4గంటల వరకు ఇది తెరిచి ఉంటుంది. ఇక్కడ ఉత్తర భారత వంటకాలు, చైనీస్ ఫుడ్‌తో సహా వివిధ దేశాల వంటకాలు లభిస్తాయి.


పటేల్ చెస్ట్‌టీ స్టాల్ (Patel Chest Tea Stall)

ఢిల్లీలోని పటేల్ చెస్ట్ లోని నార్త్ క్యాంపస్‌లో పటేల్ చెస్ట్ టీ స్టాల్ ఉంది. దీనిని ఉదయం 5గంటలకు ఓపెన్ చేస్తారు. ఇక్కడ గుడ్లు, మ్యాగీ,చాయ్ లభిస్తుంది. సమీపంలో ఉండే పెయింగ్ గెస్ట్‌లకు చాలా అనుకూలమైనది.

మొత్తానికి ఢిల్లీ సందర్శనకు వచ్చేవారికి, రాత్రి భోజన ప్రియులకు ఈ హోటళ్లు ఆకలి తీరుస్తూ..తమ ఉనికిని చాటుకుంటున్నాయి.

ఉన్నది నాలుగు రకాల యోగాలే!

మీరు ''నేను'' అనుకునేదంతా ఈ నాలుగు అంశాలే- మీ శరీరం, మనస్సు, భావాలూ, వీటికి మూలమైన మీ జీవశక్తి. ఈ నాలుగు అంశాలనీ మీరు ''నేను''గా భావిస్తున్నారు. ఏదైనా ఒక పెద్ద విషయం జరగాలంటే ఈ నాలుగూ కూడా సమన్వయంతో ఉండేలాగా మీరు చూడాలి. యోగా అన్నది ఈ నాలుగుకోణాలనీ సంపూర్ణమైన సమన్వయంలో ఉంచడానికి రూపొందించబడింది.




సద్గురుబోధ

మనిషి అంతిమసాయుజ్యాన్ని చేరుకోవడానికి ఉన్నవి నాలుగు మార్గాలే అని, అవి భక్తి, జ్ఞానం, కర్మ ఇంకా క్రియా మార్గాలని, వాటి విధానం ఎటువంటిదో ఒక చక్కటి కథ ద్వారా సద్గురు చెబుతున్నారు.

ప్రశ్న: మీరు ఏ యోగ సాధనలు చేయడం వల్ల అటువంటి పారవశ్య అనుభూతులను పొందారు?

సద్గురు: నేను ఇంతకు ముందు చెప్పినట్టు, అవి ఎంతో సరళమైనవి. భౌతిక మైనవి. వాటిలో ఏమీ ఆధ్యాత్మికత లేదు. ప్రస్తుతం, మీరు ''నేను'' అనుకునేదంతా ఈ నాలుగు అంశాలే- మీ శరీరం, మనస్సు, భావాలూ, వీటికి మూలమైన మీ జీవశక్తి. ఈ నాలుగు అంశాలనీ మీరు ''నేను''గా భావిస్తున్నారు. ఏదైనా ఒక పెద్ద విషయం



జరగాలంటే ఈ నాలుగూ కూడా సమన్వయంతో ఉండేలాగా మీరు చూడాలి. యోగా అన్నది ఈ నాలుగు కోణాలనీ సంపూర్ణమైన సమన్వయంలో ఉంచడానికి రూపొందించ బడింది. ఈ నాలుగు అంశాలూ- మీ శరీరం, మనస్సు, భావాలు, మీ శక్తి అంటే- మీ బుర్ర, హృదయం, చేతులు, శక్తి. ఇక్కడ ఎవరైనా కేవలం బుర్ర మాత్రమే ఉండి మనసు, చేతులు, శక్తిలేనివారు ఉన్నారా? మీరు ఈ నాలుగింటి సమ్మేళనం కదూ...?? అందుకని, నాలుగు ప్రాథమికమైన యోగాలూ మీకు అవసరం.

నాలుగు మార్గాలు

అసలు ఉన్నది నాలుగు యోగాలే. అవి జ్ఞానయోగం, భక్తియోగం, కర్మయోగం, క్రియాయోగం. జ్ఞానం అంటే, మీరు ముక్తిపొందేందుకు మీ బుద్ధిని ఉపయోగించడం. దీనిని జ్ఞానయోగం అంటాం. మీరు మీ భావాలను మీ పరమోన్నత స్వభావాన్ని చేరుకోవడానికి వాడితే, దానిని భక్తియోగం అంటాం. మీరు శరీరాన్ని ఉపయోగించి, ముక్తిని లేదా పరమోన్నత స్వభావాన్ని చేరుకోవాలను కుంటే దానిని కర్మయోగం అంటాం. మీ అంతశక్తులను పరిణామం చెందించు కోవడం ద్వారా మీరు పరమోన్నత స్థితిని చేరుకోవాలి అనుకుంటే దానిని క్రియా యోగం అంటాం.

ఈ నాలుగు విధానాలు మాత్రమే ఉన్నాయి. కానీ ''నేను ఏది తీసుకోవాలి?'' అన్నది మీ ప్రశ్న. అలాంటి ఎంపిక ఏమీ లేదు. ఎందుకంటే మీరు ఈ నాలుగింటి సమ్మేళనం. మీరు ఈ నాలుగింటిని కూడా సరైన పాళ్లల్లో వినియోగించుకోవాలి. ఒకరికి, వారి తర్కం ఎంతో ప్రగాఢంగా ఉండవచ్చు. కొంతమందికి, శరీరం అలా ఉండవచ్చు. అందుకని, ఒక సరియైన కలయిక అవసరం. లేదంటే, ఆధ్యాత్మిక ప్రక్రియ జరగదు.

జ్ఞాన యోగి తన బుద్ధిని ఉపయో గించి ఆలోచిస్తూ ఉంటాడు. ఈయనకి, మిగతావారంటే చిన్న చూపు. యోగ సాంప్రదాయంలో ఒక అందమైన కథ ఉంది. ఒకరోజున నలుగురు మనుషులు అడవిలో నడుస్తున్నారు. వారిలో ఒకరు జ్ఞానయోగి, ఒకరు భక్తియోగి, ఒకరు క్రియాయోగి, ఒకరు కర్మయోగి. సాధారణంగా, ఈ నలుగురూ కలిసి కట్టుగా ఎప్పుడూ ఉండలేరు. ఒకరంటే ఒకరికి పడదు. జ్ఞానయోగి తన బుద్ధిని ఉపయోగించి ఆలోచిస్తూ ఉంటాడు. ఆయనకి మిగతావారంటే చిన్నచూపు. ప్రతివారినీ మూర్ఖులుగా భావిస్తాడు. ముఖ్యంగా ఈ భక్తి కలిగినవాళ్లతే, ''పైకి చూసి రామ్...రామ్...అంటూ ఉంటారు'' అని పరిహసిస్తాడు. వాళ్లని వీళ్లు భరించలేరు. భక్తిలో ఉన్న ప్రజలకి అందరిపై సానుభూతి ఉంటుంది. భగవంతుడు ఇంత ఉన్నప్పుడు ఆయన చెయ్యి పట్టుకుని నడవక, ఈ జుట్టుపీక్కోవడం అంతా ఎందుకూ...? ఈ యోగా ఏంటి, తలమీద నించోవడం, శ్వాసను బిగబట్టడం, శరీరాన్ని వంచడం...ఇదంతా కూడా చెత్త. కేవలం భగవంతుడి నామం ఉచ్ఛరిస్తే చాలు, జరగాల్సింది అంతా జరుగుతుంది అనుకుంటారు. ''వీళ్లందరూ బద్ధకస్తులు. ఆ బద్ధకాన్ని కప్పి పుచ్చుకోవడానికి ఇలాంటి పిచ్చి యోగాలన్నీ చెప్పుకున్నారని''అనుకుంటాడు కర్మ యోగి. క్రియాయోగికి ఎవరూ పట్టరు. ఎందుకంటే వీరికి జీవితం అంతా కూడా శక్తే. మీ శక్తిని కనుక పరిణామం చెందించుకోపోతే అసలు మార్గమేదీ అనుకుంటారు. అందుకని ఈ నలుగురూ ఒకరితో ఒకరు మనలేరు. కానీ ఒకరోజున వాళ్లందరూ కలిసి నడుస్తున్నారు. ఉన్నట్టుండి ఒక పెద్దగాలి వాన వచ్చింది. వాళ్లు ఎక్కడైనా తలదాచుకుందామని ఒక నీడ దొరుకుతుందేమో అని చూస్తూ పరిగెత్తడం మొదలుపెట్టారు. భక్తియోగికి ఎక్కడ దేవాలయాలు ఉంటాయో తెలుసు. అందుకని ఆయన, అడవిలో ఇటుగా వెళితే అక్కడ ఒక పురాతనమైన దేవాలయం ఉంది. అక్కడకు వెళ్దాం. కొంత నీడ దొరుకుతుందని అన్నారు. వాళ్లందరూ కూడా అటువైపు పరు గెత్తారు. అక్కడ, ఒక ఆలయం కనిపించింది.

ఆ ఆలయం కూలిపోయే స్థితిలో ఉంది. కేవలం, కొద్దిగా పై కప్పు మాత్రం ఉంది. నాలుగు స్తంభాలున్నాయి. అక్కడ గోడలు ఏమీ లేవు. అవన్నీ ఎప్పుడో కూలి పోయాయి.


అన్నిటికంటే ఇదే పెద్ద సమస్య. ఈ నాలుగు కోణాలూ ఒక సరియైన అను సంధానంలో లేవు. తుఫాను మరింత ఉధృతం అవ్వడంతో, వాన అన్ని దిక్కుల నుంచి లోపలికి కొట్టసాగింది. వాళ్లందరూ దగ్గరగా, మరింత దగ్గరగా రాసాగారు. ఆ గుడి మధ్యలో ఒక శివలింగం ఉంది. అక్కడ, తలదాచుకునేందుకు మరేచోటూ లేదు. అందుకని వాళ్లందరూ కూడా ఆ శివలింగాన్ని హత్తుకున్నారు. ఇది భగవంతుడి మీద ప్రేమతోనో, మరొక దానివల్లో కాదు. కేవలం ఆ తుఫాను నుంచి తప్పించుకోవడానికి. ఉన్న ఫళంగా భగవంతుడు ప్రత్యక్షం అయ్యాడు. వాళ్ల నలుగురి మనసులలోనూ ఒకటే ప్రశ్న. ''ఇప్పుడేమిటి..?'' మేము ఇంత యోగా చేశాం. ఇంత సాధనం చేశాం అప్పుడంతా నువ్వు రాలేదు. ఇప్పుడు కేవలం వాన నుంచి తలదాచుకోవాలని చూస్తుంటే, నువ్వు ఇక్కడికి వచ్చావు. ఎందుకూ...?? అన్నారు. దానికి భగవం తుడు, ''ఆఖరికి మీ నలుగురు మూర్ఖులూ ఒక్కటిగా చేరారు. నేను ఈక్షణం కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాను'' అని అన్నాడు. అన్నిటికంటే ఇదే పెద్ద సమస్య. ఈ నాలుగు కోణాలూ ఒక సరియైన అనుసంధానంలో లేవు. అలా లేకపోతే చెప్పుకోదగ్గ పెద్ద విషయం ఏదీ జరుగదు. మీరు ఒక కార్ నడిపించాలని చూస్తున్నారను కోండి, ఒక చక్రం ఒకవైపు, మరొక చక్రం మరొక వైపు వెళ్తుంటే అది ఎంత నరకంగా ఉంటుంది...?? ఇప్పుడు ప్రజలు అనుభవిస్తున్న నరకం ఇలాంటిదే. వాళ్ల మనస్సు ఒకవైపు, హృదయం ఒకవైపు, శరీరం మరొక వైపు, శక్తులు ఇంకెక్కడో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో వాళ్లు ఎక్కడికి వెళ్లాలనుకున్నా సరే తేలికగా ఎలా వెళ్లగలు గుతారు? యోగ, మనం ఇక్కడ ''ఇన్నర్ ఇంజనీరింగ్''గా సూచి స్తున్నది ఏమిటంటే ఈ నాలుగు చక్రాలను సజావుగా ప్రయాణించే విధంగా చేయడమే. ప్రస్తుతం, మీరు నరకం దిశగా ప్రయాణి స్తున్నా పరవాలేదు. మీ కారు కనుక సరిగ్గా వెళుతున్నట్లయితే వెంటనే మీరు ఒక యుటర్న్ చేయవచ్చు, కదా? కానీ నాలుగు చక్రాలు నాలుగు వేర్వేరు దిశల్లో వెళ్లాలనుకునే ఒక వాహనం అయితే చిత్రహింసే. మీరు ఎటువైపని వెళ్లగలరు? ఎటూ వెళ్లలేరు. కేవలం పరిస్థితులను బట్టి అటో, ఇటో నెట్టివేయబడతారు. మీ దిశను మీరు నిర్ణయించలేరు. మీరు నివసిస్తున్న పరిస్థితులు మీ దిశను నిర్ణయిస్తాయి. అంటే అది బానిస జీవితం, అవునా?

-సద్గురు జగ్గీవాసుదేవ్

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అనన్య శరణాగతి



శ్రీ రమణాశ్రమం
10-4-47

ఈ ఉదయం ఆంధ్ర యువకులొకరు శ్రీవారి కొక జాబు వ్రాసి చేతికిచ్చారు. అందులో ''స్వామీ, భగవానుని యందు అనన్య శరణాగతి చెందితే, సర్వం లభిస్తుందంటారు గదా. అనన్య శరణాగతి అంటే ఒకచోట స్థిరంగా కూర్చుని ఏ చింతలు లేకుండా శరీర పోషణ కావశ్యకమైన ఆహారాదుల చింత గూడా వదలి సదా భగవంతుని స్మరించుటేనా? వ్యాధిగ్రస్తుడనైతే, ఔషధసేవకై యత్నించక స్వస్థతాస్వస్థతలు భగవదధీనం చేయుటేనా? గీతలో స్థితప్రజ్ఞుని గురించి **'విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః, నిర్మమో నిరహంకార స్స శాంతి మధి గచ్ఛతి''** అనటం వల్ల, సమస్త కోరికలు త్యజించుటని గదా తేలుతుంది. అందు వల్ల, మనం భగవంతుని స్మరిస్తూ ఆహారపానీయాదులు భగవదాదేశమై ఆయాచితంగా లభిస్తే, స్వీకరించటమా? లేక, స్వల్పంగా యత్నించటమా? భగవాన్, ఈ శరణాగతి రహస్యం వివరించి అనుగ్రహించా''లని ఉన్నది.

భగవాన్ చూచి, సావధానులై సమీపస్థులతో ''ఇదుగో, అనన్య శరణాగతి అంటే ఏ చింతలు లేకుండా ఉండాలనటం సత్యమేగాని, దేహపోషణ కావశ్యకాలైన అన్న పానాదుల చింత గూడా వదలవలెనా అంటే ఏం చెప్పగలం. భగవదాదేశమై అయాచితంగా వస్తే తినవలెనా? కొద్ది ప్రయత్నం చేయవలెనా. అంటారే; దానంతటదే వస్తుందనుకో. తినటం ఎవరు తింటారబ్బా? నోట్లో గూడా పెడతారనుకో. మింగనైనా మింగాలా? అది మాత్రం యత్నం కాదూ? 'వ్యాధిగ్రస్తుడనైతే ఔషధం సేవించాలా? స్వస్థతాస్వస్థతలు భగవదధీనం చేసి, ఊరుకోవాలా?'' అంటారు. ''క్షుద్వ్యాధేః ఆహారం'' అన్నారు. దీనికి రెండర్థాలున్నవి. క్షుత్తున్నూ, వ్యాధివంటిదే గనుక క్షుత్తనే వ్యాధికి ఆహారమనే ఔషధమవసరమనీ, వ్యాధికి ఔషధం వలె, ఆకలికి ఆహారం ఇవ్వాలనీ చెప్పారు. శంకరులు వ్రాసిన సాధనా పంచకంలో **''క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం''**అని ఉన్నది. క్షుత్తనే వ్యాధికి చికిత్సగా భిక్షాన్నం తినమన్నారు. భిక్షకైనా పోవాలి గదా? అంతా కళ్లు మూసుకొని కదలక కూర్చుని 'వస్తే తింటా' మంటే లోకయాత్ర నడిచేదెట్లా? అందువల్ల వారి వారి సంస్కారాన్ననుసరించి ప్రాప్తమైనది అనుభవిస్తూ కర్తృత్వ రాహిత్యంగా ఉండాలి. నేను చేస్తున్నాననే భావనే బంధం. ఆ బంధం లేకుండా ఉండే విధానం యోచించి తెలుసుకోవాలి గాని, ఆకలికి ఆహారం, వ్యాధికి మందు ఇవ్వవచ్చునా లేదా? అని శంకలు పెట్టుకుంటే, అంతులేకుండా శంకలు వస్తూనే ఉంటవి. ఊ అని మూల్గవచ్చునా? ఊపిరి పీల్చవచ్చునా? అన్న శంక గూడా బయలుదేరుతుంది. ఈశ్వరుడనుకో, కర్మనుకో, ఏదో ఒక కర్త వారి వారి సంస్కారాన్ని బట్టి అన్నీ తానే నడుపుతాడు. భారం అతనిమీద వేసి, బంధం లేకుండా వుంటే నడిచేది తానే నడుస్తుంది. భూమిమీద నడుస్తూ ఉంటాం. అడుగడుక్కు కాలు ఎత్తాలి, నిలపాలి అని గమనిస్తామా, దానంతటది నడక సాగటం లేదూ? ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ అంతే. క్షణక్షణం ఊపిరి పీల్చాలి, విడవాలి అని ప్రయత్నించటం లేదే. ఆవిధంగానే ఇదీను. ఏదైనా విడవాలంటే విడవగలమా? చేయాలంటే చేయగలమా. తెలిసీ తెలియక ఆ ప్రయత్నంగానే లోగడ ఎన్నో పనులు జరుగలేదా? ముందు జరుగవా? భగవానునందు అనన్య శరణాగతి చెందటమంటే, ఇతర చింతలన్నీ వదలి మనస్సు అతని యందే లగ్నం చేయాలి. ఎంతెంత మగ్నం చేస్తామో, అంతంతగా ఇతర చింతలు దూరమౌతవి. మనోవాక్కాయ కర్మలన్నీ భగవత్పరంగా ఉంటే, మన కార్యభారం ఆయనమీదే ఉంటుంది.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)


- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

భగవద్గీత

దేవతలపై శ్రద్ధను స్థిరం చేసేది నేనే!



అధ్యాయం 7

శ్లోకం 21:

యోయో యాంయాం తనుం భక్తః
శ్రద్ధయార్చితుమిచ్ఛతి।
తస్య తస్యాచలాం శ్రద్ధాం
తామేవ విదధామ్యహమ్॥

తాత్పర్యం


నేను ప్రతివారి హృదయంలో పరమాత్మరూపాన నిలిచి యుంటాను. ఎవరైనా ఒక దేవతను పూజింప గోరినంతనే నేను అతని శ్రద్ధను స్థిరం చేసి ఆ దేవతకు అతడు భక్తుడగునట్లు చేయుదును.

భాష్యం

భగవంతుడు అందరికి స్వేచ్ఛను ప్రసాదించాడు. ఎప్పుడైతే ఒక వ్యక్తి భౌతిక ఆనందం కోసం కొందరు దేవతలను ఆశ్రయిస్తాడో, ఆ వ్యక్తి హృదయంలో పరమాత్మ రూపంలోనున్న భగవంతుడు ఆ కోరికలను గ్రహించి తగిన ఏర్పాట్లను చేస్తాడు. అయితే 'భగవంతుడు ఎందుకు అటువంటి ఏర్పాట్లు చేసి వారి పతనానికి అవకాశమిస్తున్నాడు?' అని అడగవచ్చును. భగవంతుడు బలవంతం చేస్తే స్వేచ్ఛనివ్వటంలో అర్థమే లేదు. అయితే తను వంతు తాను భగవద్గీత ద్వారా శరణాగతి పొందమని కూడా సూచిస్తూ ఉన్నాడు. ఇక తన స్వేచ్ఛను ఎలా వినియోగించుకోవాలి అనేది జీవుడి బాధ్యత. అయితే భగంతుని ఆజ్ఞలేనిదే గడ్డి పోచైనా కదలదు అన్నట్లు, దేవతలు, జీవులు ఇద్దరూ ఆయనపైనే ఆధారపడి ఉన్నారు. శాస్త్రాలలో ఏ దేవతను పూజిస్తే ఏ వరమిస్తారో పొందుపరచటం జరిగింది. ఇటు భక్తున్ని ప్రేరేపించటంలోనూ, అటు దేవతలను వరమొసగమని ప్రేరేపించటంలోనూ, పరమాత్మగా తన పాత్రను పోషిస్తూ ఉంటాడు. ఆయన ప్రమేయం లేనిదే ఇరువురి మధ్యా ఏ సంబంధం ఏర్పడలేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

త్రిశంకు స్వర్గం



సంక్షిప్త రామాయణం

ఇక్ష్వాకు వంశీయుడైన త్రిశంకువుకు బొందితో స్వర్గం చేరాలనే విచిత్రమైన కోరిక కలిగింది. అతడు తన కులగురువు వసిష్ఠుని వద్దకు వెళ్లి తన కోరిక వెల్లడించాడు. 'సశరీరంగా స్వర్గాన్ని చేరడం అసాధ్యం. అలాంటి యజ్ఞాలు నేను చేయను' అని వసిష్ఠుడు తిరస్కరించాడు. త్రిశంకువు తపోనిష్ఠులైన వసిష్ఠుని పుత్రుల వద్దకు పోయి తన కోరిక తెలిపాడు. 'మీ తండ్రి తిరస్కరించాడు. మీరైనా నన్ను సశరీరంగా స్వర్గానికి పంపే యజ్ఞం చేయండని' ప్రాధేయపడ్డాడు.

వసిష్ఠుని కొడుకులు నూరుగురు త్రిశంకు వింత కోరిక విని ఆశ్చర్యపోయారు. 'వసిష్ఠుడు చెప్పిన హితవును లెక్కచేయక, మమ్మల్ని ఆశ్రయించావా? ఇక్ష్వాకు వంశానికి పరమ గురువు వసిష్ఠుడే. అతడు తిరస్కరించిన యజ్ఞాన్ని జరిపించి, అతనిని మేము అవమానించాలా?' అన్నారు. 'గురువు తిరస్కరించాడు. గురుపుత్రులైన మీరు తిరస్కరించారు నేను ఇంకెవరినైనా ఆశ్రయించి నా కోరిక తీర్చుకుంటాను' అని హుంకరించి మాట్లాడాడు. వసిష్ఠుని పుత్రులు కోపించి, 'నీకు చండాలత్వం ప్రాప్తిస్తుంది' అని శపించారు. వెంటనే త్రిశంకువు చండాలరూపుడయ్యాడు.

చండాలరూపుడైన త్రిశంకువు వసిష్ఠుని శత్రువు విశ్వామిత్రుని ఆశ్రయించాడు. వసిష్ఠుని తిరస్కారం, వసిష్ఠ పుత్రుల శాపం, తన కోరిక తెలిపాడు. విశ్వామిత్రుడు జాలిపడి, ఆ యజ్ఞం తాను జరిపిస్తానని మాట ఇచ్చాడు. 'నిన్ను బొందితో స్వర్గానికి పంపిస్తాను' అన్నాడు. విశ్వామిత్రుడు కొడుకులను పిలిచి, యజ్ఞానికి అవసరమైన సంభారాలను సిద్ధం చేయమన్నాడు. యజ్ఞానికి మునులందరినీ ఆహ్వానింపుమన్నాడు. వసిష్ఠుని పుత్రులు నూరుగురు, మహోదయుడు అనే ముని ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. 'యజ్ఞకర్త చండాలుడు. యజ్ఞం చేయించేవాడు క్షత్రియుడు అలాంటి యజ్ఞంలో హవిర్భాగాలను దేవతలు స్వీకరిస్తారా? ఇలాంటి అనాచారానికి మేము పాల్పడలేము' అని దూషించారు. వారు ఈ విషయం విశ్వామిత్రునికి తెలిపారు. విశ్వామిత్రుడు మండిపడ్డాడు. వ్రత నియతుడనై తపస్సు చేస్తున్న నన్నే తూలనాడతారా? వారు ఏడు నూర్ల జన్మలవరకూ శవాలను తింటూ జీవిస్తారు. ముష్టికులు అనే హీన జాతులై కుక్క మాంసం తింటూ జీవిస్తారు. మహోదయుడు కిరాతుడై అందరిచే దూషింపబడతాడు' అని శపించాడు. తక్కిన మునులు విశ్వామిత్రుడు శపిస్తాడనే భయంతో హడలిపోయారు. యజ్ఞానికి సహకరించారు. శాస్త్రోక్తంగా యజ్ఞ కర్మలన్నిటినీ ఆచరించారు. విశ్వామిత్రుడు వేద మంత్రాలను పఠిస్తూ దేవతలను ఆహ్వానించాడు. హవిర్భాగాలను స్వీకరించడానికి దేవతలు ఎవ్వరూ రాలేదు.

విశ్వామిత్రుడు తన తపఃఫలాన్ని ధారపోసి త్రిశంకువును బొందితో స్వర్గానికి పంపాడు. 'గురు శాపదగ్ధుడి వైన నీవు స్వర్గ ప్రవేశానికి అనర్హుడవు' అని ఇంద్రుడు త్రిశంకువును త్రోసివేయించాడు. విశ్వామిత్రుడు తన తపో మహిమతో త్రిశంకువు నేల పడకుండా అడ్డుకున్నాడు. అంతరిక్షంలో కొత్త నక్షత్ర మండలాన్ని సృష్టించాడు. మరొక ఇంద్రుని సృష్టిస్తాను. ఈ ఇంద్రుని లేకుండా చేస్తాను అంటూ మరొక స్వర్గాన్ని సృష్టించబోయాడు. ఋషులు, దేవతలు ప్రార్థించి విశ్వామిత్రుని శాంతింపజేశారు. 'మహాత్మా! గురుశాపదగ్ధుడైన త్రిశంకువు స్వర్గ ప్రవేశానికి అర్హుడు కాదు అని వారందరూ ముక్త కంఠులై ఘోషించారు. 'త్రిశంకువును బొందితో స్వర్గానికి పంపుతాను అని ప్రతిజ్ఞ చేశాను. నా ప్రతిజ్ఞ భంగం కారాదు. ఇప్పుడు త్రిశంకు ఉన్న అంతరిక్షమే అతనికి శాశ్వత స్వర్గం అవుతుంది. నేను సృష్టించినవి అన్నీ ఈ లోకాలు ఉన్నంతవరకూ ఉంటాయి. దీనికి మీరు అంగీకరించక తప్పదు అన్నాడు విశ్వామిత్రుడు. దేవతలందరూ మునీంద్రా! అట్లే కానిమ్ము. గురువునకు అపచారం చేశాడు కాబట్టి త్రిశంకువు అధోముఖుడై ఉంటాడు అన్నారు.

- కె. ఓబులేశు
9052847742

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.


తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతి కూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.



మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.

శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



సంస్కృతి



భక్తులనాకట్టుకునే సమ్మక్క,సారలమ్మల ఉపజాతరలు

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మల జాతరకు దూరభారంతో, వ్యయప్రయాసలతో వెళ్లలేని భక్తులకు ఆయా ప్రాంతాల్లో అందుబాటుల్లో తల్లిదేవతల ఉపజాతరలు అనేకం వెలిశాయి. వెలుస్తూనే ఉన్నాయి. అందిన సమాచారం ప్రకారం ఉపజాతరల వివరాలు ఇలా ఉన్నాయి.

ఆగ్రంపహాడ్

ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూర్ మండటం ఆగ్రంపహాడ్‌లో రెండో అతిపెద్ద సమ్మక్క-సారలమ్మ జాతర పూర్వం నుండి జరుగుతోంది.

గుర్రంపేట

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గుర్రంపేటలో వైభవోపేతంగా జాతర జరుగుతుంది. సమ్మక్క తల్లి పుట్టింది గుర్రంపేట, మెట్టింది మేడారంగా స్థలపురాణం ఉండడంతో గుర్రంపేట జాతరకు విశిష్టత ఏర్పడింది.

మద్దిమేడారం జాతర

ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి శివారులోని మద్దిమేడారంలో జాతర జరుగుతోంది.

లింగంపల్లి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పురం మండలం లింగంపల్లిలో సమ్మక్క, సారక్క జాతర నిర్వహించబడుతోంది.

శంకరపట్నం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండల కేంద్రంలో చాలా ఏళ్లుగా జాతరను నిర్వహిస్తున్నారు.

గుమ్లాపూర్, రాగంపేట గ్రామాల్లో

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండలం గుమ్లాపూర్, రాగంపేట గ్రామాల్లో జాతర జరుగుతోంది.

అమ్మవారి పేట

వరంగల్ జిల్లా ఉర్సు శివారు అమ్మవారు పేట దామెరగుట్ట వద్ద జాతర జరుగుతుంది.

హుజురాబాద్

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సమీపంలోని రంగనాయకుల గుట్ట వద్ద సమ్మక్క సారక్క జాతర జరుగుతోంది.

గోలివాడ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం మండలం గోలివాడ గ్రామంలో జాతర జరుగుతున్నది.

అనేక గ్రామాల్లో

రేగొండ మండలం తిరుమలగిరి, సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ళ, పెద్దపల్లి మండలం హన్మంతునిపేట, హుజురాబాద్ మండలం జూపాక, మొగుళ్ళపల్లి మండలం, ములుకలపల్లి, మొగుళ్ళపల్లి, మహదేవపురం మండలం కాళేశ్వరం ఇంకా ఎన్నో గ్రామాల్లో సమ్మక్క, సారలమ్మల ఉపజాతరలు జరుగుతున్నాయి. జాతరల్లో వేలాదిమంది భక్తులు మొక్కులు చెల్లించుకుంటూ సమ్మక్క-సారలమ్మ వనదేవతల ప్రీతిపాత్రమవుతూ పాడి పంటలతో, పిల్లాపాపలతో, సకలసంపదలతో, సుఖసంతోషాలతో జీవిస్తున్నారు.

సమ్మక్క ఆడపడుచు లక్ష్మీదేవక్క

మేడారంలోని సమ్మక్క, సారలమ్మ దేవతలకు పూజారులున్నట్లే పరివార వనదేవతలకు సహితం ఆయా ప్రాంతాల్లో ఉన్నారు. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని నగరం పల్లిలో సమ్మక్క తల్లి ఇంటి ఆడపడుచు లక్ష్మీదేవక్కకు పూజారులు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ విషయం పూర్వకాలంలో ప్రాచుర్యంలోకి రాలేదు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు నగరం పల్లి నుండి లక్ష్మీదేవక్క ఆమె భర్త కృష్ణస్వామి, మరిది పోతురాజుల విగ్రహాలు జాతర తొలిరోజు గద్దెలపైన ప్రతిష్టించిన అనంతరమే సమ్మక్క, సారలమ్మలను కుంకుమ భరిణ రూపంలో తీసుకువచ్చే ప్రక్రియ మొదలవుతుందని గిరిజనులు



మేడారం సమ్మక్క, సారలమ్మల గద్దెలను చేరుకుంటారు. వీరితో పాటు ఆ దేవతల్ని ఏలుకునే గుర్రం పేట, బూర్గుపేట, వజినపల్లి, జంగేడు, కాళేశ్వరం, మంగపేట, ఏటూరునాగారం తదితర ప్రాంతాల నుంచి నాయకపు పోడ్ పూజారులు లక్ష్మీదేవక్క, కృష్ణస్వామి, పోతురాజు విగ్రహాలు తెచ్చి గద్దెలపై ప్రతిష్టిస్తారు. ఈ విగ్రహాల ప్రతిష్టలో మొదటి అవకాశం తమదేనని నగరంపల్లి నాయకపు పోడ్ పూజారులు చెబుతారు.

నగరం పల్లి నాయకపు వారికే ఎందుకు ఆ బాధ్యత

కాకతీయులలో జరిగిన యుద్ధంలో సమ్మక్క కూతురు సారలమ్మ భర్త పగిడిద్ద రాజు, కుమారుడు జంపన్న, అల్లుడు గోవిందరాజుతో పాటు ఆడపడుచు లక్ష్మీదేవక్క కూడా వీరోచితంగా పోరాడి యుద్ధంలో వీరమరణం పొందారు. సమ్మక్క సైన్యం మరణించడంతో మేడారమంతా శ్మశానంగా మారింది. యుద్ధంలో మిగిలిన కొంతమంది మేడారం వదిలి దూరప్రాంతాలకు వలస వెళ్లారు. ఆ క్రమంలో మిగిలిన లక్ష్మీదేవక్క కుటుంబం నగరం పల్లి, బూర్గుపేట, గుర్రంపేట, వజినపల్లి, జంగేడు, కాళేశ్వరం, మంగపేట, ఏటూరునాగారం, ములుగు తదితర గ్రామాలకు వలస వెళ్లింది. ఈ నేపథ్యంలో తొలుత జాతర నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండగా నగరంపల్లి నుండి లక్ష్మీదేవతను కొలువడానికి రెడ్డి,మేకల వంశం వారు గద్దెలపైన విగ్రహాల ప్రతిష్ట బాధ్యతను తీసుకొని పూర్వం నుంచి ఆచారాన్ని చెబుతారు. నగరంపల్లిలోని నాయకపు పోడ్‌వారు రెడ్డి, మేకల తదితర వంశాల వారి ఆధ్వర్యంలో దేవతల పూజా కార్యక్రమాలు జరుపుతారు. ఈ గ్రామనాయకపువారు గిరిజన సంప్రదాయ రీతిలో ఆ దేవతలకు రెండు గుళ్ళు కట్టుకున్నారు. సదరు నాయకపుపోడ్‌వారు గ్రామం నుంచి మేడారం జాతరకు రెండు రోజుల ముందు నుండే దేవతల విగ్రహాలతో, పూనకాలతో, నియమనిష్ఠలతో కాలినడకన మేడారంకు బయలుదేరి వెళతారు. బూర్గుపేట, పొట్లాపురం, కాల్వపల్లి, దూదేకులపల్లి మీదుగా కొనసాగిస్తున్నారు.

ఒక్కొక్క వంశానికి ఒక్కొక్క దేవతను తెచ్చే బాధ్యత


బుధవారం సారక్కను తెచ్చే బాధ్యతను కన్నెపల్లి నుంచి కాకవంశం వారు నిర్వహిస్తున్నారు. పగిడిద్దరాజును ఆయన స్వంతగ్రామం పూనుగుండ్ల నుంచి పెనుకవంశం వారు తెస్తారు. జంపన్నను మేడారం నుంచి సిద్ధబోయిన వంశంవారు, గోవిందరాజు, నాగులమ్మలను వారి సొంత గ్రామం కొండాయి నుంచి దబ్బకట్ల వంశం వారు తీసుకొస్తారు. సమ్మక్క తల్లి పసిబిడ్డగా దొరికిన పడిగపురం వనగట్టు నుండి వనదేవతలను కొక్కెర, మౌలానాల వంశీయులు మేడారంలోని చిలుకల గట్టు నుంచి తెస్తారు. చంద్రయం పల్లి, కొక్కిరి, సిద్దబోయిన, బంగారి, మల్లెల వంశాల వారు తీసుకురావడానికి బాధ్యతలు తీసుకున్న క్రమంలో గణపురం మండలం నగరం పల్లి నుండి మేకల వంశం వారు లక్ష్మీదేవక్క, కృష్ణస్వామి, పోతురాజు వనదేవతలను గద్దెలమీదకు తీసుకురావడానికి బాధ్యతలు తీసుకొని ఆ మేరకు పూర్వకాలం నుంచి ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. సమ్మక్క, సారలమ్మల మహాజాతర మేడారంలో 2018 జనవరి 31, ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరుగుతున్న క్రమంలో జనవరి 25న నగరంపల్లి నుంచి లక్ష్మీదేవక్క పరివార దేవతల విగ్రహాలను తీసుకొని మేడారం బయలుదేరుతున్నట్లు పూజారులు తైదం సారయ్య, బుచ్చాలు, మంగపోషయ్య, మేకల కైలాసం, మంగ భీమయ్య, మేకలసంపద్, తైనం లక్ష్మయ్య, చేను చంద్రు, మేకల లక్ష్మయ్యను, మంగ మల్లయ్య, సీతయ్య, నరేష్, లచ్చులు, సాంబయ్య, మల్లేష్ తదితరులు తెలిపారు. తాము మేడారంకు రానుపోను కాలినడకన ఐదురోజులు పడుతుందని చెప్పారు. లక్ష్మీదేవక్కను తాము తమ ఇలవేల్పుగా సమ్మక్క, సారలమ్మల వల్లే కొలుస్తామన్నారు. లక్ష్మీదేవక్క శక్తి దేవతై కోరినవారికి కొంగుబంగారంగా వరాలిచ్చే తల్లి దేవత అయినందుననే ఆ దేవతను నమ్ముకున్నవారు మేడారం మార్గమధ్యంలోని పల్లెల్లో అనేకమంది భక్తులు కానుకలు, నగదు రూపేణా వేస్తుంటారని చెప్పారు. ఆ డబ్బును తాము జాతర తల్లి దేవతల పేరున ఖర్చు చేస్తామని చెప్పారు. ఆ డబ్బు నుంచి ఒక్క రూపాయి మిగలకుండా ఖర్చుచేసి గ్రామానికి తిరిగి వస్తామని నగరంపల్లి లక్ష్మీదేవక్క నాయకపోడ్ పూజారులు తెలిపారు.

వనదేవుళ్ళ పూజారుల వంశాలు

మేడారం వనదేవతల (వనవీరుల) పూజారుల వంశాలు ఇలా ఉన్నాయి. సమ్మక్కను సిద్దబోయిన చందా, కొక్కెర, వంశస్తులు, సారలమ్మను కాకవంశస్తులు అలాగే గుట్టమీది ముసలయ్య (అనువారి కన్నయ్య)ను తవిటి, పగిడిద్దరాజును పెనక, గోవిందరాజును దబ్బకట్ల, బాలగోముడు (బాలకుమారస్వామి) ను కొటెం, గుంజేడు ముసలయ్యను తోలెం, బంగారు వజ్జయ్యను వజ్జ, కొవ్మాలమ్మను 'వాసం', గుండం మీది రామక్కను 'గట్టి', పాలంపేట రామక్కను కొలిచే సంతతి లేదు. గట్టమ్మను నాయకపోడు, సూరక్క, మారక్కను 'నాలి' వంశస్తులు అనాదిగా దైవాలుగా కొలుస్తూ పూజారులుగా వ్యవహరిస్తున్నారు.


- తాళ్లపల్లి యాదగిరి గౌడ్
9949789939

చిత్రకళకు వన్నె తెచ్చిన అమృతాషేర్ గిల్









భారతదేశంలో చీరలపై వివిధ చిత్రాలు, ప్రకృతి శోభలు కనిపిస్తుంటాయి. చీరకట్టుకుని ఆనందించే మహిళలకు ఆ చీరల వెనుక ఉన్న శ్రమ ఎంతటిదో తెలియకపోవచ్చు. ముఖ్యంగా దీని వెనుక చిత్రకళ దాగుంటుంది. అందులో ఒక స్త్రీ చిత్రకళను అభ్యసించి పేరుగాంచింది. అలాంటి చిత్రకళాకారిణి గురించి తెలుసుకోవడం అవసరమనిపిస్తుంది. ఆమె అమృతాషేర్‌గిల్. అమృతాషేర్‌గిల్ 1913 జనవరి 30వ తేదీన భారతీయుడైన సర్దార్ ఉమ్రాన్‌సింగ్, మేరి ఆంటోనియల్ (హంగేరి) దంపతులకు జన్మించింది. గిల్ భారతీయ సంప్రదాయ చిత్రకళను అమితంగా ప్రేమించింది. ఆమె మొదట పారిస్‌లో చిత్రలేఖనంపై శిక్షణ పొందింది. తదుపరి భారతదేశం వచ్చి చిత్రలేఖనంలో మెరుగుదిద్దుకుంది. భారతదేశంలోని అనేక సుందర ప్రదేశాలను సందర్శించి తనకుంచెతో ఆ దృశ్యాలను అద్భుతంగా చిత్రించడం అలవరుచుకుంది. తనకంటూ ఒక శైలిని ఏర్పరుచుకుంది. ప్రకృతి దృశ్యాలనేగాక శ్రమజీవుల చిత్రాలను, మహిళా చిత్రాలను అద్భుత కళాఖండాలుగా తీర్చిదిద్దింది. కొన్ని చిత్రాలు చీరలపైకి కూడా ఎక్కేది. 1936లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలను సందర్శించి ఇక్కడి ఆచార వ్యవహారాలను, పండుగలను సంప్రదాయ వివాహాలను పరిశీలించి వాటిని కుంచెతో ప్రతిభావంతంగా చిత్రించింది. అలాగే అజంతా, మొఘల్, పహారీ శైలులలోనూ అనేక చిత్రాలు గీసింది అమృతా షేర్‌గిల్. ఆమె చిత్రాలను చూసిన ఎంతోమంది ప్రముఖులు ఆమెపై ప్రశంసలవర్షం కురిపించారు. రవీంద్రనాథ్ ఠాగూర్, జెమినీరాయ్ వంటివారు ఆమె చిత్రాలను మెచ్చుకున్నారు. 1938లో విలేజ్‌సీన్, అదే సంవత్సరం ఇన్ ద లేడీస్, సెయిష్టా, 1941లో పట్టణ మహిళ, 1932, హంగేరియన్ గిప్సీగర్ల్ వంటి చిత్రాలను చిత్రించింది. ఈ చిత్రాలతో ఆమె గొప్ప చిత్రకారిణిగా పేరుపొందింది. 1923లో ఒక సంవత్సర కాలం పాటు తల్లితో కలిసి ఇటలీలో ఉన్నది. అయినప్పటికీ ఎక్కువకాలం ఇటలీలో ఉండటానికి ఇష్టపడలేదు. భారతీయ జీవనవిధానం పట్ల ఆమెకు అమిత ఆసక్తి. ఈ కారణం చేత 1924లో భారత్‌కు తిరిగి వచ్చింది. గాంధేయ సిద్ధాంతాల పట్ల ఆకర్షితురాలై ఆ సిద్ధాంతాలననుసరిస్తూ కొన్ని చిత్రాలను గీసి ఆ చిత్రాలతో నెహ్రూను కలిసింది. ఆ చిత్రాలను చూసి ఆశ్చర్యపోయిన నెహ్రూ ఈ కళాఖండాలను ప్రచారసాధనంగా ఉపయోగించాలని నిర్ణయించారు. ఈమె గీసిన చిత్రాలు నేషనల్ ఆర్ట్స్ గ్యాలరీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ నందు ప్రదర్శితమైనాయి. అవి అక్కడే శాశ్వతంగా ఉంచబడ్డాయి. అవి నేటికీ సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. అంతటి గొప్ప చిత్రకళాకారిణి చిన్న వయసులోనే డిసెంబర్ 6,1941న అనారోగ్యంతో లాహోరులో కన్నుమూసింది.

- ముప్పిడి రాంబాబు

మరుగున పడిన రాధాకృష్ణ నాటకం

రాధాకృష్ణ నాటకం పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి రచన. ఆరోజులలో మంచి ప్రాచుర్యంలో ఉండేది. అయితే శ్రీకృష్ణ తులాభారం నాటకం వచ్చిన తరువాత ఈ నాటకం మరుగున పడిపోయింది. ఇది పానుగంటి వారి అద్భుత రచన. శ్రీకృష్ణుడు గోకులం విడిచి ద్వారకకు వెళ్లిన తరువాత గోకులంపై మోజుకు సంబంధించిన గాథ ఇది. సత్యభామకు రుక్మిణి మీద లాగే రాధపై సవతి మాత్సర్యం. పల్లెటూరి బైసు ఆమెలో ఏముంది? అని ఎద్దేవా చేస్తుంది. ఇందులో ప్రధాన పాత్ర రాధ. ఆ పాత్రను దారుపల్లి సుబ్బారావుగారు సమర్ధవంతంగా ధరించేవారు. సి.ఎస్.ఆర్. తన పదిహేడవ ఏట ఇందులో కృష్ణపాత్ర ధరించి అఖండమైన పేరు ఆదిలోనే తెచ్చుకున్నారు. అంతకు పూర్వం కృష్ణుడుగా మాధవపెద్ది వేంకటరామయ్య నటించేవారట. ఆయన కృష్ణుడుగా స్థానం సత్యభామగా ఎంతో పేరు. రాధాకృష్ణలో సి.ఎస్.ఆర్. కృష్ణపాత్ర చూసిన స్థానం వారు ఆయన్ని శ్రీకృష్ణతులాభారంలో కృష్ణుడు వేయమని అడిగారు. పానుగంటివారు ఏ నాటకం రాసినా తెలుగు చందస్సు సీసపద్యాలు ఆటవెలదులు తేటగీతులు మాత్రమే రాస్తారు. సహజమైన హాస్యం ఆయన సొత్తు. దాన్ని కొన్నాళ్లు వేమూరి రామయ్య కృష్ణుడిగా కమలా చంద్రబాబు రాధగా ప్రదర్శించటం జరిగింది. ఏమైన శృంగార, హాస్య, భక్తిరసాలు ముప్పిరిగన్న మహానాటకం ఇది. ఈ నాటకం మహాగాయకుడు మంగళంపల్లి బాలకృష్ణ కృష్ణుడిగా, మహాగాయని శ్రీరంగం గోపాలరత్నమ్ రాధగా రేడియోలో ప్రసారమైంది. పృథ్వి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇందిరాదేవి, నేను రాధాకృష్ణులుగా రేడియోలో ప్రసారం చేశారు.

- అయ్యదేవర పురుషోత్తమరావు
9290448444




అనుపమ పరమేశ్వరన్

ప్రతిసారీ తపిస్తాను..!

మలయాళ సుందరి అనుపమ పరమేశ్వరన్ ప్రేమమ్‌తో మొదట మాలీవుడ్‌లో ఆ తర్వాత టాలీవుడ్‌లో పేరు తెచ్చుకుంది. పేరొచ్చిందని సినిమాల ఎంపికలో ఆరాటపడలేదు. దగ్గరకు వచ్చిన ప్రతి చిత్రాన్నీ ఒప్పుకోలేదు. నటించేందుకు ఏకొంతైనా అవకాశం ఉంటేనే సినిమాలు అంగీకరిస్తోంది. రంగస్థలం లాంటి కొన్ని ప్రాజెక్టులు ఆమె చేతిదాకా వచ్చి జారిపోయినా అధైర్యపడలేదు. ఇటీవల ఉన్నది ఒకటే జింగదీ వరకు అనుపమ అనుసరించిన పద్ధతి ఇదే. సౌఖ్యత లేని చిత్రంలో నేనుండను అని చెబుతుంటుందీ భామ. సినిమాల ఎంపిక విషయంలో అనుపమ మాట్లాడుతూ....నేను ఏ విషయంలోనూ ఊరికే సంతృప్తిపడలేను. ముఖ్యంగా నటనలో. ఒక సన్నివేశంలో నటించాక ...ఒకటి రెండు రోజుల దాకా ఇంకా బాగా చేసుండాల్సింది అని అనుకుంటాను. ప్రతి చిత్రంలో కొత్తగా కనిపించాలని భావిస్తాను. ప్రతిసారీ ఆ తపన ఉంటుంది. ప్రతిభ గల దర్శకులు నటీనటులతో పని చేయాలనుకుంటాను. నటిగా నాలో దురాశ ఎక్కువ. టాలీవుడ్‌లో నాయిక అంటే అందానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అయితే గ్లామర్ విషయంలో నాకు కొన్ని హద్దులున్నాయి. వాటిలోనే సినిమాలు చేస్తాను. అని చెప్పింది. ప్రస్తుతం అనుపమ తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తోంది. నాని సరసన కృష్ణార్జున యుద్ధం, వరుణ్ తేజ్‌తో తొలి ప్రేమలో కనిపించబోతోంది.

అపూర్వం భాగమతి విజయం

- చిత్ర దర్శకుడు అశోక్

రవీందర్



అనుష్క ప్రధాన పాత్రలో నటించిన చిత్రం భాగమతి. యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో దర్శకుడు అశోక్ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన భాగమతి అన్ని కేంద్రాల నుంచి మంచి స్పందన తెచ్చుకుంటోంది. సినిమా సూపర్ హిట్ అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు అశోక్, ఆర్ట్ డైరక్టర్ రవీందర్ భాగమతి సృష్టిస్తున్న చరిత్ర గురించి మాట్లాడారు. అశోక్ మాట్లాడుతూ...భాగమతికి వస్తున్న స్పందన అమితానందాన్ని కలిగిస్తోంది. ఏడాది సూపర్‌హిట్ భాగమతి అని ప్రేక్షకులు తేల్చారు. మంచి చిత్రానికి హీరో హీరోయిన్ అంటూ బేధం ఉండదు అనే విషయానికి మా సినిమా తాజా ఉదాహారణగా నిలిచింది. దెయ్యానికి మనిషిని మించిన మేధస్సు ఉంటుందనే అంశం ఆశ్చర్యపరుస్తోంది. తెలుగులోనే కాదు తమిళం, మలయాళం, కన్నడ నుంచి ఇదే స్పందన వస్తోంది. దక్షిణాదిలో మరే నాయిక చిత్రానికీ రానన్ని తొలి రోజు వసూళ్లు భాగమతికి దక్కాయి. విడుదలైన రోజు మధ్యాహ్నం షో ల నుంచి థియేటర్‌లను పెంచుతున్నారు. ఇది పూర్తిగా సాంకేతిక నిపుణుల సినిమా. ఆర్ట్ డైరక్టర్ రవి, సంగీత దర్శకుడు థమన్, సినిమాటోగ్రాఫర్ మది, ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు ఇలా....ప్రతి ఒక్కరూ చిత్రంలో భాగమయ్యారు. అన్నారు. ఆర్ట్ డైరక్టర్ రవీందర్ మాట్లాడుతూ....టెక్నీషియన్స్ సినిమా అనే పదానికి భాగమతి అసలైన అర్థం. మిగతా వాళ్లు తీరిక లేకుండా ఉండటం వల్ల దర్శకుడు నేనూ మేమిద్దరమే ఎప్పుడూ మాట్లాడుతున్నాం. అయితే రాని ప్రతి ఒక్క సాంకేతిక నిపుణుడి తరుపున భాగమతిని హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెబుతున్నాము. అన్నారు.

ఖమ్మం జిల్లా సీతారాంపురం అనే గ్రామానికి వలస వచ్చిన పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. అలా అతడ్ని అంతా నెల్లూరి పెద్దారెడ్డి అని పిలుస్తుంటారు, గౌరవిస్తుంటారు. నలుగురికి మంచిచేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. కథలో కొన్ని సన్నివేశాలు విషాదంగా సాగుతుంటాయి. వాటిని సమతూకం చేసేందుకు జబర్దస్త్ శాంతిస్వరూప్ లాంటి నటులతో చింతామణి నాటక రిహార్సల్స్ సన్నివేశాలను రూపొందించాం. ఈ ఎపిసోడ్ అంతా ప్రేక్షకులను బాగా నవ్విస్తుంటుంది. ఇలా అన్నిరకాల భావోద్వేగాలతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. గురురాజ్ సంగీతం, డాక్టర్ కమలాకర కామేశ్వరరావు సాహిత్యం చక్కగా కుదిరాయి. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తి కావొస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లో తొలికాపీ సిద్ధమవుతుంది. సెన్సార్ పూర్తవగానే ప్రేక్షకుల ముందుకు చిత్రాన్ని తీసుకొస్తాం. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని అన్నారు.

కథానాయకుడు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరి పెద్దారెడ్డి అనే పాత్ర ప్రేక్షకులకు తెలియంది కాదు. ఆ పెద్దారెడ్డి నవ్విస్తే...ఈ పెద్దారెడ్డి మీకు మరచిపోలేని అనుభూతిని అందిస్తాడు. ఇంతమంచి పాత్రను నాకు ఇచ్చిన వీజే రెడ్డికి కృతజ్ఞతలు. ప్రణాళిక ప్రకారం కేవలం 28 రోజుల్లోనే షూటింగ్ పూర్తిచేశాం. నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా పూర్తవుతున్నాయి.

నెల్లూరి పెద్దారెడ్డి ఆడియో విడుదల



సతీష్‌రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ నాయకానాయికలుగా రూపొందుతున్న చిత్రం నెల్లూరి పెద్దారెడ్డి. వీజే రెడ్డి దర్శకుడు. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై సి.హెచ్.రఘునాథరెడ్డి నిర్మిస్తున్నారు. కాగా గురురాజ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆడియో బిగ్ సీడీని ఆవిష్కరించిన అనంతరం దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ, పల్లె వాతావరణంలో ఆహ్లాదకరమైన కథాకథనాలతో ఈ చిత్రం సాగుతుంటుంది. నెల్లూరు నుంచి త్వరలోనే మీ ముందుకొస్తాం. మంచి చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాం అని అన్నారు.

వి.సాగర్ మాట్లాడుతూ, మంచి అవగాహనతో ఈ సినిమాను రూపొందించారని అర్థమవుతోందని పేర్కొనగా, గతంలో తాము సినిమాలు తీసే పరిస్థితి ఇవాళ లేదు. నేడు ప్రతిదశలో ఖర్చు నిర్మాతే భరించాల్సి వస్తోందని రేలంగి నరసింహారావు అన్నారు. ఎంతబాగా కథను చెప్పామన్నదే ప్రేక్షకులకు కావాల్సిందని, ఆ విషయంలో తప్పకుండా ఈ చిత్రం అలరింపజేస్తుందన్న నమ్మకం ఉందని ఆయన అన్నారు.

ఆపరేషన్ 2019... బివేర్ ఆఫ్ పబ్లిక్



శ్రీకాంత్, యజ్ఞశెట్టి నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం ఆపరేషన్ 2019. దీనికి బివేర్ ఆఫ్ పబ్లిక్ అన్నది ఉపశీర్షిక. కరణం బాబ్జి దర్శకుడు. అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై అలివేలు నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ రిపబ్లిక్ డే సందర్భంగా హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెబల్‌స్టార్ కృష్ణంరాజు టీజర్‌ను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ, శ్రీకాంత్ నాకు తమ్ముడుగా సింహగర్జనలో నటించాడు. ఆ తర్వాత నాన్నకు పెళ్లి సినిమాలో కొడుకుగా నటించాడు. తను మంచి నటుడే కాదు. మంచి మనసున్న వ్యక్తి కూడా. గతంలో చేసిన ఆపరేషన్ దుర్యోధన చిత్రం తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తాజాగా నటిస్తున్న ఈ చిత్రం కూడా బావుంటుందన్న నమ్మకం ఉంది. బివేర్ ఆఫ్ పబ్లిక్ అనే ఈ సినిమా ఉపశీర్షిక చూసిన తర్వాత నాకు ఓ విషయం గుర్తొస్తోంది. రెండుసార్లు లోక్‌సభ సభ్యుడిగా నేను పోటీచేసి గెలుపొందిన తర్వాత మారిన పరిస్థితులను సమీక్షిస్తే చాలా ఆశ్చర్యకరంగా ఉంది. కొందరు వ్యాపారవేత్తలు రాజకీయాల్లోకి ప్రవేశించి ఓట్లను నోట్లతో కొంటున్నారు. పబ్లిక్‌కు కూడా డబ్బుపై ఆశ పెరిగింది. వారిని మార్చేవిధంగా సినిమాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ చిత్రం ప్రజలను చైతన్యవంతపరిచేవిధంగా ఉంటుందని భావిస్తున్నాను. గతంలో ఆపరేషన్ దుర్యోధన చిత్రం శ్రీకాంత్‌కు ఎంత పేరు తెచ్చిపెట్టిందో ఈ చిత్రం కూడా ఆ స్థాయిలో పేరు తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నా అని అన్నారు.

హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, కృష్ణంరాజుగారితో కలిసి రెండు చిత్రాల్లో నటించిన దగ్గర్నుంచి వారితో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. ఈ చిత్రం టీజర్ వారి చేతులమీదుగా విడుదల కావడం సంతోషంగా ఉంది. గతంలో కరణం బాబ్జీ దర్శకత్వంలో మెంటల్ పోలీస్ చిత్రం చేశాను. కానీ టైటిల్ వివాదం, విడుదల సందర్భంగా చోటుచేసుకున్న సమస్యల వల్ల ఆ సినిమాకు అనుకున్నంత పేరు రాలేదు. ఈసారి ఎలాంటి వివాదం లేకుండా మంచి కంటెంట్‌తో సినిమా చేద్దాం అన్నాను. ఇందులో వివాదం ఉన్నా కంటెంట్ బావుంది. కచ్చితంగా అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది. షకీల్ ఆరు అద్భుతమైన పాటలిచ్చారు అని చెప్పారు.

దర్శకుడు కరణం బాబ్జీ మాట్లాడుతూ, మెంటల్ పోలీస్ తర్వాత శ్రీకాంత్ కాంబినేషన్‌లో నేను చేసిన మరో చిత్రమిది. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు చేయబోయే షెడ్యూల్‌తో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. శ్రీకాంత్‌తో పాటు ఇందులో మరో ఇద్దరు యువ నటులు నటించారు. త్వరలో వారెవరన్నది ప్రకటిస్తాం అని చెప్పారు.

నిర్మాత అలివేలు మాట్లాడుతూ, ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణకు రెబల్‌స్టార్ కృష్ణంరాజు దంపతులు వచ్చి ఆశీర్వదించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, నటీమణులు దీక్షాపంత్, హరితేజ, నటులు శివకృష్ణ నాగినీడు తదితరులు పాల్గొన్నారు.



బంగారి బాలరాజు టీజర్ విడుదల

రాఘవ్, కరాణ్యకత్రీన్, మీనాకుమారి తదితరులు ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం బంగారి బాలరాజు. కోటేంద్ర దుద్యాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నంది క్రియేషన్స్ పతాకంపై కె.ఎం.డి.రఫీ, రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం గ్లిట్టర్‌ను ప్రముఖ దర్శకుడు సురేందర్‌రెడ్డి విడుదలచేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, బంగారి బాలరాజు టీజర్‌ను చూశాను. చాలా బాగుంది. కొత్తగా వస్తున్న ఈ చిత్ర నిర్మాతలతో పాటు ఇతర చిత్రబ0త్యుందానికి సక్సెస్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని అన్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ, సురేందర్‌రెడ్డి తాను చేస్తున్న సైరా...చిత్రంతో బిజీగా ఉన్నా తమ చిత్రం టీజర్‌ను విడుదల చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేస్తున్నామని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను ఫిబ్రవరి 14న, సినిమాను మార్చిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఈ చిత్రంలో దూకుడు శ్రవణ్, ఎన్.వి.చౌదరి, సారిక రామచంద్రరావు, కిరాక్ ఆర్.పి., జబర్దస్త్ బాబి, బి.వి.చౌదరి, సదర్శన్ దోర్నాల్, జయభారత్‌రెడ్డి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: జి.ఎల్.బాబు, సంగీతం: చిన్నికృష్ణ చిట్టిబాబు రెడ్డిపోగు, ఆర్ట్: కృష్ణమాయ.

